జులై
2016

123

సంపుటి : 11 సంచిక : 3 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

25 ఏళ్ల సరళీకరణ విధానాలు: అనుభవాలు
హిందూ చట్టంలో సంస్కరణల కోసం డా॥ అంబేద్కర్ పోరాటం
కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం
వృద్ధిరేటు - అభివృద్ధి
వామపక్ష వెల్లువను వమ్ముచేసే కుట్రలు
అమెరికా స్క్రీన్‌ప్లే, మోడీ యాక్షన్
'గుజరాత్ ఫైల్స్'
జాతీయవాదం - హిందూత్వ
విలక్షణ విప్లవకారుడు కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు



## విలక్షణ విప్లవకారుడు

# కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు

యు రామకృష్ణ

ఆయన చదివింది కేవలం పెద్ద బాలశిక్ష మాత్రమే. అయితేనేం? లోకాన్ని చదివిన అనుభవంతో ఉపాధ్యాయుడుగానూ పనిచేశారు. బతుకుదెరువుకు పాలేరుగా పని చేస్తేనేం?. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో, వామపక్ష నేతల సాహచర్యంతో గొప్ప పోరాట యోధుడే అయ్యారు. ఆయన సమాజంలోని అసమానతలకూ.. దోపిడీకీ మూలమేమిటో, దానికి ఊపిరి ఎక్కణ్నుంచి వస్తున్నదో క్షుణంగా తెలుసుకున్నారు. దోపిడీ పోవాలంటే పోరాటమే మార్గమని నమ్మారు. కనుకనే తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. జమీందారులనూ, జాగీర్దారులనూ ప్రతిఘటించారు. రహస్య జీవితమూ గడిపారు. ఎంతోమంది ముఖ్య కార్యకర్తలను ఉద్యమానికి అందించారు. చట్ట సభలకూ ఎన్నికయ్యారు. మూడుసార్లు శాసనసభ్యుడుగా ఎన్నికై శాసనసభా వేదికపై పీడిత జనవాణిని, పార్టీ వాణిని ప్రతిభావంతంగా వినిపించారు. మూర్తికట్టినట్లు రైతు తరహాగా కనిపించే ఆయనే విలక్షణ విప్లవకారుడు కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు.

బోడేపూడి వెంకటేశ్వరరావు 1924 ఏప్రిల్ 2న మధిర తాలూకా తొండల గోపవరంలో సీతయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వారికాయన పెద్ద కుమారుడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. తన మేనమామ వద్ద పాలేరుగా పనిచేయడానికి ఏడేళ్ల ప్రాయంలో వైరా మండలం గండగలపాడుకు వచ్చారు. బోడేపూడి ప్రత్యేకంగా బడిలో చదవలేదు. పెద్దబాలశిక్ష చదివారు. ప్రైవేటు టీచరుగా పనిచేశారు. (ఆయన వద్ద చదువుకున్న పలువురు తర్వాత కాలంలో రాష్ట్ర స్థాయి అధికారులు అయ్యారు. ఒకరు ఐపిఎస్ ఆఫీసరు అయ్యారు). 1939లో మహాత్మా గాంధీ తరఫున రాష్ట్రానికి వచ్చిన స్వామీ రామానంద తీర్థ చేపట్టిన సత్యాగ్రహాన్ని చూసి కాంగ్రెస్ వైపు ఆకర్షితులయ్యారు. 1942లో ఆంధ్ర మహాసభలో చేరారు. అందులో చురుకైన కార్యకర్తగా ఎదిగారు. ఈ విషయంలో ఆయనపై వట్టికొండ నాగేశ్వరరావు ప్రభావమెంతో ఉండేది.

వట్టికొండ నాగేశ్వరరావు 1930 దశకానికి పూర్వం నుంచే స్వాతంత్రోద్యమంలో పని చేస్తున్నారు. ఆయన ఆచార్య రంగా నేతృత్వంలో రాజకీయ కార్యకలాపాలను కొనసాగిస్తుండేవారు. స్వామీ రామానంద తీర్థ, జమలాపురం కేశవరావు వంటివారి పరిచయాలతో వాళ్లతో కలిసి నిర్బంధాలను లెక్క చేయకుండా రహస్య కార్యకలాపాలు నిర్వహించారు. క్యాంపులు, రాజకీయ తరగతులు నడుపుతూ అకుంఠిత దీక్షతో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. నాటి వరంగల్ జిల్లాలోని వామపక్ష నేతల సాహచర్యంతో నైజాముకు వ్యతరేకంగా భూమి, భుక్తి, బానిసత్వ విముక్తి కోసం కొనసాగిన తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ముఖ్యనాయకుడిగా ఎదిగారు. మొక్కవోని దీక్షతో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. చంద్రుగొండ సమీపంలోని గుంపెన సాయుధ పోరాటం కూడా ఒక ముఖ్యమైన ఘట్టమే. ఆ పోరాటంలో పాల్గొన్నవారిని నిర్బంధించడానికి బ్రిటీషు సైనికులు వెంటపడితే ఆయన మరో ఇద్దరితో కలిసి ఇరవై అడుగుల బురద బావిలోకి దూకారు. అందులోనే రెండు రోజుల పాటు బురదనీళ్లు తాగి ప్రాణాలను నిలబెట్టుకుంటూ మిలటరీకి చిక్కకుండా సంకల్పసిద్ధితో వారి బారి నుంచి తప్పించుకొని తిరిగి పోరాటంలో పాల్గొన్నారు. అంతటి గొప్ప పోరాట యోధుడైన వట్టికొండ నాగేశ్వరరావు స్ఫూర్తితో బోడేపూడి 1944లో ఆంధ్ర మహాసభలో చేరారు.

బోడేపూడి ఆంధ్ర మహాసభలో పని చేస్తున్న రోజుల్లోనే ప్రజా నాట్యమండలి కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారు. ఆనాటి సీనియర్ కళాకారులు అందించిన శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. అందులో ఆయన పద్యాలు, పాటలు లయబద్ధంగా పాడగల శిక్షణ పొందారు. ఆ కాలంలోనే కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ కార్యకర్తలైన చంద్ర రాజేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, ఎస్.వి.కె.ప్రసాద్ వంటి నాయకులతో సంబంధాలేర్పడ్డాయి. ఆంధ్ర మహాసభ చీలిన తరువాత ఖమ్మంలో జరిగిన మహాసభను విజయవంతం చేయడంలో ప్రధాన భూమికను పోషించారు. మొదటిసారిగా జాతీయ జెండాను ఎగురవేసి తన దేశభక్తిని నిరూపించుకున్నారు. జమలాపురం కేశవరావు, నల్లమల గిరిప్రసాద్, దేపూరి శేషగిరిరావు వంటి నాయకులతో కలిసి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదారు. తన 20 ఏళ్ల వయస్సులో గండగలపాడుకే చెందిన ధనమ్మను వివాహమాడారు.

1945-46లో గండగలపాడులో లెవీ ధాన్యం నిర్బంధ వసూలు, పట్వారీల జులుం, జమీందార్ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతున్నాయి. పట్వారీల దస్త్రాలను తగులబెట్టడం, పన్నుకు వ్యతిరేకంగా తాటిచెట్లు నరకడం, ప్రభుత్వ కార్యాలయాలపై జెండాలను కట్టడం, జాగీర్దార్ల దౌర్జన్యాలను ప్రతిఘటించడం, రజాకారులను ఎదుర్కోవడం వంటివి జరుగుతున్నాయి. వాటిలో ఆయన పాల్గొనటమేగాక, వైరా చుట్టుపక్కల వందలాది గ్రామాల్లో నిజాం వ్యతిరేక పోరాటంలోనూ, వెట్టి చాకిరీ వ్యతిరేక పోరాటంలోనూ కీలకపాత్ర నిర్వహించారు.

కమ్యూనిస్టు ఉద్యమంపై అటు నైజాం పాలకులు, ఇటు దేశీయ పాలకులు నిర్బంధాన్ని ప్రకటించగా కొంతకాలంపాటు పార్టీ నాయకత్వం అజ్ఞాతంలో ఉండి పనిచేయవలసి వచ్చింది. 1947 నుంచి బోడేపూడి కూడా రహస్య జీవితం గడిపారు. ఆ కాలంలో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా, మద్రాసు లోనూ అజ్ఞాతవాసం చేశారు. ఆ సమయంలోనే కొత్తగూడెం సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘ నాయకుడు దేపూరి శేషగిరిరావుకు కొరియర్‌గా పనిచేశారు.

ఆ కాలంలో సింగరేణిలో తెల్లదొరల దౌర్జన్యాలు, నైజాం మూకల స్వైర విహారమూ, కాంట్రాక్టర్ల దోపిడీ రాజ్యమేలుతోంది. సింగరేణి కార్మికుల పక్షాన పనిచేసేందుకు నెల్లూరు జిల్లాలోని పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడు దేపూరి శేషగిరిరావును పుచ్చలపల్లి సుందరయ్య సింగరేణి బొగ్గు గనులకు పంపించారు. అలా అక్కడికి వెళ్లిన శేషగిరిరావు సింగరేణిలోని కార్మికుల దుర్భర దారిద్ర్య పరిస్థితులను అవగతం చేసుకొని కాంట్రాక్టర్ల దోపిడీ విధానాలపై తిరుగుబాటు చేశారు. పర్సా సత్యనారా

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. విలక్షణ విప్లవకారుడు కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు
యు. రామకృష్ణ ....2

2. 25 ఏళ్ల సరళీకరణ విధానాలు: అనుభవాలు
ప్రకాశ్ కరత్ ....4

3. హిందూ చట్టంలో సంస్కరణల కోసం డా॥ అంబేద్కర్ పోరాటం
బృందాకరత్ ....9

4. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం
ఎస్ వీరయ్య .... 14

5. వృద్ధిరేటు - అభివృద్ధి
బి. తులసీదాస్ ....17

6. వామపక్ష వెల్లువను వమ్ముచేసే కుట్రలు
ఎస్. వెంకట్రావు ....20

7. అమెరికా స్క్రీన్‌ప్లే మోడీ యాక్షన్
ఎ. కోటిరెడ్డి .... 23

8. 'గుజరాత్ ఫైల్స్'
రానా ఆయూబ్ .... 26

9. జాతీయవాదం హిందూత్వ
ఏజి నూరాని .... 29

**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248**
**మేనేజర్: 040-27673787**
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org

# ప్రాధామ్యాలు

**ఢి**ల్లీ నుండి ఆగ్రా వరకు బుల్లెట్ రైలు ప్రారంభించాలని మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తలపోశారు. వెంటనే ఆ ప్రాజెక్టుకు రూ. 50,000 కోట్లు కేటాయించారు. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చైనా వెళ్లి అక్కడ బుల్లెట్ రైలు చూసి ముచ్చట పడి హైదరాబాద్-అమరావతి మధ్య అటువంటి రైలు ప్రారంభించేందుకు చర్చలు జరిపి వచ్చారు. భారత దేశానికి బుల్లెట్ రైలు కావాలా వద్దా అంటే కచ్చితంగా కావాలనే చెబుతారు. కానీ ఎప్పుడు? బాధ్యతగల ఏ ప్రభుత్వమైనా ముందు మన దేశంలో సామాన్య ప్రజలు తిరిగే రైల్వేలను బాగుచేసి తరువాత బుల్లెట్ రైలు సంగతి చూడాలి. ప్రపంచంలో అతి పెద్ద పబ్లిక్ పాయఖానాలు ఏవంటే భారతీయ రైళ్లు. ఎందుకంటే ప్రయాణీకుల మలమూత్రాలన్నీ ట్రాక్‌లమీద పడడమే. దేశంలో మొత్తం 31, 864 రైల్వే క్రాసింగులున్నాయి. వాటిలో 13,530 క్రాసింగులకు గేట్లు కూడా లేవు. ఈ క్రాసింగుల వద్ద ఏటా 400 మంది ప్రజలు ప్రమాదాల్లో చనిపోతున్నారు. అన్ని క్రాసింగుల్లో ఫ్లైఓవర్లు నిర్మించడానికి రూ. 35,000 కోట్లు ఖర్చవుతుంది. మన పాలకుల ప్రాధామ్యాల్లో బుల్లెట్ రైళ్లు ఉన్నాయిగానీ ఈ ఫ్లై ఓవర్లు లేవు. రైళ్లలో మరుగుదొడ్లు, ప్రజలకు సంబంధించిన ఇతర సదుపాయాలు లేవు.

ప్రపంచంలోనే భారత దేశం అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం అని పాలకులు ఘనంగా చెబుతున్నారు. ఏటా జిడిపి 7.6 శాతం అభివృద్ధి చెందుతున్నదని చెబుతున్నారు. కానీ ఇదంతా ఎక్కడికి పోతోంది? భారత జిడిపిలో 4 శాతం ఖర్చు చేస్తే దేశంలోని ప్రజలందరికీ పింఛను ఇవ్వచ్చుననీ, ప్రాథమిక వైద్యసదుపాయాలు కల్పించవచ్చుననీ, ఉపాధి, శిశుమరణాల నివారణకోసం పథకాలు ప్రారంభించి ప్రజలకు సామాజిక భద్రత కల్పించవచ్చుననీ ఐక్యరాజ్య సమితికి చెందిన 2015 మానవాభివృద్ధి నివేదిక తెలిపింది. బుల్లెట్ రైళ్ల గురించీ, ప్రపంచ స్థాయి ఆధునిక నగరాలు, పట్టణాల నిర్మాణం గురించీ, ఇంటింటికీ ఇంటర్ నెట్ గురించీ తెగ హైరానా పడిపోతున్న మన పాలకులు కేవలం 4 శాతం జిడిపి ఖర్చు చేసి పిల్లలకు పోషకాహారం, వైద్యం అందించే విషయం గురించి ఎందుకు ఆలోచించడం లేదు. ఐక్యరాజ్య సమితి అంచనాల ప్రకారం మన దేశంలో ప్రతి నిమిషానికి నలుగురు పిల్లలు, ఏటా 21 లక్షల మంది 5 ఏళ్లు నిండకుండానే మరణిస్తున్నారు. ప్రపంచంలోని పౌష్టికాహార లోపం గల పిల్లల్లో 30 శాతం మంది భారత్‌లోనే ఉన్నారు. పేదరికానికి మారుపేరుగా చెప్పుకునే సబ్‌సహారా దేశాల్లోకన్నా రెట్టింపు ఇక్కడ ఉన్నారు. కారణం... తల్లీ, పిల్లలకు సరైన ఆహారం, వైద్యం లేకపోవడం. ప్రతిరోజూ 1000 మంది భారత చిన్నారులు విరేచనాలతో చనిపోతున్నారు. చిన్నపాటి వైద్యం అందిస్తే వారు బతుకుతారు. మరి స్మార్ట్ సిటీల నిర్మాణానికి ఆఘమేఘాలపై చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు ఎందుకు వీరి గురించి ఆలోచించడం లేదు? ప్రపంచ ఆకలి సూచీ (జిహెచ్ఐ)లో భారత దేశం అత్యంత నికృష్టమైన 20 దేశాల్లో ఒకటిగా ఉంది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, భూటాన్ మన కన్నా మెరుగ్గా ఉన్నాయని 2015 ఆకలి సూచీ తెలియజేస్తున్నది. ప్రపంచ స్థాయి వినోద, విహార కేంద్రాలను నిర్మిస్తామని చెబుతున్న మన పాలకులు ప్రజల ఆకలి గురించి పట్టించుకోరెందుకు?

ఇవన్నీ చూస్తే ఒక్క విషయం బోధపడుతుంది. మన పాలకుల ప్రాధామ్యాలు సరిగా లేవు. పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లు విదేశాలను చూసి మన ప్రాధామ్యాలు మార్చుకుంటే, మన సంపదలను తక్షణం అవసరమైన పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, పౌష్టికాహార సరఫరా, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి వాటికి ఖర్చు చేయకుండా అనవసరమైన వాటికి ఖర్చు చేస్తే దేశం అభివృద్ధి కాదు సరికదా మరింత అధోగతిపాలవుతుంది. ధనవంతులైన కొద్దిశాతం ప్రజలను దృష్టిలో పెట్టుకొని విస్తారమైన సామాన్య ప్రజల అవసరాలు పట్టించుకోకపోతే మన దేశం ఈ దుస్థితి నుండి బయటపడదు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పేదరికం, పౌష్టికాహార లోపం, నిరక్షరాస్యత, రోగాలూ రొష్టులు ఉన్నాయంటే మన పాలకుల విధానాల్లో పెద్ద లోపం ఉన్నట్లే లెక్క. ఆ లోపాన్ని సరిదిద్దాలంటే వారి ప్రాధామ్యాల్లో మార్పు రావాలి. పోరాటాల వత్తిడి పెరిగితేనే ఆ మార్పు వస్తుంది.

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# 25 ఏళ్ల సరళీకరణ విధానాలు: అనుభవాలు

**ప్రకాశ్ కరత్**



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

*ఏప్రిల్ 17వ తేదీన విజయవాడలో జరిగిన మాకినేని బసవపున్నయ్య వర్ధంతి సభలో **ప్రకాశ్ కరత్** చేసిన ప్రసంగాన్ని పాఠకులకు అందిస్తున్నాం.*

**మా**కినేని బసవ పున్నయ్య స్మారక ఉపన్యాసంఇవ్వడానికి నన్ను ఆహ్వానించినందుకు గాను ముందుగా ఎం బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, ప్రజాశక్తి బుక్‌హౌస్ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. '25 సంవత్సరాల సరళీకరణ – దాని అనుభవాలు' అనే అంశంపై ప్రసంగించాలని కూడా నన్ను వారు కోరారు. భారత కమూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సైద్ధాంతిక నిర్మాతల్లో కామ్రేడ్ బసవ పున్నయ్య ముందు వరుసలో ఉంటారు. ఇప్పుడే ఆయన రాసిన రెండు సంపుటాలను ఆవిష్కరించాము. గతంలో ఇంకో రెండు సంపుటాలను విడుదల చేశారు. మార్క్సిస్టు సిద్ధాంతంపైనా, వర్ధమాన రాజకీయ పరిణామాలపైనా, ముఖ్యమైన అంతర్జాతీయ ఘటనలపైనా కార్మికోద్యమ కోణంలో ఆయన రచనలు ఉండేవి. తత్వశాస్త్ర సంబంధ విషయాలపైనా, దేశంలో సామాజిక సమస్యలపైనా మాకినేని ఎన్నో రచనలు చేశారు. కామ్రేడ్ మాకినేని బసవ పున్నయ్య ఇప్పుడు గనుక ఉండివుంటే దేశంలో అమలౌతున్న సరళీకరణ విధానాలు, మన సమాజంపై వాటి ప్రభావాలపై చాలా తీక్షణమైన రచనలు సాగించేవారు. దురదృష్టవశాత్తూ ఆయన 1992లో కన్నుమూశారు. అప్పుడప్పుడే అంటే 1991లో దేశంలోకి సరళీకరణ విధానాలు అడుగుపెట్టాయి. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో చోటుచేసుకుంటున్న పరిణాలను మార్క్సిస్టు దృక్పథంలో మాకినేని తన రచనల్లో చర్చించేవారు. దేశంలో గత 25 ఏళ్లలో చోటు చేసుకున్న పరిణామాలను, ముఖ్యంగా సరళీకరణ, నయా ఉదారవాద విధానాల ప్రభావాలను పరిశీలించడంలోనూ, అవగాహన చేసుకోవడంలోనూ మాకినేని రచనలు మనకెంతగానో ఉపయోగపడతాయి.

సరళీకరణ విధానాలు అమల్లోకి వచ్చి ఈ ఏడాదికే 25 సంవత్సరాలైనట్లు మనమెందుకు చెబుతున్నాము? ఎందుకని 1991వ సంవత్సరాన్నే దేశంలో సరళీకరణ విధానాల ప్రారంభ సంవత్సరంగా చెబుతున్నాము. దానికి కారణముంది. 1991లో కేంద్రంలో పివి నరసింహారావు ప్రభుత్వం అధికారంలో వుండేది. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండేవారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం పివి ప్రభుత్వం 1991 జులైలో తొలి బడ్జెట్ ప్రవేశపెట్టింది. నాటి బడ్జెట్‌లోనే భారత ప్రభుత్వం తొలిసారి అధికారికంగా ఆర్థిక సంస్కరణల ప్రతిపాదనలను ముందుకు తీసుకొచ్చింది. అందువల్లే 1991 సంవత్సరాన్ని సరళీకరణ విధానాలకు నాందిగా చెప్పుకుంటున్నాము. నాటి నుంచే సరళీకరణ విధానాల అమలు ప్రక్రియ దేశంలో ప్రారంభమైంది. అదే సమయంలో ఈ సరళీకరణ ప్రక్రియ సమయోచితంగానో లేదా అకస్మాత్తుగానో వచ్చిందేమీ కాదనీ, దేశానికి అవసరమైనందున తీసుకొచ్చిందేమీ కాదనీ మనం అర్థం చేసుకోవాల్సిన అవసరముంది. ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థ, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి వ్యవస్థల అవసరాల రీత్యానే భారతదేశంలో సరళీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 1980లలో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మరింతగా అభివృద్ధి చెంది బలోపేతమైంది. ప్రపంచీకృతమైన ఈ ద్రవ్య పెట్టుబడి అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లోని ఆర్థిక వ్యవస్థలపైనా ఆధిపత్యం చలాయించడం మొదలుపెట్టింది. పెట్టుబడులు పెట్టిన వెనువెంటనే లాభాలు దండుకునేందుకు వీలున్న ప్రదేశాలను అన్వేషిస్తూ ప్రపంచమంతటా ద్రవ్య పెట్టుబడి విస్తరిస్తూ వచ్చింది. ఈ రకమైన ద్రవ్య పెట్టుబడి వివిధ దేశాల్లోనూ, రాష్ట్రాల్లోనూ ఉత్పాదక పెట్టుబడిపై ఆధిపత్యం ఛలాయిస్తూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారి విధానం యొక్క కొత్త ముఖాన్ని ప్రస్ఫుటింపజేసింది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ సమయంలోనూ, నయా ఉదారవాద విధానాల ఫలితంగానూ ప్రపంచీకృత ద్రవ్య పెట్టుబడి యొక్క ఆధిపత్య దోరణి బలోపేతమైంది. నేనిప్పుడు ఆ చరిత్రలోకి వెళ్లదల్చుకోలేదు.

అమెరికాలో అధ్యక్షులు రీగన్, బ్రిటన్ ప్రధాని థాచర్‌ల హయాంలో 1980లలోనే ఆ ప్రభుత్వాలు నయా ఉదారవాద విధానాలు అమల్జేసేందుకు పూనుకున్నాయి. అనతికాలంలోనే అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లోనూ నయా ఉదారవాద విధానాలు అమల్లోకి వచ్చాయి. ప్రపంచ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం కొనసాగుతున్న కాలమది. అదే సమయంలో సోషలిస్టు దేశాలు, ప్రత్యేకించి సోవియట్ యూనియన్ బలహీనపడుతూ వచ్చాయి. ఆర్థికంగానూ బలహీనపడ్డాయి. 1991–92లో చివరకు సోవియట్ యూనియన్ పతనమైంది. ఒకవైపు కొత్తగా వచ్చి, చాలా దూకుడుగా పెట్రేగిపోతున్న ద్రవ్య పెట్టుబడి, మరోవైపు ప్రపంచంలో సోషలిస్టు వ్యవస్థ బలహీనత, పతనాలు ఏకకాలంలో జరిగిన ఘటనలు మాత్రమే కాదు. ప్రభుత్వ ప్రాయోజిత, ప్రభుత్వ నిర్దేశిత పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తూ వచ్చిన భారత్ లాంటి దేశాలు ఆ తరహా పెట్టుబడిదారీ విధానాలను, అభివృద్ధి నమూనాలను వదిలేసేందుకు సిద్ధపడిన మలుపు కూడా. మేము కూడా సరళీకరణ బాటలో పయనిస్తామని, నయా ఉదారవాద విధానాలు అమలు చేస్తామని భారత పాలక వర్గాలు అంగీకరించిన సందర్భమది.

1947 నుంచి 1991 వరకు ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో

> **“ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య రంగం చాలా కీలకమైనది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నియంత్ర ణలోకి తెచ్చుకోవాలని తహతహలాడుతోంది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం అంతర్జా తీయ ద్రవ్య పెట్టుబడి ప్రమాద ఘంటికలకు నిదర్శనంగా నిలిచింది. ”**

భారత ప్రభుత్వం క్రియాశీలంగా ఉండేది. దేశంలోని పెట్టుబడిదారీ వ్యవస్థకు సహాయం చేయడం, ప్రోత్సహించడం వంటి విధానాలు అమల్జేసింది. అలాగే విదేశాల నుంచి ముంచు కొస్తున్న పోటీ నుంచి భారత పరిశ్రమలు తట్టుకునేందుకు వీలుగా ఎక్సైజ్ సుంకాలు, దిగుమతి సుంకాలు వంటివి విధిస్తూ వచ్చింది. దీనికితోడు వ్యవసాయరంగంలో ప్రభుత్వం గణనీయంగా పెట్టుబడులు పెట్టింది. ఇవన్నీ కూడా దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని పెంచాయి. ఆర్థిక సంస్కరణల కాలంగా చెప్పు కుంటున్న 1991లో దీనికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఆర్థిక సంస్కరణలు అంటే సానుకూ లతతో కనిపిస్తాయి. సంస్కరణలు ఎప్పుడూ మంచివే. అందువల్లే నేను వీటికి 'సంస్కరణలు' అనే పదాన్ని వాడదల్చుకోలేదు. వీటిని నయా ఉదారవాద విధానాలు, నయా ఉదారవాద సంస్కరణలుగానే చెప్పదల్చాను.

నయా ఉదారవాద విధానాలు వచ్చిన తర్వాత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి మన ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడం మొదటిది. రెండోది ఆర్థిక వ్యవస్థ నియంత్రణ నుంచి ప్రభు త్వం తప్పుకోవడం. మూడోది ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలను ప్రయివేటీకరించడం. నాలు గోది పూర్తిగా మార్కెట్‌తో కూడిన విధానాలు అమలు చేయడం. ఐదోది ప్రభుత్వ జోక్యంలో మార్పులు : బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు సంపదను పోగు చేసుకోవడానికి ప్రస్తు తం ప్రభుత్వం నేరుగా వారికి సహకరిస్తోంది. భూములు తీసుకోవడం ద్వారా, ఖనిజ వనరు లను కొల్లగొట్టడం ద్వారా వారు సంపదను పోగేసుకుంటున్నారు. గతంలో ప్రజల సమిష్టి ఆస్తిగా ఉండే అన్ని రకాల వనరులూ ఇప్పుడు బడా పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లిపోతు న్నాయి. 1991లో ఈ ప్రక్రియ మొదలై ఇప్పటికీ కొనసాగుతున్నది. భారతదేశంలో కొన్ని ప్రాంతా ల్లో ఇవి చాలా వేగంగా అమలు అవుతుండగా, ప్రతిఘటన, వ్యతిరేకతల వల్ల కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా అమలు కావడం లేదు. దానికి కారణం ట్రేడ్ యూనియన్లు, కార్మికోద్యమాలు, ప్రజాందో ళనలు, కర్షకోద్యమాల నిర్మాణం ద్వారా ఎదురౌతున్న వ్యతిరేకత, ప్రతిఘటనలే. ఆర్థిక రంగాన్ని ఉదాహరణగా తీసుకొండి. భారత దేశంలో నేటికీ ప్రభుత్వ లేదా జాతీయ రంగమే ఆర్థిక అవనికలో పైచేయిగా ఉంటోంది. బ్యాం కులు, బీమా కంపెనీలు, పింఛను నిధి మొదలై నవి దీనికి ఉదాహరణ. అయితే మెట్టుమెట్టుగా ప్రభుత్వాలన్నీ వీటిని ప్రయివేటు పరం చేస్తూ వస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ నేతృత్వం



ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ

లోని ప్రభుత్వాలకు, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాలకు తేడాలేదు. బిజెపి దూకుడుగా అమలు చేస్తున్నది. బీమారంగంలో ప్రయివేటు, విదేశీ సంస్థలకు తలుపులు బార్లా తెరవడంలో మనం ఈ విషయం గమనించవచ్చు. తీవ్ర ప్రతిబంధకాలు ఎదురౌతున్నా కూడా బీమా కంపెనీల్లోకి ఎఫ్‌డిఐలను ఆహ్వానించడం ద్వారా విదేశీ భాగస్వామ్యాన్ని పెంచుతున్నారు. చాలాకాలంగా బీమా రంగంలో 26 శాతం ఉన్న ఎఫ్‌డిఐలను ప్రస్తుత మోడీ ప్రభుత్వం 49 శాతానికి పెంచింది. దానర్థం దేశంలోని బీమా కంపెనీలు 49 శాతం విదేశీ కంపెనీల భాగస్వామ్యంతో నడుస్తాయి. అంటే వాటిపై విదేశీ కంపెనీలే ఆధిపత్యం చలాయిస్తాయి. బ్యాంకింగ్ రంగంలోకి కూడా ప్రస్తుతం ప్రయి వేటు కంపెనీలను ఆహ్వానిస్తున్నారు. మన్మోహన్ సింగ్ చాలా ప్రయత్నం చేసినా ఆయన విఫల మయ్యారు. భారతదేశంలోని ప్రయివేటు బ్యాం కుల్లో 74 శాతం పెట్టుబడి పెట్టేందుకు విదేశీ కంపెనీలు, బ్యాంకులకు మోడీ సర్కార్ వీలు కల్పించింది. 74 శాతమంటే పూర్తిగా నియం త్రిత వాటా. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు నేటికీ ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉన్నా ప్రభుత్వ వాటాను తగ్గించుకునేందుకు గతంలోనే మొదలైన ప్రక్రియ ఇప్పుడు వేగవంతమౌతోంది. మొదట్లో వంద శాతముండే ప్రభుత్వ వాటా క్రమేపి 90 శాతానికి, ఆ తర్వాత 80 శాతానికి, చాలా బ్యాంకుల్లో 70 శాతానికి, కొన్ని బ్యాంకు ల్లో 62 నుంచి 55 శాతానికి కుదించుకుపో తోంది. మోడీ ప్రభుత్వం ఇప్పుడు దీనిని 50 శాతం కంటే తక్కువకు కుదిస్తామని చెబుతోంది. అంటే దానర్థం జాతీయ బ్యాంకులను ప్రయివేటు బ్యాంకులుగా మార్చడమే. వ్యతిరేకత ఉన్నా, ప్రతిబంధకాలు ఎదురౌతున్నా ఈ ప్రక్రియ కొన సాగుతున్నది. ఇలా ప్రయివేటు పరం చేయాలని ప్రభుత్వాలు ప్రయత్నించిన మొదటి బ్యాంకు ఐడిబిఐ. పెట్టుబడుల ఉపసంహరణ (డిజిన్వెస్ట్ మెంట్) ద్వారా మెజార్టీ వాటాను విక్రయించా లని భావించారు. దానివల్ల ప్రభుత్వ వాటా మైనార్టీలోకి పడిపోతుంది. ఇది అమలు కాలే దు. కానీ ఆ యత్నాలకు ఉదాహరణగా నిలిచిం ది. బ్యాంకు యూనియన్లు, ఉద్యోగులు ధీరోచితం గా పోరాడి అడ్డుకుంటున్నారు. అయితే పాలకుల ఉద్దేశం మాత్రం చాలా స్పష్టంగా ఉంది.

ఆధునిక ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య రంగం చాలా కీలకమైనది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టు బడి మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నియంత్ర ణలోకి తెచ్చుకోవాలని తహతహలాడుతోంది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం అంతర్జా తీయ ద్రవ్య పెట్టుబడి ప్రమాద ఘంటికలకు నిదర్శనంగా నిలిచింది. అమెరికా, యూరప్‌లోని చాలా పెద్ద బ్యాంకులు, ఆర్థిక సంస్థలు నాటి సంక్షోభ సమయంలో కుప్పకూలిపోయాయి. బ్యాంకులు, బీమా కంపెనీలు ప్రభుత్వ రంగంలో ఉండటం వల్ల భారత్ నాటి సంక్షోభాన్ని ఎదుర్కొనగలిగింది. 2008లో సంక్షోభాన్ని తట్టుకొని భారత్ నిలబడగలిగిందంటే ఆ ఘనత వామపక్ష పార్టీలకే దక్కుతుంది. ఎందుకంటే మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంస్థల తలుపులు బార్లా తెరిచేందుకు చేసిన ప్రయత్నాలన్నింటినీ ప్రతి దశలోనూ మేము అడ్డుకుంటూ వచ్చాము. నాడు ఆర్థిక మంత్రిగా పి చిదంబరం ఉన్నారు. అది బీమా రంగమైనా, బ్యాకింగ్ రంగమైనా, ప్రయివేటు బ్యాంకులయినా

> **“మనకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) ఉన్నాకానీ విద్యుత్ ఉపకరణాల కోసం మనం చైనా, ఇతర చోట్ల నుంచి చౌక దిగుమతులను అనుమతిస్తున్నాము. దీనివల్ల మార్కెట్‌లో బిహెచ్ఇఎల్ షేర్ గడిచిన దశాబ్దం, దశాబ్దం న్నర కాలంలో 30 శాతం కిందకు పడిపోయింది.”**

విదేశీ పెట్టుబడులను అనుమతించకుండా నిలువరించాము. ఇది ఏమాత్రమూ ఆమోద యోగ్యమైన చర్య కాదని తేల్చిచెప్పాము. విశేష మేమిటంటే ఆ ప్రయోజనమంతా 2009 లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చేకూరింది. మన ఆర్థిక రంగాన్ని రక్షించుకోగలిగామని వారు నాటి ఎన్నికల్లో ప్రచారం చేసుకున్నారు. వాస్తవానికి దానికి విరుద్ధంగా వారు పనిచేశారు. మేమే వారిని అడ్డుకున్నాము.

నయా ఉదారవాద విధానాల దుష్ప్ర భావం పడిన రెండో ప్రధాన రంగం వ్యవసా యం. రెండున్నర దశాబ్దాలుగా ఏమి జరిగిందో మనం చూశాం. వ్యవసాయ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు క్రమంగా తగ్గుతూవచ్చాయి. మౌలిక సదుపాయాల కల్పన తీసుకున్నా, నీటి పారుదల రంగం తీసుకున్నా, విత్తనాలు, ఎరువు ల ఉత్పత్తి విషయాన్ని తీసుకున్నా ప్రభుత్వ పెట్టు బడుల్లో కోత విధించి ప్రయివేటు రంగానికి అప్పజెప్పారు. దీనివల్ల ఉత్పత్తి ఖర్చు పెద్ద మొ త్తంలో పెరిగింది. విత్తనాలు మొదలుకొని విద్యుత్తు, ఎరువులు, నీటి వరకు భార మయ్యాయి.

నయా ఉదారవాద విధానం వల్ల వాస్త వానికి ప్రపంచ మార్కెట్‌కు భారత వ్యవసాయ రంగం తలుపులు బార్లా తెరుచుకున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) వంటివాటి తో భారత్ చేసుకున్న ఒప్పందాలు, ఆసియా దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పం దం, ఇప్పుడు యూరప్‌తో చేసుకోవాలను కుంటున్న ఒప్పందం, ఈ ఒప్పందాలన్నిటికీ కూడా ప్రాథమిక షరతు ఒక్కటే. అదేంటంటే విదేశాల నుంచి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ సరుకులను ఏ విధమైనా అడ్డంకులు, దిగుమతి, కస్టమ్స్ సుంకాలు లేకుండా దిగుమతి చేసుకునేందుకు తప్పనిసరిగా అనుమతించాలి. దీనివల్ల విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు దేశంలోకి వరదలా వచ్చిపడతాయి. ఫలితంగా మన రైతులు పోటీ పడలేనంతగా తక్కువ ధరలకే అవి వచ్చిపడతాయి. ఉదాహరణకు రబ్బరు తీసుకోండి. ధరలు పడిపోవడంతో కేరళలో ఆర్నెల్లుగా రబ్బరు రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. విదేశాల నుంచి తక్కువ ధరకే రబ్బరు దిగుమతి అవుతోంది. టైర్లను ఉత్పత్తిచేసే కంపెనీలు దిగుమతి రబ్బరుపైనే ఆధారపడుతున్నాయి. ఇలా ఏ రంగాన్నైనా తీసుకోవచ్చు. ప్రపంచీకరణ, నయా ఉదారవాద విధానాల అమలు అనేవి వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నవారి జీవనోపాధిని అస్తవ్యస్థం చేశాయి.

నయా ఉదారవాద విధానాల్లో భాగంగా చేపడుతున్న వాణిజ్య సరళీకరణ విధానాలు కూడా పరిశ్రమల వినాశనానికి దారితీస్తున్నా యి. దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీలు, కస్టమ్స్ సుంకాలు తగ్గించడం, ఎత్తివేయడం వంటి చర్యల వలన దేశంలోని పారిశ్రామిక, తయారీ రంగం దెబ్బతింటోంది. ఈ పరిణామాలపై ఇందిరాగాంధీ హయాంలో శాస్త్ర, సాంకేతిక సలహాదారుగా పనిచేసిన అశోక్ పార్థసారథి ఈ ఏడాది మార్చి 15న హిందూ దినపత్రికలో ఓ వ్యాసం రాశారు. 25 ఏళ్ల సరళీకరణ విధానాల వల్ల భారత్ పారిశ్రామిక దేశంగా గాకుండా పరిశ్రమల్లేని దేశంగా మారిపోయిం దని ఆ వ్యాసలో ఆయన స్పష్టంగా చెప్పారు. దానికి ఆయన చాలా ఉదాహరణలు కూడా ఇచ్చారు. మనం 1970, 80లలోనే ఐటి, హార్డ్‌వేర్‌ను అభివృద్ధి చేశాము. అప్పుడు నాటి నరసింహారావు ప్రభుత్వం హార్డ్‌వేర్ రంగంలో దిగుమతి సుంకాన్ని గణనీయంగా తగ్గిస్తామని, సాఫ్ట్‌వేర్ రంగాన్ని అభివృద్ధి చేస్తామని ప్రకటిం చింది. అంటే హార్డ్‌వేర్ లేకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయడమన్నమాట. దీనికి భిన్నమైన దిశలో జపాన్ నడిచింది. మొదట హార్డ్‌వేర్ పరిశ్రమలను నెలకొల్పడంపై ఆ దేశం దృష్టి సారించింది. దానివల్ల విదేశీ ఐటి, హార్డ్‌వేర్ సాంకేతికతలపై ఆధారపడాల్సిన అవసరం జపాన్‌కు రాలేదు. ఐటి హార్డ్‌వేర్, ఆప్టిక్ ఫైబర్, వివిధ ఎలక్ట్రానిక్స్ ఉత్పాదనలు, భారీ ఎలక్ట్రికల్స్‌ను ఇలా దేన్ని తీసుకున్నా జపాన్ వాళ్లు బాగా అభివృద్ధి చెందారు. మనకు భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్ఇఎల్) ఉన్నాకానీ విద్యుత్ ఉపకరణాల కోసం మనం చైనా, ఇతర చోట్ల నుంచి చౌక దిగుమతులను అనుమతిస్తున్నాము. దీనివల్ల మార్కెట్‌లో బిహెచ్ఇఎల్ షేర్ గడిచిన దశాబ్దం, దశాబ్దం న్నర కాలంలో 30 శాతం కిందకు పడిపోయిం ది. స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుమతించడం ద్వారా పాలకులు వాస్తవంలో పరిశ్రమల వినాశనాన్ని ప్రోత్సహిస్తున్నారు.

నయా ఉదారవాద విధానాల కాలంలో ప్రభుత్వ స్వభావం పూర్తిగా మారిపోయింది. ఆర్థిక కార్యకలాపాల్లో, ఆర్థిక విధానాల రూపకల్పనలో ప్రభుత్వ పాత్రలో గణనీయమైన మార్పులొచ్చాయి. ప్రభుత్వం జోక్యం చేసుకొనే స్వభావంలోనూ మార్పులొచ్చాయి. ప్రభుత్వం ఇప్పుడు ప్రజల చేతిలోని వనరులను బదిలీ చేయడంలో క్రియాశీలకంగా పనిచేస్తోంది. కొద్దిమంది బడా వ్యాపారవేత్తలకు, బహుళ జాతి కంపెనీలకు దేశంలోని ప్రకృతి వనరులను కట్టబెడుతోంది. భూమిని తక్కువ ధరలకు సేకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్న వైనాన్ని మనం దేశమంతటా చూస్తున్నాము. గనులు, ప్రాజెక్టుల పేరుతో రైతులను, గిరిజనులను పెద్ద ఎత్తున నిర్వాసితులను చేస్తున్నారు. ప్రజల నుంచి భూములు గుంజుకొని కార్పొరేట్లకు పూర్తి ఉచితంగానో, లేదా నామమాత్రపు ధరకో అప్పగించడంలో ప్రభుత్వం క్రియాశీలంగా జోక్యం చేసుకుంటున్నది. రెండోది వాస్తవానికి ఈ ప్రక్రియ ద్వారా బడా పెట్టుబడిదారులు మరింత సంపదను పోగేసుకోవడానికి ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తోంది. ఇప్పుడున్న ప్రభు త్వ పన్నుల విధానం కానీ, అంతకు ముందు ప్రభుత్వాల విధానాలు కానీ సంపదను, ప్రకృతి వనరులను కొద్దిమందికే కట్టబెట్టేందుకు దోహదం చేసేలా ఉన్నాయి.

సబ్సిడీలు వృధా అవుతున్నాయంటూ మరోవైపు ప్రభుత్వం గగ్గోలు పెడుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) వంటి వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సబ్సిడీల్లో వృధా అవుతోందనీ, ఆహార సబ్సిడీ, ఎరువులకు ఇస్తున్న రాయితీలు, ఇంధన సబ్సిడీల్లోనూ చాలా వృధా అవుతున్నదని ప్రచారం చేస్తున్నారు. సంపన్నులకు, బడా వ్యాపారులకు, కార్పొరేట్లకు పెద్దమొత్తంలో ఇస్తున్న సబ్సిడీలపై మాత్రం ఎవ్వరూ నోరు మెదపటం లేదు. అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో

గణాంకాలు చూస్తే పన్నులు తిరిగి ఇచ్చేయడం, లేదా పన్ను రాయితీలివ్వడం, ఇతర మినహాయింపుల ద్వారా ఉపశమనం చేకూర్చడం తదితరాల ద్వారా మొత్తం 6.11 లక్షల కోట్ల రూపాయల ఆదాయాన్ని ప్రభుత్వం వదులుకున్నది. దీనిని విడివిడిగా చూస్తే కార్పొరేట్లకు నేరుగా అందించిన పన్ను మినహాయింపుల మొత్తం ఏకంగా 62 వేల కోట్ల రూపాయలుగా ఉంది. అంటే కార్పొరేట్లు ఈ ఏడాది చెల్లించిన పన్నుల్లో 62 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం తిరిగి వెనక్కి ఇచ్చేసి ఆ మేరకు ఆదాయాన్ని వదులుకుంది. ఈ విధంగా ప్రభుత్వం కార్పొరేట్లకు, సంపన్నులకు రాయితీలు అందిస్తోంది.

నయా ఉదారవాద విధానంలో ప్రయివేటీకరించడమంటే అర్థం ఆర్థిక వ్యవస్థ అవనికలో పరిశ్రమలను, తయారీ రంగాన్ని ప్రయివేటీకరించడం మాత్రమే కాదు. సమాజంలోని అన్ని వ్యవస్థలనూ ప్రయివేటీకరించడమే. అభివృద్ధి చెందిన, ఆధునిక సమాజాలన్నింటిలో పౌరులకు ప్రభుత్వం అందించాల్సిన విద్య, వైద్యం, రవాణా వ్యవస్థ, మంచినీరు, విద్యుత్ తదితర ప్రాథమిక లేదా అత్యవసర సేవలుంటాయి. ప్రజల సంక్షేమం కోసం ఉద్దేశించిన ఈ సేవలన్నిటినీ ప్రయివేటు పరం చేయాలన్నది నయా ఉదారవాద విధాన తత్వం. నయా ఉదారవాద విధాన తత్వం ప్రకారం ప్రజలకు ఏమి అందించాలన్నా దానికి సరైన మార్గం మార్కెట్ మాత్రమే. పౌరులంతా వినియోగదారులుగా మారాలి. మార్కెట్ మాత్రమే పౌరులకు సేవలందిస్తుంది. ఎంత మేరకు సేవలందించాలనేది కూడా మార్కెట్టే నిర్ణయిస్తుంది. ప్రభుత్వం కానీ, పురపాలక సంఘాలు, లేదా స్థానిక సంస్థలు కానీ నిర్ణయం తీసుకునే వీలుండదు. భారతదేశంలో కూడా ప్రభుత్వ పరిశ్రమలు, బ్యాంకుల ప్రయివేటీకరణే కాదు. అన్ని ప్రాథమిక సేవలను వేగంగా ప్రైవేటీకరిస్తున్నారు. మనకు తెలుసు చాలా నగరాలు, పట్టణాల్లో మంచినీటి సరఫరా వంటి ప్రాథమిక అవసరాలను సైతం ఇప్పటికే ఈ సేవలను బహుళ జాతి సంస్థలకు సైతం అప్పగించి ప్రయివేటుపరం చేశారు.

అత్యధిక మందికి అందుబాటులో ఉండాల్సిన వైద్య, విద్యా సేవల ప్రయివేటీకరణ గురించి నేను ప్రధానంగా ప్రస్తావిస్తాను. మంచి వైద్యం, మంచి విద్య కావాలంటే ఇప్పుడు మరింత ఎక్కువగా చెల్లించాల్సిందే. ప్రాథమిక సేవలన్నీ పేదలు, సామాన్య ప్రజానీకం పొందడానికి వీల్లేకుండా ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. మన సమాజంలో అసమానతలు పెరగడానికి ఇది ఒక కారణం. ఆదాయం, సంపదలోనే

> **“ నయా ఉదారవాద రాజకీయాలంటే ఏమిటి? రాజకీయ వ్యవస్థలో పెద్ద ఎత్తున డబ్బులు పెట్టుబడి పెట్టడం. 1950లో గణతంత్ర దేశంగా మారిన తర్వాత మనం ఏర్పాటు చేసుకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇప్పుడు ఈ పెట్టుబడి అవినీతిమయం చేస్తోంది. ”**



మన్మోహన్‌సింగ్

కాదు వైద్యం, విద్య, నీరు, విద్యుత్తు, ఇళ్లు వంటివి పొందడంలోనూ అసమానతలు పెరిగాయి. ప్రపంచంలోని అన్ని మూలల్లోనూ నయా ఉదారవాదం అసమానతలు తీసుకొచ్చింది. ప్రపంచంలో సంపన్నదేశమైన అమెరికాలో గత 30 ఏళ్లుగా అసమానతలు పెరిగాయి. సంపన్నులు మరింత సంపన్నులు అవుతుండగా, మధ్య తరగతి ప్రజల్లో చాలా మంది మన దేశంలో దారిద్ర్యరేఖ అని చెబుతామే ఆ స్థాయిలకు పడిపోయారు. మన దేశ దారిద్ర్య రేఖ పరిధి కంటే వారి దారిద్ర్యరేఖ స్థాయి హెచ్చుగా ఉండవచ్చు అదే వేరే సంగతి. బ్రిటన్‌లోనూ, యూరప్‌లోని చాలా దేశాల్లోనూ ఇదే జరిగింది. అందువల్ల సరళీకరణ ఫలితమేమిటంటే..ఒకటి ఆర్థిక వృద్ధి లేదా జిడిపి ఏ మేరకు పెరిగితే ఆ మేరకు అప్పటికే సంపద పోగేసుకున్న ధనికులకు ప్రయోజనం చేకూరుతుంది. రెండు పేదలకు, సంపన్నులకు మధ్యనున్న వ్యత్యాసాన్ని మరింతగా పెంచుతుంది.

మూలమూలలకు విస్తరిస్తున్న ఈ ప్రయివేటీకరణ వల్ల సమాజంపై నేరుగా ప్రభావం పడుతోంది. సామాజిక విలువలు మారిపోతున్నాయి. అమెరికాలోనూ, యూరప్ లోని చాలా దేశాల్లో ఈ రోజు జైళ్లను సైతం ప్రయివేటీకరించారు. జైళ్లను ప్రభుత్వం నడపడం లేదు. వీటిని ప్రయివేటు కంపెనీలకు కాంట్రాక్టుకు ఇచ్చేశారు. ప్రపంచంలో అత్యధికమంది ఖైదీలున్న దేశం అమెరికా అని మీకు తెలిసే వుంటుంది. జైళ్లను నడుపుతున్న ప్రయివేటు కంపెనీలు ఎక్కువ మంది జైళ్లకు రావాలని కోరుకోవడం దీనికి ఒక ప్రధాన కారణం. జైళ్లలో ఉండేవారికి తిండి పెట్టడం, దుస్తులు, వారిపై నిఘా, ఇతర నిర్వహణకు గానూ ఖైదీకి ఇంత అని కాంట్రాక్టర్లకు ఇస్తారు. అందువల్ల ఎక్కువ మంది ఖైదీలు జైళ్లకు వస్తే ఎక్కువ లాభాలొస్తాయి. న్యాయ వ్యవస్థ చిన్నచిన్న నేరాలకు కూడా జరిమానా వేసేసి ఆర్నెల్లో, సంవత్సరమో జైలు శిక్షలు వేసేలా ప్రయివేటు కంపెనీలు అక్కడ పరిస్థితులు తీసుకొచ్చాయి. జైళ్లను నడుపుతున్న కంపెనీల లాభాపేక్ష నేరాలు, న్యాయ వ్యవస్థను సైతం ప్రభావితం చేస్తోంది. సమాజ విలువల ముఖ చిత్రాన్ని ప్రయివేటీకరణ ఏలా మార్చివేస్తుందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

నయా ఉదారవాదమంటే అదేదో ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితమైనది కాదు. నయా ఉదారవాద విధానాలను మనం ఆర్థిక విధానాలుగానే ఆలోచిస్తాం. కానీ ఇది చాలా విస్తారమైన అంశం. నయా ఉదారవాదం ఆర్థిక వ్యవస్థలో, రాజకీయాల్లో, నేనిదివరకు చెప్పినట్లు సామాజిక అంశాల్లోకి, సాంస్కృతిక విషయాల్లోకి ఇలా సమాజంలోని ప్రతి అంశంలోకి చొరబడింది. భారతదేశంలో 25 ఏళ్ల సరళీకరణ, నయా ఉదారవాద విధానాల వల్ల నయా ఉదారవాద రాజకీయాలు ఉనికిలోకి వచ్చాయన్నది స్పష్టంగా కనిపిస్తుంది. నయా ఉదారవాద రాజకీయాలంటే ఏమిటి? రాజకీయ వ్యవస్థలో పెద్ద ఎత్తున డబ్బులు పెట్టుబడి పెట్టడం. 1950లో గణతంత్ర దేశంగా మారిన తర్వాత మనం ఏర్పాటు చేసుకున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇప్పుడు ఈ పెట్టుబడి అవినీతిమయం చేస్తోంది. అది కూడా కింది నుంచి పైస్థాయి వరకు. పంచాయతీ మొదలుకొని పార్లమెంటు వరకు ఏ విధమైన రాజకీయాలున్నాయో, రాజకీయాల్లో ఏ విధమైన వ్యక్తులు

**"ఇప్పుడు రాజకీయం వ్యాపారమా, వ్యాపారం రాజకీయ మా అనేది అర్థం చేసుకోవడం సంక్లిష్టంగా మారిపోయింది. ఈ రెండింటినీ వేరు చేసి చూడటం ఇప్పుడు కష్టం. ఇలాంటి వైఖరితో పార్టీలు, వ్యక్తులు అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వాలు ఎలాంటి విధానాలు అమలజేస్తాయో ఊహించండి."**

న్నారో మనకు తెలుసు. ఎన్నికల్లో డబ్బు వెదజల్ల డం.. ఈ విషయంలో ఆంధ్రా, తెలంగాణా ముందున్నాయి. ఆంధ్రా, తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో చేసే ఖర్చు మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ఖర్చు చేసేదానికంటే వంద రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఉదాహరణకు తెలు గుదేశం పార్టీనే తీసుకోండి..30 ఏళ్ల కిందట అసెంబ్లీ, పార్లమెంటు అభ్యర్థులుగా ఆ పార్టీలో ఎలాంటి వారుండేవారు..ఇప్పుడు ఎవరున్నారు. ఈ రోజు చాలా వరకు ధనాన్ని పోగేసుకున్న బడా వ్యక్తులకే ఆ పార్టీ పట్టం కడుతోంది. కార్పొరేటు పారిశ్రామికవేత్తలు, బడా కాంట్రా క్టర్లు. వివిధ వ్యాపారాల్లో భాగస్వామ్య మున్నవారు ఆ పార్టీ తరుపున ప్రజా ప్రతినిధులౌ తున్నారు. ఇది ఒక్క తెలుగుదేశం పార్టీకే పరిమి తం కాలేదు. నేను ఒక ఉదాహరణగా చెప్పానంతే. తమిళనాడులో డిఎంకె వంటి వాటికీ ఇదే వర్తిస్తుంది. జాతీయ పార్టీల్లోనే కాదు..చాలా వరకు ప్రధాన ప్రాంతీయ పార్టీల్లో సైతం నాయక త్వం, ప్రజా ప్రతినిధులు వర్గ ప్రయోజనంలోనే సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు రాజకీయం వ్యాపారమా, వ్యాపారం రాజకీయ మా అనేది అర్థం చేసుకోవడం సంక్లిష్టంగా మారిపోయింది. ఈ రెండింటినీ వేరు చేసి చూడటం ఇప్పుడు కష్టం. ఇలాంటి వైఖరితో పార్టీలు, వ్యక్తులు అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వాలు ఎలాంటి విధానాలు అమలజేస్తాయో ఊహించండి. విధానాల రూపకల్పన అనేది అన్ని దశల్లోనూ బడా కార్పొరేట్ల గుప్పిట్లోకి వెళ్లిపోయి వారి దిశానిర్దేశంలో జరుగుతుంది. అంతిమంగా నయా ఉదారవాదం అనేది ప్రజాస్వామ్యం గొంతు నులివేసేందుకు దారితీస్తుంది. మనకున్న ప్రజాస్వామ్య వ్యవస్థను, హక్కులను హరించి వేస్తుంది. ప్రజాప్రతినిధులు ఏమి చేయాలి, ప్రభుత్వం ఏమి చేయాలనేది సామాన్య ప్రజలు, పౌరులు చెప్పేందుకు ఏమీ ఉండదు. వామపక్షా లను మినహాయిస్తే ఇతర అన్ని పార్టీలూ నయా ఉదారవాద విధానాలు మంచివని చెబుతున్నా యి. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి, బిజెపికి లేదా తెలుగుదేశం పార్టీకి, ఇతర ప్రాంతీయ పార్టీలకు వైరుధ్యమేమీ లేదు. ఆర్థిక విధానాల పరంగా ఈ పార్టీలన్నీ ఒక్కటే. నయా ఉదారవాదం వల్ల ప్రయోజ నాలు పొందుతున్నవారికి ఇప్పుడా పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. నా ఉద్దేశ్యంలో మనముందు ఉన్న అతిపెద్ద సవాలు ఈ పార్టీలే. వామపక్షాల అజెండాను కాసేపు పక్కన పెట్టండి..కనీసం ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేం దుకు, ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించుకు నేందుకు, ప్రజలకు ప్రాతినిధ్యం లభించేందుకు పోరాటాన్ని సాగించాల్సిన అవసరముంది.

మరో ప్రధానమైన విషయం నయా ఉదారవాదం, నయా ఉదారవాద రాజకీయాలు మన దేశంలో మతతత్వాన్ని పెంచి పోషిస్తున్నా యి. హిందూ మతతత్వం పెరుగుదల నేరుగా నయా ఉదారవాదానికి, నయా ఉదారవాద రాజకీయాలతో ముడిపడివుంది. భారత్‌లోనే కాదు 1980లలో సామ్రాజ్యవాదం, ప్రపంచీ కరణ పెచ్రేగిపోతున్న దశలో ప్రపంచమంతటా సంకుచిత, మూలవాసుల వాదం, తీవ్రవాదం, మతవాదం, జాతీయవాదం వంటి అస్థిత్వవాదా లు పెరిగాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ వాస్తవానికి జాతీయ సమగ్రతను, దేశ సార్వభౌ మత్వాన్ని బలహీనం చేస్తుంది. ప్రతిదేశంలోనూ ప్రభుత్వాలను బలహీనం చేస్తూ వస్తుంది. దేశ సార్వభౌమత్వాన్ని ఫణంగా పెట్టి ద్రవ్య పెట్టుబ డికి ప్రభుత్వాలు దాసోహమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక, రాజకీయ వివిధ అస్థిత్వ వాదాలు ముందుకొస్తాయి. ఇవన్నీ కలిపి సామ్యవాద పతనానికి దోహదం చేస్తాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు ప్రత్యామ్నా యంగా సవాలు చేయగలిగే ఏకైక శక్తిగా సామ్యవాద దేశాలు వీటివల్ల నిర్బంధానికి గురౌతాయి. సామ్యవాద ప్రభుత్వాలు కనుమ రుగై వివిధ అస్థిత్వ వాదాలు ముందుకొస్తాయి. సోవియట్ యూనియన్‌లో జరిగిందిదే. అక్కడ జాతిఘర్షణలు ఏలా ప్రారంభమయ్యాయి, మత తీవ్రవాదం ఎలా పెరిగిందీ చూశాం. మన దేశంలో కూడా నెహ్రూ విధానాలుగా చెప్పుకునే గత ప్రభుత్వ ప్రాయోజిత పెట్టుబడిదారీ విధా నం విఫలమవ్వడంతో నయా ఉదార వాదం ప్రవేశించి కార్మికులు కడగళ్లు ఎదుర్కొంటున్నారు.

వాస్తవానికి నయా ఉదారవాద ప్రక్రియ 1991 కంటే ముందే రాజీవ్‌గాంధీ ప్రభుత్వ హయాంలోనే నూతన ఆర్థిక విధానాల పేరుతో మొదలైంది. ఆ సమయంలోనే హిందుత్వ మతోన్మాద శక్తులు బలోపేతమవ్వడం ప్రారంభ మైంది. 2014 లోకసభ ఎన్నికల్లో అది పరాకాష్టకు చేరి నరేంద్ర మోడీ ప్రధానమం త్రిగా బిజెపి అధికారం చేపట్టింది. అందువల్ల హిందూ మతోన్మాదం, నయా ఉదారవాదం చెట్టాపట్టాలేసుకొని ఒకదాన్ని ఒకటి బలోపేతం చేసుకున్నాయి. భారతీయులందరూ భారత్ మా తాకీ జై అని నినాదాలు ఇవ్వాలంటున్న వ్యక్తులే మన దేశంలోని నావికా, వైమానిక స్థావరాలను అమెరికా ఉపయోగించుకునేందుకు వీలుకల్పిస్తూ ఒప్పందాలపై సంతకాలు చేశారు. అప్పుడు వారికి భారతమాత గుర్తుకురాదు. హిందుత్వ సిద్ధాంతం సామ్రాజ్యవాదానికి అనుకూలమై నది. నయా ఉదారవాదాన్ని పూర్తిగా సమర్థిం చేది. ప్రోత్సహించేది. ఆ సిద్ధాంతాన్నే మన దేశ పాలకవర్గాలు అవలంబిస్తున్నాయి. ఎందు కంటే వారికి తెలుసు హిందుత్వ అనగానే ప్రజ లు మతాల ప్రాతిపదికన చీలిపోతారని, నయా ఉదారవాద విధానాలను ప్రజలపై రుద్దేందుకు వారికి ఇది చాలా అనువైనమార్గం. నయా ఉ దారవాదం ఫలితంగా పెచ్రేగిపోతున్న హిందు మతోన్మాదం ప్రజల ఐక్యతను దెబ్బతీసి దేశానికి చాలా ప్రమాదకరంగా మారింది. మన సమాజంలో సామాజికంగా అణిచివేతకు గురైన ప్రజానీకం హక్కులపైనా నయా ఉదారవాదం, మతోన్మాదం జమిలీగా పెద్ద ఎత్తున్న దాడి చేస్తున్నాయి. మహిళలు, దళితులు, ఇతర అణగారిన ప్రజలు రెండు రకాలుగా దాడులను ఎదుర్కొంటున్నారు. ఒకటి అసమానతలు పెరిగిపోవడంతో సమాజంలో వెలివేయబడ టం, రెండోది ఆర్ఆర్ఎస్ లాంటి బ్రాహ్మణవాద సంస్థల సాంప్రదాయ, సామాజిక, మతతత్వ తీవ్రవాద దాడులకు లక్ష్యంగా మారడం. అందువల్ల నయా ఉదారవాదం, సరళీకరణల అమలు ఇలాంటి శక్తులన్నిటికీ ప్రోద్బలాన్నిస్తు న్నాయి. ఒకవైపు మన ఆర్థిక వృద్ధి ఉపాధి కల్పించలేకపోతోంది. ఆదాయ, సంపదలతో

(మిగతా 28వ పేజీలో)

# హిందూ చట్టంలో సంస్కరణల కోసం డా॥ అంబేద్కర్ పోరాటం



రచయిత్రి సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు

**బృందా కరత్**

డా॥ బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతి ఉత్సవాల సందర్భంగా సంఘ్ పరివార్, దాని అగ్ర నాయకులు ఎవరయితే పార్లమెంట్‌లో ఉన్నారో, వారందరూ ఒక పద్ధతి ప్రకారం ఆయన చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేసి, స్వతంత్ర భారత దేశ నిర్మాణంలో అంబేద్కర్ తన బహుముఖ ప్రజ్ఞా పాటవాలతో మనకు అందించిన సేవలను మరుగున పడేయాలనే ప్రయత్నం చేశారు.

వీటిలో ఒక ప్రధాన అంశం భారత దేశంలో మహిళలకున్న స్థానం గురించి అంబేద్కర్ ఆలోచన, పోరాటం. చాతుర్వర్ణ వ్యవస్థ మూలంగానే ప్రధానంగా మహిళలకు ఈ పరిస్థితి దాపురించిందని, అత్యవసరంగా హిందూ మత చట్టాల్లో సంస్కరణలు జరగాలని ఆయన భావించారు. హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా చర్చల్లో ఆయన ఇలా అన్నారు. "హైందవ సమాజం దేనినైనా దత్తత తీసుకుని ఇముడ్చుకుంటుంది. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ దాని చాతుర్వర్ణ వ్యవస్థ సామాజిక రూపాలను మార్చుకోవడానికి అంగీకరించదు. దాని ద్వారానే వారు శూద్రులను, మహిళలను బానిసలుగా చేసుకున్నారు కాబట్టి, చట్టం, న్యాయం నేడు వారి రక్షణ కోసం జోక్యం చేసుకొని, వారికి విముక్తినిస్తేనే ఈ సమాజం ముందుకు వెళుతుంది" అని వక్కాణించారు.

మనుస్మృతి వారసులైన సంఘ్ పరివార్ శక్తులకు, డా॥ బి.ఆర్. అంబేద్కర్‌కు మహిళల స్థితిగతులపై మౌలిక విభేదం ఇక్కడే ఉంది. 1940 దశకం చివరిలో హిందూ కోడ్ బిల్లు ఆమోదింపజేసేదాకా తాము నిర్వహించిన పాత్రపై సంఘపరివార్ శక్తులు చెవిటి వారి వలె మౌనముద్ర దాల్చాయి. అందుకనే మనం చరిత్రను ఒకసారి తడిమి చూడాల్సిన అవసరముంది. మహిళల పట్ల వారి ఆలోచన మారిందని కాదు. నెహ్రూ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా డా॥ అంబేద్కర్ పరిమితమైన సవరణలతో హిందూకోడ్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నాయకులైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వంటి వారు వాటిని వ్యతిరేకించడమేగాక, డా॥ అంబేద్కర్‌పై వ్యక్తిగత దూషణలతో దాడికి సైతం దిగారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది అగ్రనాయకులు కూడా వీరికి వంతపాడిన పరిస్థితి ఉంది. అప్పటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, నాటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ కూడా వారి భావాలనే సమర్థించారు. వీరితో పాటు ముస్లిం మత ఛాందసవాసులు, ముఖ్యంగా నజీరుద్దీన్ అహమ్మద్ వంటివారు ఈ సవరణలను తీవ్రంగా వ్యతిరేకించారు. హిందువైనా ముస్లిమైనా మత ఛాందసం ఒకటే అని, ఒక నాణెంపై ఉన్న రెండు బొమ్మల లాంటి వారని నిరూపించారు.

డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఒక నిరంకుశుడని, ఆవిష్కర్తగాని, పురోగామిగాని కాని ఆధునిక మనువు అని వెక్కిరింతలతో దాడి చేశారు. ఆయన ఏ కులాన్నించి వచ్చారో అది గుర్తుంచుకోవాలి అన్నట్లు ఎగతాళిగా మాట్లాడారు. ఆయన 'అంబవేద'ను రూపొందిస్తున్నాడని తిరస్కారంగా మాట్లాడారు. కొన్ని సందర్భాలలో అంబేద్కర్ కూడా వాటికి స్పందిస్తూ, "నాలాంటి అంటరానివాడి గురించి ఈ బ్రాహ్మణులకి ఎందుకంత అసూయ" అని ఛలోక్తులు సంధించేవాడు. అదే హాస్యంతో వారంతా పిచ్చివారు, పిచ్చివారి ఆశ్రమాలు చిన్నవిగా ఉండటంతో అక్కడ ఉండలేక ఇలా బయటకు వచ్చారు" అని వ్యాఖ్యానించేవాడు. అవమానకరమైన విషయమేమిటంటే, ఆయన క్యాబినెట్ సహచరులు కూడా ఆయనకు మద్దతుగా నిలబడలేదు. ఒకే ఒక సందర్భంలో వాడివేడి చర్చలలో ప్రధాని నెహ్రూ ఆయనను సమర్థిస్తూ మాట్లాడారు. "కొంతమంది పార్లమెంటు సభ్యులు ప్రవర్తన నాకు ఆశ్చర్యంగా ఉంది. మనం చాలా ఉపన్యాసాలు చేశాము. కొన్ని కొంతమందిని బాధించాయి కూడా. అప్పుడు వాటిని అంగీకరించినవారు, ఇప్పుడు అంబేద్కర్‌తో ఏకీభవించని వారు కూడా అలానే అంగీకరించి సంయమనం పాటించాలి" అని అన్నారు. నిజానికి ఈ దాడి జరిగింది నెహ్రూ మీదకాదు, డా॥ అంబేద్కర్ మీద మాత్రమే. కాబట్టి నెహ్రూ చెప్పిన 'మనం' అనేది వాస్తవ చిత్రాన్ని ప్రతిబింబించటం లేదు.

### అంబేద్కర్, ఆర్.ఎస్.ఎస్., మహిళా పోరాటాలు...

హిందూ కోడ్ బిల్లుపై ప్రతిఘటన రాక ముందు కాలం నుండే మహారాష్ట్రలో డా॥ అంబేద్కర్ స్ఫూర్తివంతమైన నాయకత్వంలో, అణగారిన కులాలలోంచి మహిళలు, అంటరానివారు, కులాల సంకెళ్ళను ఛేదించుకొని తమ హక్కుల కోసం పోరాటంలో పాల్గొన్నారు. 1927లో జరిగిన చారిత్రాత్మక మహద్ సమావేశంలో ఈ అణగతొక్కడిన కులాల మహిళలలే క్రియాశీలంగా నిలబడ్డారు. డా॥ అంబేద్కర్ ఇచ్చిన పిలుపును అందుకొని మనుస్మృతి గ్రంథ కాపీలను రాష్ట్రవ్యాప్తంగా దగ్ధం చేశారు. కులవ్యవస్థలోని దుర్మార్గాలకు చట్టబద్ధత కల్పించిన మనుస్మృతిపై పై తమ ఆగ్రహం వెలిబుచ్చారు. కులవ్యవస్థ, ఆచారాలు, సాంప్రదాయాల పేరుతో మహిళలపై దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలకు ఈ కార్యక్రమం పెద్ద ఊతమిచ్చింది.

మరొకవైపు, గాంధీజీ ఇచ్చిన సత్యాగ్రహం పిలుపుతో ఆకర్షితులైన ఎంతోమంది మహిళలు బాహాటంగా బయటికి వచ్చి రాజకీయ పోరాటంలో భాగస్వాములయ్యారు. అనేక రాష్ట్రాలలో మహిళా సంఘాలు ఏర్పడ్డాయి. వీటిలో భిన్నమైన ఆలోచనలు, భిన్న దృక్పథాలు కలిగినవి కూడా ఉన్నాయి. ఆలిండియా ఉమెన్స్ కాంగ్రెస్ వంటి సంస్థలు కొన్ని అగ్రకులాల మహిళలచే నడపబడి, స్వాతంత్ర్యంతో పాటు, స్వతంత్ర భారతదేశంలో మహిళలకి కూడా సమానహక్కులు ఉండాలని పిలుపునిచ్చాయి.

**❝ భర్త మరణించిన మహిళలకు కుమారుడి ఆస్తిలో కొంత వాటా దక్కే అవకాశం కల్పించింది. ఇది ఆ రోజుల్లో పెను దుమారం లేపింది. ఈ బిల్లు వచ్చిన తరువాత దాని బలాలు, బలహీనతల మీద పెద్దఎత్తున చర్చకు దారితీయగా, బ్రిటీష్ ప్రభుత్వం వెంటనే నలుగురు సభ్యులతో కూడిన కమిటీని వేయాల్సి వచ్చింది. ❞**

వారికి ఎన్ని పరిమితులున్నా, వారి పోరాటాల వలన లింగ ఆధారిత వివక్షపై దృష్టి సారించటానికి, మహిళల హక్కులకై డిమాండ్లు ఊపందుకోవటానికి తోడ్పడ్డాయి. 1934లో ఆలిండియా మహిళా కాంగ్రెస్ మహాసభ ఒక తీర్మానం చేసి, హిందూ కోడ్ బిల్లులోమార్పులు తీసుకురావాలని వివాహాలలో, సాంప్రదాయాల పేరుతో మహిళల పట్ల జరుగుతున్న వివక్షను తొలగించాలని డిమాండ్ చేసి తమ నిరసన గళాన్ని విప్పారు.

ఈ రకంగా మహిళలో పెరుగుతున్న చైతన్యం, పోరాటాల ఫలితంగా 1930, 1940లలో అనేక రాష్ట్రాలలో మహిళా స్వయం రక్షక్ దళాలు, మహిళా సంఘాలు విస్తారంగా ఆవిర్భవించాయి. వీటిలో చాలావాటికి కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. ఈ మహిళా కమ్యూనిస్టు నాయకులు, ఆర్థికంగా, సామాజికంగా దోపిడీకి గురవుతున్న మహిళల మధ్య పనిచేస్తూ, అనాదిగా వస్తున్న దురాగతాలను, దురాచారాలను ఎక్కడికక్కడ నిలదీయటం ప్రారంభించారు. లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ విప్లవం ద్వారా రష్యాలో సాధించిన విజయమే వీరికి స్ఫూర్తిగా నిలిచింది. అక్కడ మహిళలకి అన్ని సమాన హక్కులు ఇవ్వబడ్డాయి. ఇదే సందర్భం లో ఉద్దండ కమ్యూనిస్టు విప్లవకారులైన పుచ్చలపల్లి సుందరయ్య, ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్, ఏ.కే. గోపాలన్ వంటి వారు హిందూమత ఛాందస భావాలకు, కుల వ్యవస్థకు దురాచారాలు, సాంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఉన్నారు.

1926లో ఏర్పడ్డ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఈ ప్రజాతంత్ర పోరాటాలలో, స్వాతంత్ర్య పోరాటంలో ఎటువంటి పాత్ర పోషించలేదు. పైపెచ్చు దీనికి పూర్తి భిన్నంగా ఆర్.ఎస్.ఎస్. స్థాపక నాయకుడు డా॥ కె.బి. హెడ్గెవార్ హిందూత్వ సంస్కృతి, ఆచారాలను ఈ మహిళా నాయకులే ముందుండి కాపాడాలని భావించారు. 1936లో రాష్ట్రీయ సేవిక సమితి ప్రారంభ సభలో ఆయన మాట్లాడుతూ, "ఈ సమితి యొక్క ప్రధాన లక్ష్యం, హిందూ మహిళలలో హిందూత్వ సిద్ధాంతం ప్రచారం, హిందూ రాష్ట్ర పురోగతి సాధించాలని, అందుకు ప్రతి హిందూ మహిళ ఆదర్శవంతంగా ఉండి హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడి దేశాన్ని ముందుకు తీసుకెళ్ళాలని" పేర్కొన్నారు. దీనికి భిన్నంగా డా॥ అంబేద్కర్ ఈ కుల ఆధారిత దురాచారాలను, అసమానతలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

## ప్రారంభ దశ

1937లో మహారాష్ట్ర నుండి లెజి స్లేటివ్ అసెంబ్లీకి ఎన్నుకోబడ్డ జి.వి. దేశ్‌ముఖ్ ఫెడరల్ లెజస్లేటివ్ అసెంబ్లీలో హిందూ మహిళలకు ఆస్తిహక్కు ఉండాలనే బిల్లుని ప్రవేశపెట్టారు. తదనంతర కాలంలో దేశ్‌ముఖ్ చట్టంగా ప్రాచుర్యం పొందిన ఈ చట్టం కొద్దిపాటిగానైనా మహిళలకి హక్కులను కల్పించింది. భర్త మరణించిన మహిళలకు కుమారుడి ఆస్తిలో కొంత వాటా దక్కే అవకాశం కల్పించింది. ఇది ఆ రోజుల్లో పెను దుమారం లేపింది. ఈ బిల్లు వచ్చిన తరువాత దాని బలాలు, బలహీనతల మీద పెద్దఎత్తున చర్చకు దారితీయగా, బ్రిటీష్ ప్రభుత్వం వెంటనే నలుగురు సభ్యులతో కూడిన కమిటీని వేయాల్సి వచ్చింది. దీనికి ఛైర్మన్‌గా బి.ఎన్. రావు ఉన్నారు. హిందూ చట్టాలన్నిటినీ క్రమబద్ధీకరించాలని రావ్ కమిటీ 1941లో మొట్టమొదటి సిఫార్సు చేసింది. 1944లో ఏర్పాటు చేసిన రెండవ రావ్ కమిటీ ఒక ముసాయిదాని తయారు చేసింది. మహిళలకి వివాహం, విడాకులు, మెయింటెనెన్స్, గార్డియన్‌షిప్, దత్తత తదితర అంశాలపై సూచనలు చేసింది.

ఈ రిపోర్టు అంతిమ ప్రక్రియ జరిగే లోపు ఈ కమిటీ దేశమంతా అనేక రాష్ట్రాలలో పర్యటించి హిందూ చట్టాలలో తగిన సంస్కరణలపై బహిరంగ విచారణ, వినతిపత్రాలు స్వీకరించింది. ఒకవైపు హిందూ మహాసభ సభ్యులు, మరోవైపు మహిళా సంఘాలు, అభ్యుదయ కాముకుల మధ్య చర్చలతో మొత్తం సమాజంలో వాతావరణం వేడెక్కిపోయింది. వీరికి అత్యంత పవిత్రమైనవిగా భావించిన అంశాలపై ప్రశ్నించటంతో ఛాందసవాదుల గుండెల్లో బాకులు గుచ్చుకున్నట్లయ్యింది. వారసత్వం, కొనసాగింపు వంటి అంశాలు ధనిక వర్గాల మహిళలకు ప్రధానంగా ఆసక్తి కలిగి ఉండగా, మెజారిటీ మహిళలు వివాహ వ్యవస్థలో హక్కులు, విడాకుల హక్కు, జీవనభృతి హక్కు, సంరక్షణాధికార హక్కు వంటి హక్కులను సాధించుకోవటంలో ఆసక్తిని కలిగి ఉన్నారు.

## ఆర్.ఎస్.ఎస్. వ్యతిరేకత

హిందూ మహాసభ నాయకులైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వంటివారు ఆర్.ఎస్.ఎస్.తో కలిసి ఈ బిల్లుకి వ్యతిరేకంగా పనిచేశారు. అప్పుడు ఆర్.ఎస్.ఎస్. సర్ సంఘ్ ఛాలక్‌గా గోల్వాల్కర్ ఉన్నాడు. 1951లో పంజాబ్‌లోని నంగల్‌లో పత్రికా సమావేశంలో ఆయన హిందూ సమాజంలోని ఈ సంస్కరణలను ఆర్.ఎస్.ఎస్. తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవమానకర పదజాలంతో దూషించారు. అది ఇప్పటికీ ఆయన పేరుతో వెబ్‌సైట్‌లో ఉంది. బాల్య వివాహాలకి వ్యతిరేకంగా వచ్చిన శారదాచట్టాన్ని కూడా ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. పైగా అసలు ఈ చట్టాలు ఏవీ ఆచరణలో అమలుకావడం లేదని ఆయన ఆరోపించారు. అదే నిజమైతే ప్రస్తుతం పిల్లలకు, మహిళలకు వర్తించే అన్ని చట్టాలను రద్దు చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే అవి కూడా పూర్తిగా అమలు కావడం లేదు. సమాజంలో అనేక అంశాలు పుట్టుకొస్తుంటాయని, వాటన్నిటికీ సమాజమే సమాధానం ఇస్తుందని" ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఆయన సెలవిచ్చారు. దానికి ఉదాహరణ చెప్తూ బహు భార్యత్వం ఉండాలని, నాగపూర్ సమీపంలో పద్మశాలీలకు పనిచేసే చేతులు కావాలి. కాని వారు వేతనాలు చెల్లించి కార్మికులను పెట్టుకొనే స్థాయి లేదు. అందుకని వారు పరిష్కార మార్గంగా బహు భార్యత్వం ఎంచుకున్నారని గర్వంగా సెలవిచ్చారు. ప్రతిపాదిత హిందూ చట్టాల సవరణలలో డా॥ అంబేద్కర్ ఏకపత్నీ వివాహ ప్రతిపాదన చేసినందున దానికి ప్రతిగా ఈయనలా చెప్పారు.

రావ్ కమిటీ తిరిగిన అన్ని ప్రదేశాలలో ఈ బిల్లుని సమర్థించే, వ్యతిరేకించే వర్గాల ప్రదర్శనలు జరిగాయి. కొన్నిచోట్ల బిల్లుని వ్యతిరేకించేవారు ఈ కమిటీ సభ్యులపై భౌతిక దాడులకు కూడా ప్రయత్నించారు. ఈ బిల్లుని సమర్థిస్తూ, కమిటీకి సాక్ష్యాధారాలతో వివరణ ఇవ్వటానికి వచ్చిన మహిళలపై కూడా సనాతన

వాదులు హేళన, దూషణలతో దాడిచేశారు. వారిమీద ఉమ్ము వేశారు. అసభ్యకర పదజాలం వాడారు. అయినా వారు వెరవక నిలబడ్డారు. ప్రముఖ కమ్యూనిస్టు నాయకురాలు రేణు చక్రవర్తి 'స్వాతంత్ర్య పోరాటంలో మహిళా కమ్యూనిస్టుల పాత్ర' అనే పుస్తకంలో ఒక అధ్యాయం మొత్తం ఆనాడు మహిళలు హిందూ చట్టాల సవరణ బిల్లు కోసం చేసిన పోరాటాలను వివరించారు. 1952లో మొట్టమొదటి పార్లమెంట్ ఎన్నికల ముందుకాలంలో హిందూ లా బిల్లుపై భిన్న దృక్పథాలున్న వర్గాల మధ్య ఘర్షణ, వాదోపవాదాలు, తీవ్రస్థాయి చర్చలు జరిగాయి. ఆనాడు ఉన్నటువంటి ఆర్థిక, సామాజిక, రాజకీయ సమస్యలపై అటు చట్ట సభలలోనూ, బయటా విస్తృతమైన చర్చ నడిచింది. ఈ మొత్తం ప్రక్రియలో డాక్టర్ అంబేద్కర్ ప్రముఖ పాత్ర పోషించారు.

**"అంతిమంగా 1951 ఫిబ్రవరి 5వ తేదీన ఈ బిల్లు చర్చ, ఆమోదానికి ప్రవేశ పెట్టబడింది. ఈ బిల్లు వలన తన ప్రభుత్వం నిలబడటం కాని పడిపోవడం గాని జరుగుతుందని అంతకు ముందు మాట్లాడిన ప్రధానమంత్రి నెహ్రూ ఈ చర్చల సందర్భంగా ఛాంసవాదుల ఒత్తిడులకు తలొగ్గి అనూహ్యంగా వెనకడుగు వేశాడు."**



1951లో పార్లమెంటులో హిందూ చట్టంపై జరిగిన చర్చలో అంబేద్కర్

### పార్లమెంటులో చర్చ

రావ్ కమిటి చేసిన సూచనలననుసరించి రూపొందించిన బిల్లును దేశ విభజన జరగటానికి ముందు 1947, ఏప్రిల్‌లో దళితుడూ, అంబేద్కర్ అనుచరుడూ అయిన అప్పటి న్యాయ శాఖా మంత్రి జోగేంద్రనాథ్ మండల్ సభలో ప్రవేశపెట్టాడు. దేశ విభజన జరిగిన తరువాత, దాదాపు సంవత్సర కాలం తర్వాత 1948 ఏప్రిల్‌లో ఈ బిల్లును రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టారు. నెహ్రూ మంత్రివర్గంలో మొదటి న్యాయ శాఖామంత్రిగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఈ బిల్లును ప్రవేశ పెట్టారు. ఆ తర్వాత అది సెలెక్ట్ కమిటీకి పంపించబడింది. అందులో అంబేద్కర్ కూడా ఉన్నారు.

సెలెక్ట్ కమిటీ రిపోర్ట్‌ను 1948 ఆగస్టు 12వ తేదీన డా॥ అంబేద్కర్ సభలో ప్రవేశపెట్టారు. ఆగస్టు 31వ తేదీన ఈ బిల్లును ఆమోదించాలని సభలో ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. కాని ఈ సంస్కరణలకు ఎంతగా వ్యతిరేకత ఉందంటే, ఆ తీర్మానం ప్రవేశపెట్టడానికే సభ్యులు అడ్డుపడ్డారు. ఒక సంవత్సర కాలంలో ఏడు రోజులు సమయాన్ని బిల్లులోని అంశాలమీద చర్చకు కాకుండా, అసలు బిల్లుని అనుమతించాలా వద్దా అనే దానిమీద చర్చ జరగాలని నిర్ణయించారు. యుద్ధానికి అందరూ సన్నద్ధులైనారు. ఒక సంవత్సరం తర్వాత 1949 డిసెంబర్ 19న తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి అనుమతి లభించింది. కాని ఆ తర్వాత దాదాపు 1950 సంవత్సరం మొత్తం కాలంలో ఆ బిల్లు ఏజెండాలోకి రాలేదు. 1952 మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల ముందు ముగియబోతున్న పార్లమెంట్ ఆఖరి సమావేశాలు కాబట్టి చివరి నిమిషం వరకు దానిని వాయిదా వేయించడానికి ప్రత్యర్థులు అనేక కుయుక్తులు పన్నుతూనే ఉన్నారు.

కానీ అంతిమంగా 1951 ఫిబ్రవరి 5వ తేదీన ఈ బిల్లు చర్చ, ఆమోదానికి ప్రవేశ పెట్టబడింది. ఈ బిల్లు వలన తన ప్రభుత్వం నిలబడటం కాని పడిపోవడం గాని జరుగుతుందని అంతకు ముందు మాట్లాడిన ప్రధానమంత్రి నెహ్రూ ఈ చర్చల సందర్భంగా ఛాంసవాదుల ఒత్తిడులకు తలొగ్గి అనూహ్యంగా వెనకడుగు వేశాడు. బిల్లులోని కొన్ని భాగాలను అంటే వివాహం, విడాకులకు సంధించిన అంశాలే ప్రశపెట్టాలని, ఇతర అంశాలైన భరణం, వారసత్వం వంటి వాటిజోలికి వెళ్ళొద్దనిడా॥ అంబేద్కర్‌కు ఆదేశాలు జారీచేశాడు.

### అంబేద్కర్ × హిందూత్వ....

తప్పనిసరి పరిస్థితులలో అంబేద్కర్ ఇందులోని మూడు అంశాలను మాత్రమే ఎంచుకున్నారు. అవి కూడా వివాదాస్పదమౌతాయని ఆయన ఊహించారు. 1. వివాహం చట్టబద్ధం అవ్వడానికి కులం ప్రాతిపదిక తీసివేయటం (2) ఒకే మహిళతో వివాహం (3) విడాకులు కోరడానికి మహిళలకు అనుమతినివ్వడం.


ఆయన సరిగానే ఊహించారు. ఈ మూడు అంశాలపై క్రోధం కట్టలు తెంచుకుంది. పార్లమెంట్ సభ్యులు అనేక విధాలుగా స్పందించారు. కొంతమంది వివాహానికి కులాన్ని ఖచ్చితంగా ఒక కొలబద్ధగా ఉంచాలని, లేకపోతే హిందూ సమాజం కుప్పకూలిపోతుందని వాదించారు. (భార్గవ). హిందూ సమాజం ఇలా ముక్కలు ముక్కలుగా (కులాలు) విభజింప బడింది. ఏదోవొక ఉద్దేశ్యంతోనో లేదా ఎవరినో గాయపరచాలనో కాదు. అది కేవలం తరతరా లుగా వాస్తవ సాంప్రాయం మాత్రమే. ఏ వ్యక్తులైతే ఒకేరకమైన అలవాట్లు కలిగి ఉంటారో, భావావేశాలలో నిర్మలత్వం ఉంటుందో వారంతా కలిసి భోజనం చేయాలి. వివాహాలు చేసుకోవాలి, అలా చేస్తేనే ఆ యొక్క వ్యక్తి, ఆ జాతి సంతోషంగా ఉంటుంది. (భట్)

బి.జె.పి. ఈ రోజు తమ ఆదర్శ పురుషుడిగా చూపిస్తున్న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వివాహ చట్టం, పురుషుడు ఒకే స్త్రీని పెళ్ళి చేసుకోవాలనటంపై ఎదురుదాడి చేశారు. ఆర్.ఎస్.ఎస్. వారపత్రిక అయిన ఆర్గనైజర్‌లో ఏ విషయాలైతే రాశారో అవే ఉటంకిస్తూ ఆయన మాట్లాడారు. ఆర్గనైజర్ పత్రిక డా॥ అంబేద్కర్‌పై విష ప్రచారం చేసింది. ముఖర్జీ మాట్లాడుతూ, ఈ బిల్లును తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది క్రూరమైనది, హిందూ లా గురించి, హిందూ సంస్కృతి, ధర్మాల గురించి తెలియని అజ్ఞాన పత్రమిది అని అన్నాడు. విడాకుల హక్కును వ్యతిరేకిస్తున్నామని ఆర్గనైజర్‌లో రాశారు. ముఖర్జీ ఇవన్నీ

**❝ హిందూ మితవాదులు సంస్కరణలకు వ్యతిరేకతను దేశ లౌకికతత్వ మౌలిక పునాదు లపైనే ఎక్కుపెట్టారు. దీనిలో ముఖర్జీ ప్రథము డిగా ఉన్నాడు. తన సవరణలను ఆమోదించా లని మాట్లాడుతూ ముఖర్జీ, మనది లౌకికరాజ్యం అంటున్నారు. నిజానికి మనకి లౌకికతత్వం అనే వ్యాధి సోకింది. ❞**

పేర్కొంటూ మహిళలకు విడాకుల హక్కు ఇవ్వ టం అంగీకరింపజాలమని, వివాహమనే పవిత్ర మైన కార్యం లక్షలాది మంది ప్రజల్లో నాటుకు పోయిన సాంప్రదాయం. హిందూ వివాహ వ్యవస్థ మౌలికమైన, పవిత్రమైన కార్యం. డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ 90 శాతం శూద్ర మహిళలు తమ ఆచారాలలో, ఆచరణలో విడాకు హక్కు స్త్రీకి ఉండాలని గుర్తించారన్నారు. మీరు ఏ హిందు స్త్రీల గురించి మాట్లాడు తున్నారు అని ఆయన ముఖర్జీని ప్రశ్నించారు. చరిత్రలో సామాజిక పరివర్తన అంతటినీ పరిశీలిస్తే, బ్రాహ్మణుల విశ్వాసాలు, భావజా లాలు, తమని నమ్మిన వారందరిమీద రుద్దబడ్డా యని ఆయన పేర్కొన్నారు. పవిత్రమైన వివాహం అంటే నా ఉద్దేశ్యంలో పురుషులకి బహు భార్యత్వం హక్కు కల్పించేదిగానూ, మహిళలని శాశ్వత బానిసలుగా మార్చే సాధనంగా అగుపి స్తోందని అంబేద్కర్ విమర్శించారు. దీనికి ముఖ ర్జీ స్పందిస్తూ చాలా కీలకమైన సమాధాన మిచ్చారు. ఎవరి తాత, ముత్తాతల నుండి అనాదిగా వస్తున్న ఈ సాంప్రదాయాలను తు.చ. తప్పకుండా పాటిస్తున్నారో, వారు ఈ బిల్లు ప్రవేశపెట్టిన వ్యక్తికన్నా గొప్ప దేశభక్తులు. వారి మీద ఇటువంటివి రుద్దకండి అని వాపోయారు.

డా॥ అంబేద్కర్ ముఖర్జీ అభిప్రాయాలపై గట్టిగా ఎదురుదాడి చేశారు. బహు భార్యత్వంపై తన వాదనను సమర్థించుకొంటూ ముఖర్జీ, మీరు ఒకే స్త్రీని వివాహం చేసుకొనే వ్యవస్థను దేశంలోని అందరికి వర్తింపచేస్తేనే తీసుకురండి. కేవలం ఒక తరగతి ప్రజల కోసం తేవద్దు అని పేర్కొన్నారు. బొంబాయి, బరోడా, మద్రా సు, ట్రావన్‌కోర్ (కొచ్చిన్) పావిన్స్‌లలో అప్పటికే ఒక స్త్రీని మాత్రమే వివాహం చేసుకోవాలని చట్టాలు ఆమోదింపబడ్డాయి అని ఆ సందర్భం లో ఆయనకు గుర్తు చేశారు. అయినా ఆయన అంగీకరించక తన సవరణకు ఆమోదించాలని, ఈ చట్టాన్ని అందరికీ తప్పనిసరి చేయాలని, లేదంటే దీనిని హిందువులకి ఆప్షన్‌గా ఉంచాలి



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

గాని నిర్బంధం చేయరాదని వాదించారు.

హిందూ మితవాదులు సంస్కరణలకు వ్యతిరేకతను దేశ లౌకికతత్వ మౌలిక పునాదు లపైనే ఎక్కుపెట్టారు. దీనిలో ముఖర్జీ ప్రథము డిగా ఉన్నాడు. తన సవరణలను ఆమోదించా లని మాట్లాడుతూ ముఖర్జీ, మనది లౌకికరాజ్యం అంటున్నారు. నిజానికి మనకి లౌకికతత్వం అనే వ్యాధి సోకింది. అందువలనే ప్రభుత్వం ఈ బిల్లుని అందరికీ వర్తింపచేయటం లేదని వాపోయారు.

**ఉమ్మడి పౌరస్మృతి**

ఆర్.ఎస్.ఎస్. వారి ఉమ్మడి పౌరస్మృతి వాదనపై సరియైన సమాధానం చెప్పాలంటే ఆనాడు, డా॥ అంబేద్కర్ తర్కించిన తీరుని మనం అర్థం చేసుకోవాలి. ఆర్.ఎస్.ఎస్. దాడి అంతా మైనారిటీల మీదనే కాని మహిళల సంక్షేమం గురించి కాదు. అంబేద్కర్ మాట్లాడు తూ, నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. నిన్నటి వరకు ఈ హిందూకోడ్ బిల్లును ఎవరైతే తీవ్రంగా వ్యతిరేకించారో, పురాతన హిందూ సాంప్రదాయాలకు కాపలాదారులమని చెబుతు న్నారో వారే ఈనాడు తాము ఉమ్మడి పౌరసత్వ చట్టానికి గట్టి మద్దతుదారులమని ప్రకటించడం హాస్యాస్పదం. చిరుత పులులు తమ ఒంటిమీద మచ్చలను మార్చుకోలేవు అనే సామెత ఉంది. కాని ఈ చిరుత పులులు ఈ బిల్లు సభలో కొచ్చినప్పుడల్లా దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిం చాయి. ఇప్పుడు అకస్మాత్తుగా తమ ఆలోచనా విధానాన్ని మార్చుకొని, ఏకంగా ఒక విప్లవాత్మక మైన కొత్త అఖిల భారత పౌరసత్వం చట్టాన్ని తెద్దామంటున్నాయి' అని విమర్శించారు.

ఎంత నిజం! గృహహింసకి వ్యతిరేకంగా ఉన్న చట్టాల వలన హిందు కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై పోతుందంటూ దానికి వ్యతిరేకంగా ఉన్న 498ఎ లాంటి క్లాజును కూడా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేశారు. మహిళలు ఇంటిపనిని ప్రాథమిక పనిగా వదిలేసి ఉద్యోగాలకు వెళ్ళటానికి, లింగ వివక్షతోపాటు దాడులు ఎదుర్కొంటున్న వారికి హక్కులు కల్పిం చటాన్ని వ్యతిరేకిస్తున్న ఈ ఛాందసవాదులు, ఉమ్మడి పౌరస్మృతి గురించి ఎంత గట్టిగా అరి చినా అది పొసగదు. చిరుత నిజంగానే దాని మచ్చలు మార్చుకోలేదు.

తన వాదనలలో అంబేద్కర్ వ్యక్తిగత చట్టాలు (పర్సనల్ లా) ఉండటం, దాని ప్రాధా న్యత, అవసరంపై గట్టిగా వాదించారు. ఆర్టికల్ 25 ప్రకారం ఒక నిర్దేశిత మతం వ్యక్తిగత చట్టాలకు, స్వేచ్ఛనిస్తుంది. రాజ్యాంగం ప్రకారం ఒక ముస్లిము తన ఇష్ట దైవాన్ని ప్రార్థించుకో వచ్చు. ప్రచారం చేసుకోవచ్చు అని అంగీకరించి నప్పుడు, మనం అతనికి వ్యక్తిగ తంగా చట్టాలను అనుసరించడానికి అనుమతి ఇచ్చినట్లే. అందు వలన ఒక కమ్యూనిటీకి వారి వ్యక్తిగత చట్టాలు ఉండటం తప్పేమీ కాదు. వారికవసరమైన పద్ధతిలో మార్చుకునే హక్కు కూడా వారికి ఉంది. అంతేకాని ప్రత్యేకంగా ఒక వర్గానికి స్వేచ్ఛని ఇస్తున్నామనటం తప్పు. అలాగే హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టే ముందు హిందూ సమాజంలోని అన్ని తరగతుల ప్రజానీకంతో చర్చించి, వారి అభిప్రాయాలను సేకరించిన తరువాతే రావ్ కమిటీ ఈ బిల్లుని ప్రవేశ పెట్టిందని తెలియజేశారు.

**పర్సనల్ లా సంస్కరణలు...**

భారతదేశం ముక్కలవ్వక ముందు 1937లో జిన్నా లెజిస్లేచర్‌లో షరియత్ చట్టాన్ని ప్రవేశపెట్టిన సంగతి అంబేద్కర్ గుర్తు చేశారు. ఈ చట్టం అందరికీ తప్పనిసరి అని వెసులు బాట్లు ఏవీ లేవని తెలిపారు. ఆయన చెప్పిన అంశం ఈ రోజుకీ చాలా విలువైనది, ఆలోచిం పదగినది కూడా. మైనారిటీ కమ్యూనిటీ ప్రతినిధు లమని చెప్పుకుంటున్న వారందరూ ఆలోచిం చాల్సిన సమయం వచ్చిందని, ముస్లిం మహిళల పట్ల తీవ్ర వివక్ష చూపే 'తలాక్' విధానంలో సంస్కరణలు తేవాల్సిన అవసరం ఉందని గుర్తిం చాలి. నేను ఏ కమ్యూనిటీ నుండి ఎటువంటి


"మహారాష్ట్ర నుండి ప్రతినిధిగా ఉన్న శ్రీమతి జయశ్రీ "హిందూ మతం ప్రమాదంలో ఉంది" అనే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వాదనకు స్పందిస్తూ "నేను ఆయననొక ప్రశ్న అడుగుతున్నాను. భార్యను కొట్టడం అనేదేనా ఆయన మతం. ఒక ప్రజ్ఞావంతుడైన జడ్జిగారు ఈ మధ్యకాలంలోనే భార్యను కొట్టడం హిందూ చట్టం ప్రకారం నేరం కాదని కోర్టులో సెలవిచ్చారు."

వాదనలు వినదలచుకోలేదు. మతం యొక్క వ్యక్తిగత అంశాలు, చట్టాలపై చర్చించే హక్కు ఈ పార్లమెంట్‌కి లేదని ఎవరన్నా అన్నా ఊరుకోను. కాని ఏ ప్రజలైతే మీరు చేసే చట్టాల వలన బాధపడుతున్నారో అటువంటివి చేసేముందు, బాధిత వర్గాలన్నిటినీ సంప్రదించిన తరువాతే మీరు నిర్ణయాలు తీసుకుంటే మంచిది.

1948 నుండి 51 వరకు ఈ బిల్లుపై జరిగిన చర్చలు, వాదోపవాదాలు అన్నింటిలోనూ అంబేద్కర్‌కి అండగా, బాసటగా నిలిచింది మహిళా పార్లమెంటు సభ్యులు. మతాలకు సంబంధం లేకుండా అందరూ ఏదో ఒక రూపంలో ఈ బిల్లుని సమర్థించారు. దశాబ్దాల అనంతరం కూడా వారి పదునైన వాదనలు అందరి చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. మహారాష్ట్ర నుండి ప్రతినిధిగా ఉన్న శ్రీమతి జయశ్రీ "హిందూ మతం ప్రమాదంలో ఉంది" అనే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వాదనకు స్పందిస్తూ "నేను ఆయననొక ప్రశ్న అడుగుతున్నాను. భార్యను కొట్టడం అనేదేనా ఆయన మతం. ఒక ప్రజ్ఞావంతుడైన జడ్జిగారు ఈ మధ్యకాలంలోనే భార్యను కొట్టడం హిందూ చట్టం ప్రకారం నేరం కాదని కోర్టులో సెలవిచ్చారు. ఇటువంటి క్రూరమైన ఆచారాలనేనామీరు మతం అని పిలిచేది? అని ఘాటుగా విమర్శించింది. 'సాంప్రదాయాలు' అనే పదాన్ని వ్యతిరేకిస్తూ, ఇంకొక వెయ్యి సంవత్సరాలు మనం ఇలాగే బ్రాహ్మణ వారసత్వ భావజాలాలను కొనసాగించుతుందాం" అని రేణుకారాయ్ వ్యంగ్యంగా విమర్శించారు. దక్షనాయి వేలాయుధన్ అనే మహిళ ఆనాటి దళితుల పరిస్థితులపై సమరశీలంగా పోరాడిన నాయకురాలు. ఆవిడ అంబేద్కర్‌ని సమర్థిస్తూ, షెడ్యూల్ కులంలోని మహిళలకు కూడా సమాన హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. పద్మజా నాయుడు, సుచేత కృపలాని, హన్సా మెహతా అమ్ము స్వామినాథన్, బేగం ఆజీజా రసూల్ లాంటి వారెందరో ఆనాడు ఈ వాదనలను గట్టిగా వినిపించారు.

**నెహ్రూ దిగజారుడుతనం – రాజీనామా....**

ఈ బిల్లుపై అనేక కోణాల్లో, విభిన్న అంశాలపై జరిగిన చర్చలకు డా॥ అంబేద్కర్ సూటిగా, నిక్కచ్చిగా జవాబులు ఇచ్చారు. అయినా నెహ్రూ ప్రభుత్వం అనూహ్యంగా వెనకడుగు వేసింది. రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ ఈ బిల్లుపై సంతకం చేయకుండా తిప్పి పంపిస్తారని, దాని వలన ప్రజలలో అపఖ్యాతి వస్తుందని ఊహించి భయంగా ప్రధాని నెహ్రూ పార్లమెంట్ సెషన్ ఆఖరి ఘడియలలో, అనితర



నాటి ప్రధాని నెహ్రూ

సాధ్యమైన సమాధానాలతో వాదించిన డా॥ అంబేద్కర్‌ను, ఆయనకు మద్దతుగా మాట్లాడిన వారందరినీ విస్మరించి, బిల్లును ఉపసంహరించుకోమని ప్రభుత్వం న్యాయశాఖామంత్రికి ఆదేశాలు జారీచేసింది.

దీనిని నిరసిస్తూ డా॥ అంబేద్కర్ వెంటనే రాజీనామా చేశాడు. సెప్టెంబర్ 27, 1951న ఆయన రాసిన రాజీనామాలో ఆయన అనుభవించిన మానసిక క్షోభను, జరిగిన పరిణామ క్రమాన్ని, వెన్నుపోటు పొడిచిన విధానాన్ని వివరించారు. నా అభిప్రాయం ప్రకారం ప్రధానమంత్రి నిజాయితీగా ఉన్నా హిందూ కోడ్ బిల్లును ముందుకు తీసుకెళ్ళాలనే తపన, పట్టుదల చూపించలేదు. ప్రధానమంత్రికి ఇంత అవిధేయంగా ఉన్న చీఫ్‌విప్‌ను నేనింతవరకు చూడలేదు. తనకు విధేయంగా లేని విప్‌కు ఇంత విధేయంగా ఉన్న ప్రధానమంత్రిని కూడా చూడలేదు అని విమర్శించారు. వర్గాలమధ్య, లింగపరంగా అసమానతలు బలంగా ఉన్న హిందూ సమాజాన్ని ఇలాగే వదిలేసి, ఆర్థిక అంశాలపై చట్టాలు చేసుకుంటూపోతే, బురద గుంటలో అద్దాలమేడ కట్టినట్లే అని నా అభిప్రాయం. నాకు నేను నిజాయితీగా ఉండాలి. కాబట్టే నేను మంత్రివర్గం నుంచి నిష్క్రమిస్తున్నాను అన్నారు అంబేద్కర్.

**అంబేద్కర్‌కు రుణపడి ఉన్న మహిళలు**

ప్రపంచంలో మహిళా హక్కుల కోసం, సమానత్వం కోసం రాజీనామా చేసిన మొట్ట మొదటి క్యాబినెట్ మంత్రిగా అంబేద్కర్ రికార్డు నేటికీ అలాగే ఉంది.

ఇక సంస్కరణల మాటైతే అవి 1954 దాకా పూడ్చివేయబడ్డాయి. 1954 నుండి 56 మధ్యకాలంలో మరింత నీరుగార్చి తయారు చేసిన నాలుగు రకాలైన బిల్లులు, మహిళల వివాహ హక్కు, విడాకులు, భరణము, వారసత్వం మీద ఆమోదించబడ్డాయి. 2005లో హిందూ వారసత్వ చట్టంలో మార్పుచేసి మహిళలను సమాన భాగస్వామిగా చేశారు. ఇప్పటి కొత్త చట్టాలలో చాలా లొసుగులు ఉన్నాయి. డా॥ అంబేద్కర్ చేపట్టిన పనులు సాధించకుండా వదిలివేసినవి ఇంకా చాలానే ఉన్నాయి.

భారతదేశంలో మహిళలు డా॥ అంబేద్కర్‌కి ఎంతో ఋణపడి ఉన్నారు. ఆర్.ఎస్.ఎస్. సారథ్యంలో నడుస్తున్న బి.జె.పి. ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహస్యం చేసేవిధంగా, ప్రజల మౌలిక హక్కులను కాలరాచేలా వ్యవహరిస్తున్నది. హిందూ రాష్ట్ర ఎజెండాను రుద్దే ప్రయత్నం చేస్తోంది. ఆనాడు హిందుకోడ్ బిల్లుపై జరిగిన చర్చలో నేర్చుకున్న పాఠాలు నేటి పరిస్థితిలో తక్షణ ప్రాధాన్యత కలిగి ఉన్నాయి.

అంబేద్కర్ మాటల్లో "దేశంలో ఉన్న ప్రతి సామాజిక సంస్థలోనూ రాజ్యాంగం యొక్క ప్రాథమిక సూత్రాలు సక్రమంగా అమలు జరుగుతున్నాయో లేదో చూడాల్సిన అవసరం ఉంది" అన్నది అత్యవసరంగా చేయాలి. హిందుత్వ వాదులకు వ్యతిరేకంగా, మహిళలను బానిసత్వం నుండి విముక్తి చేయటం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ముందుకు తీసుకుపోవటానికి, ఆయన వారసత్వాన్ని కొనసాగించటానికి ఆయన 125వ జయంతి సందర్భాన్ని వినియోగించుకోవాలి.

(అనువాదం : ఎల్.ఎస్. భారవి)

# కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

ఎస్ వీరయ్య

**కార్మికవర్గ పార్టీ :**

కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గ పార్టీ. శ్రామికుల పార్టీ అని గానీ, పేదల పార్టీ అని గానీ లేదా మరో పేరుతో కానీ కాకుండా కార్మికవర్గ పార్టీ అనడానికి నిర్ధిష్టమైన కారణం ఉంది. శ్రామికవర్గాలలో కార్మికవర్గం ఆధునికమైనది. కార్మికవర్గం దోపిడీ నుంచి విముక్తి చెందేందుకు గాను సమాజంలోని అన్ని రకాల దోపిడీలు, అణచివేతలు, వివక్షలు అంతం కావల్సిందే. ఒక వర్గం మరొక వర్గం మీద లేదా ఒక జాతి మరొక జాతి మీద ఆధిపత్యం చెలాయించే పరిస్థితులు ఉండగా కార్మికవర్గ విముక్తి అసాధ్యం. అందుకే సమాజంలోని వివిధ శ్రామికవర్గాల, తరగతుల విముక్తి కోసం కార్మిక వర్గం పోరాడవలసి ఉంటుంది. అందుకోసం వారందరినీ సమీకరించటం అనివార్యం. అందుకే కమ్యూనిస్టు పార్టీ తనను తాను కార్మికవర్గ పార్టీగా ప్రకటించుకున్నది.

**సమాజ మార్పుకు చోదక శక్తి వర్గ పోరాటం :**

ఆదిమ సమాజం మినహాయిస్తే మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రే. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా దోపిడీకి గురయ్యే వర్గాల తిరుగుబాట్ల చరిత్రే. ఈ పోరాట క్రమంలోనే సమాజం అభివృద్ధి చెందుతూ వస్తున్నది. అందుకే వర్గ పోరాటాన్ని ఉధృతం చేయడమే కమ్యూనిస్టు పార్టీ కర్తవ్యంగా ఎంచుకున్నది. కార్మికవర్గ నాయకత్వంలో ఇతర శ్రామిక వర్గాలను సమీకరించి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాడవలసి ఉంటుంది. సమాజంలో ప్రజానీకం వృత్తి, కులం, మతం, ప్రాంతం, జాతి, తెగ, లింగ, తదితర ప్రాతిపదికలపై విభజించబడి ఉన్నారు. వృత్తి ప్రాతిపదిక మీద సమాజాన్ని పరిశీలించినప్పుడు వివిధ వర్గాలను మనం గుర్తించవచ్చు. ఇది కార్మిక వర్గాన్ని, ఇతర శ్రామికవర్గాలను ఐక్యం చేసి దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా పోరాటం ఎక్కు పెట్టడానికి తోడ్పడుతుంది. వృత్తి ప్రాతిపదికగా చూసినప్పుడు కార్మికులు, మధ్యతరగతి, వ్యవసాయ కూలీలు, పేద రైతులు, కౌలు రైతులు, వృత్తిదారులు, మధ్యతరగతి రైతులు, ధనిక రైతులు, భూస్వాములు, పెట్టుబడిదారులు, జులాయిగా తిరిగేవాళ్ళు (అలగాజనం) తదితర రకాలుగా ప్రజలు విభజించబడి ఉన్నారు.

**విప్లవకర వర్గం :**

సమాజంలో కార్మికవర్గం ఆధునికమైనది. ఆస్తి లేనిది (ఉత్పత్తి సాధనాలు తన సొంతం కాదు). శ్రమ శక్తిని అమ్ముకోవడం ద్వారా మాత్రమే జీవించే వర్గం. సమిష్టి కృషి, క్రమశిక్షణ, త్యాగం దాని లక్షణం. పోరాటంలో చివరకంటా నిలువగలుగుతుంది. ఆర్థిక వ్యవస్థలో ఇది కీలకస్థానంలో ఉన్నది. స్తంభింపజేయగల శక్తివంతమైన వర్గం ఇది. సమాజంలో అన్ని రకాల దోపిడీలు, ఆధిపత్యాలను అంతం చేయడం ద్వారానే తన విముక్తి కోసం పోరాడుతుంది. అందుకే ఇది విప్లవకర వర్గం. వ్యవసాయ కార్మికులు కూడా ఆస్తి లేని వర్గమే. శ్రమశక్తిని అమ్ముకోవడం ద్వారానే జీవనం గడుస్తుంది. ఇది కూడా పట్టుదల, త్యాగనిరతి కలిగిన వర్గమే. కౌలు రైతులు, పేద రైతులకు ఎకరం, 2 ఎకరాల భూమి ఉన్నా అది వారి జీవనోపాధికి చాలదు. ఇతర భూములు కౌలుకు తీసుకుని పనిచేయడం లేదా ఇతరుల భూమిలో కూలిపని చేయకుండా పొట్టగడవదు. మధ్య తరగతి రైతాంగానికి సొంత భూమి ఉంటుంది. కుటుంబసభ్యులు తమ భూమిపై పనిచేస్తారు. కూలీల చేత కూడా పని చేయించుకుంటారు. ధనికరైతుకు కుటుంబ అవసరానికంటే ఎక్కువే భూమి ఉంటుంది. అవసరాన్ని బట్టి ధనిక రైతు కూడా పనిచేయడానికి సిద్ధపడినా ప్రధానంగా కూలీలతోనే పని చేయించుకుంటారు. భూస్వామిగా మారాలన్న తపన ప్రదర్శిస్తారు. పెద్ద పెద్ద భూఖండాలు భూస్వామి చేతుల్లో ఉంటాయి. భూస్వామిగాని, తమ కుటుంబ సభ్యులు గాని పనిచేయరు. రైతాంగం, కూలీలు, వృత్తిదారుల శ్రమను దోచుకుంటారు. సమాజంలో వీరిని మించిన సోమరిపోతులు ఉండరు. ఇతర శ్రామికవర్గాల మీద ఆధిపత్యం చెలాయిస్తారు. అహంభావం ప్రదర్శిస్తారు. నిరంకుశత్వం ఈ వర్గం లక్షణం. గ్రామీణ వృత్తిదారులు తమకవసరమైన సొంత పరికరాలు కలిగి ఉంటారు. కుటుంబమంతా వృత్తి పనిలో భాగస్వాములవుతారు. తాము శ్రమించడం ద్వారానే జీవిస్తారు. ఆధునిక మధ్యతరగతి విద్యావంతులై ఉంటారు. డాక్టర్లు, లాయర్లు, గుమాస్తాలు తదితరులు ఈ వర్గానికి ఉదాహరణలుగా చెప్పవచ్చు. వీరు కూడా శ్రమిస్తారు. వృత్తిదారులైనా, ఆధునిక మధ్యతరగతి అయినా వీరి కృషి ప్రధానంగా వ్యక్తిగతం. "నేను కష్టపడుతున్నాను, నేను సంపాదిస్తున్నాను" అన్న భావనతో ఉంటారు. దీనినుండి పుట్టిందే నాది అన్న స్వభావం. ఇది సమిష్టి కృషికి, సమిష్టి ప్రయోజనానికి కొంత భిన్నమైనది. రౌడీలు, దొంగలు, వేశ్యలు తదితర రకాల వారు జులాయి (అలగా జనం) కిందికి లెక్కించవచ్చు. వీరు ఆర్థిక రంగంలో ఉత్పత్తి క్రమంలో భాగం కారు. పనిచేయరు. అంత మాత్రాన సోమరులు అనలేము. సమాజంలో కష్టాలే అనుభవిస్తారు. అవమానాలు భరిస్తారు. ఇతరులనూ కష్టపెడతారు. అవమానానికి గురి చేస్తారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తారు. అందువల్ల సమాజానికి నష్టం కలిగిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరు ఉత్పత్తి క్రమంలో పాల్గొనకుండానే, సమాజం అంగీకరించని జీవన విధానాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా సమాజానికి నష్టం చేస్తారు. పెట్టుబడిదారులు ఆధునిక ఉత్పత్తి సాధనాలకు యజమానులుగా ఉన్నారు. కార్మికుల శ్రమను దోచుకోవడం ద్వారానే తాము జీవిస్తూ సంపదను పోగేసుకుంటారు. వీరి దృష్టిలో లాభం కోసం ఏం చేసినా అదే నీతి. నష్టం కలిగించేది ఏదైనా అంగీకారం కాదు. సమాజానికి ఎంత నష్టం కలిగించినా తమకు లాభం తెచ్చిపెట్టేది అయితే అది న్యాయం.


సమాజం అంతా దాన్నే న్యాయంగా అంగీకరించాలి. సమాజంలో లంచగొండితనం, వేశ్యావృత్తి వీరి దోపిడీకి అవసరం. వాటిని ప్రోత్సహిస్తారు. అందుకే వాటిని పరిష్కరించరు. లాభం సంపాదించడం కోసం లంచగొండితనం, వేశ్యావృత్తి, మోసపూరిత పద్ధతులన్నింటినీ ఉపయోగించుకుంటారు. లాభమే వీరికి సర్వం. లాభం కోసం ఏమైనా చేస్తారు. ఇది పెట్టుబడిదారీ వర్గ లక్షణం.

వివిధ తరగతుల లక్షణాలన్నీ పరిశీలించినప్పుడు కార్మికవర్గమే విప్లవకర వర్గంగా మనం సులభంగానే అర్థం చేసుకోవచ్చు. అందుకే వివిధ వర్గాలకు చెందిన కుటుంబాల నుంచి కమ్యూనిస్టులుగా మారేవారందరూ తమకు వారసత్వంగా వచ్చిన తమతమ వర్గ లక్షణాలను విడనాడి కార్మికవర్గ లక్షణాలను అలవర్చుకోవాలి. అప్పుడే కార్మికవర్గ ప్రయోజనానికి కట్టుబడి పనిచేయగలరు.

**వర్గ దృక్పథం :**

సమాజంలో ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ పరిస్థితులన్నింటినీ వర్గ దృక్పథంతో పరిశీలించాలి. మన చుట్టూ జరుగుతున్న సంఘటనలు, పరిణామాలు ఈ దృక్పథంతోనే అర్థం చేసుకోవాలి. కార్మికవర్గ ప్రయోజనానికి అవి తోడ్పడతాయా లేక నష్టం కలిగిస్తాయా అనేది బేరీజు వేసుకోవాలి. కార్మికవర్గ ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ఘటనలు లేదా పరిణామాల మీద తమ వైఖరి నిర్ణయించుకోవాలి. అప్పుడే అది కార్మికవర్గ పార్టీ అవుతుంది. ఉదాహరణకు కుల, మత, ప్రాంతీయ తగాదాలు శ్రామికులను చీలుస్తాయి. కమ్యూనిస్టులు కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటంలో శ్రామికులందర్నీ ఐక్యం చేయవచ్చు. మత సామరస్యం కోసం కష్టజీవులను ఐక్యం చేయవచ్చు. ప్రాంతీయ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడవచ్చు. మల్లన్నసాగర్ నిర్వాసితులు నష్టపరిహారం కోసం చేసే పోరాటాన్ని సమర్థిస్తాము. ఇది న్యాయమైన కోరిక. తమకు న్యాయం చేయాలని మాత్రమే వారు కోరుతున్నారు. మరో వైపు ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే రైతాంగాన్ని పాలకవర్గాలు సమీకరించి నిర్వాసితులకు వ్యతిరేకంగా ఎగదోసేందుకు ప్రయత్నించారు. ఇది నిర్వాసిత రైతాంగానికి అన్యాయం చేయటమే. రైతాంగం ఐక్యతకు చిచ్చు పెట్టడమే. పాలకవర్గాల ఎత్తుగడను వ్యతిరేకిస్తాము. న్యాయమైన డిమాండ్ల ప్రాతిపదికగా మొత్తం రైతాంగాన్ని ఐక్యం చేసేందుకు ప్రయత్నిస్తాము.

**“ సమాజంలో ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ పరిస్థితులన్నింటినీ వర్గ దృక్పథంతో పరిశీలించాలి. మన చుట్టూ జరుగుతున్న సంఘటనలు, పరిణామాలు ఈ దృక్పథంతోనే అర్థం చేసుకోవాలి. కార్మికవర్గ ప్రయోజనానికి అవి తోడ్పడతాయా లేక నష్టం కలిగిస్తాయా అనేది బేరీజు వేసుకోవాలి. ”**



స్టాలిన్

**విప్లవ పరిస్థితులు – విప్లవ పార్టీ :**

విప్లవ పరిస్థితులు ఏర్పడినప్పుడు జోక్యం చేసుకుని విప్లవ పోరాటానికి నాయకత్వం వహించగల కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి. అలాంటి పార్టీ లేనప్పుడు ఇతరత్రా అనుకూల పరిస్థితులు ఎన్ని వచ్చినా విప్లవం జయప్రదం కాదు. శ్రామిక ప్రజలలో అసంతృప్తి పరాకాష్టకు చేరాలి. మారుమూల ప్రాంతాల్లో సైతం అత్యంత వెనుకబడిన శ్రామిక జనం కూడా కదిలే పరిస్థితులు ఏర్పడాలి. ఆర్థిక సంక్షోభం తీవ్రమైనప్పుడే ఈ పరిస్థితులు సంభవిస్తాయి. అంతేకాదు, ఆర్థిక సంక్షోభం రాజకీయ సంక్షోభంగా మారాలి. పాలకవర్గాలలోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోనూ, రాజకీయ రంగంలోనూ తీవ్రమైన ఘర్షణ, కుమ్ములాటల రూపంలో ఇది వ్యక్తమవుతుంది. ఈ పరిస్థితులలో సమర్థవంతంగా జోక్యం చేసుకుని కార్మికవర్గాన్ని, ఇతర శ్రామికులను చైతన్యవంతం చేసి ఐక్య పోరాట దిశలో నడపగల శక్తివంతమైన కమ్యూనిస్టు పార్టీ లేకపోతే, ఈ అసంతృప్తులన్నీ ఉద్యమ రూపం దాల్చినప్పటికీ, దారీ తెన్నూ లేకుండా పాలపొంగులాగా చల్లారిపోతాయి. అందుకే పరిస్థితులు అనుకూలించినప్పుడు తగు రీతిలో జోక్యం చేసుకోగలిగిన పటిష్టమైన కమ్యూనిస్టు పార్టీని నిర్మించకుండా విప్లవం సాధ్యం కాదు. రాజకీయ రంగంలో దోపిడీ వర్గాలకు అనేక బూర్జువా పార్టీలు రాజకీయ సాధనాలుగా ఉన్నాయి. కార్మికవర్గానికి కూడా పాలకవర్గాలను రాజకీయంగా ఎదుర్కోగలిగిన రాజకీయ సాధనం అవసరం. అది లేనప్పుడు కార్మిక వర్గం రాజకీయంగా నిరాయుధమవుతుంది. అందుకే కార్మికవర్గానికి కూడా తనకంటూ ఒక రాజకీయ పార్టీ అవసరం. అదే కార్మికవర్గ పార్టీ లేదా కమ్యూనిస్టు పార్టీ.

**రాజ్యాంగయంత్రం :**

రాజ్యాంగయంత్రం శక్తివంతమైనది. రాజ్యాంగ యంత్రం అంటేనే బలప్రయోగ సాధనం. అది ఇప్పుడు బడా పెట్టుబడిదారీ వర్గం నాయకత్వంలో పెట్టుబడిదారులు, భూస్వాముల చేతుల్లో ఉన్నది. రాజ్యాంగం, చట్టం, సైన్యం, పోలీసు బలగాలు, న్యాయ వ్యవస్థ, ఉన్నతాధికార బృందం, వివిధ ప్రభుత్వ శాఖలు, వ్యవస్థలు అన్నీ రాజ్యాంగయంత్రంలో భాగమే. ఈ రాజ్యాంగయంత్రాన్ని ఉపయోగించుకునే పాలకవర్గాలు తమ దోపిడీని యదేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. కార్మికవర్గం, ఇతర శ్రామిక వర్గాల పోరాటాలను అణచివేస్తున్నారు. కులం, మతం, డబ్బు, భావవాద సిద్ధాంతాలు రాజ్యాంగ యంత్రాన్ని రక్షించేందుకు, ప్రజలు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడకుండా నిరోధించేందుకు ఉపయోగపడుతున్నాయి. కార్మికవర్గానికి వ్యతిరేకంగా పాలకవర్గాల చేతుల్లో ఇవి సాధనాలుగా ఉన్నాయి. అందుకే రాజ్యాంగయంత్రం పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల చేతుల్లో ఉన్నంతకాలం కార్మికవర్గ విముక్తి సాధ్యం కాదు. రాజ్యాంగ యంత్రాన్ని కార్మికవర్గం హస్తగతం చేసుకున్నప్పుడే సమాజంలో దోపిడీ, ఆధిపత్యం, వివక్షలను అంతం చేయగలుగుతుంది.

**సిద్ధాంతం – నిర్మాణం :**

రాజ్యాంగయంత్రాన్ని హస్తగతం చేసుకునేందుకు కార్మికవర్గం ప్రయత్నిస్తే దోపిడీ వర్గాలు చూస్తూ ఊరుకోవు. సర్వశక్తులూ ఒడ్డి అణచివే

“బడా బూర్జువా నాయకత్వంలోని బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం చెపుతున్నది. ఇందుకోసం వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘ టన నిర్మాణమే తక్షణ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధిం చేందుకు తగిన కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి.”

సేందుకు ప్రయత్నిస్తాయి. పాలకవర్గాల ఎత్తుల ను చిత్తుచేయగల విప్లవ సిద్ధాంతం కార్మిక వర్గానికి అవసరం. ఆ విప్లవ సిద్ధాంతాన్ని అందించేదే కమ్యూనిస్టు పార్టీ. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం లెనినిజాన్ని అన్వయించి చేసిన నిర్ధారణలే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం. బడా బూర్జువా నాయకత్వంలోని బూర్జువా భూస్వామ్య రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమం చెపుతున్నది. ఇందుకోసం వామపక్ష, ప్రజాతంత్ర ఐక్య సంఘ టన నిర్మాణమే తక్షణ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధిం చేందుకు తగిన కమ్యూనిస్టు పార్టీని నిర్మించాలి. అంటే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని బట్టే నిర్మాణం కూడా ఉంటుంది. విప్లవ సిద్ధాంతం కలిగి ఉన్న పార్టీ అందుకు తగిన విధంగా నిర్మాణాన్ని కూడా పటిష్టపర్చుకోవాలి.



రాజ్యాంగయంత్రంలో కీలకమైన సైన్యం

**విప్లవపార్టీ లక్షణాలు :**

విప్లవ పార్టీకి ఉండవలసిన లక్షణాల గురించి స్టాలిన్ వివరించారు.

1) ఇది కార్మికవర్గ అగ్రగామి దళం. కార్మికవర్గంలోని, సమాజంలోని అత్యుత్తమ శక్తులను ఇముడ్చుకోగలగాలి. అప్పుడే పోరుబాటలో ఉన్న కార్మికవర్గానికి కమ్యూనిస్టు పార్టీ రాజకీయంగా గానీ, సైద్ధాంతికంగా గానీ దిశా నిర్దేశం చేయగలుగుతుంది.

2) ఇది కార్మికవర్గ అగ్రగామి దళమే కాదు సంఘటిత అగ్రగామి దళం కూడా. అంటే పటిష్టమైనటువంటి క్రమశిక్షణ కలిగిన పార్టీ. అందుకే స్టాలిన్ ఈ క్రిందివిధంగా చెప్పారు. “అధికారం కోసం జరిగే పోరాటంలో శ్రామికులకు నాయకత్వం వహించి నడపగల ధైర్యం గల పార్టీ, ఒక విప్లవ పరిస్థితిలో ఉద్భవించే క్లిష్ట పరిస్థితులలో తన గమ్యాన్ని మర్చిపోకుండా నడపగలిగిన అనుభవం గల పార్టీ, మునిగి కనిపించకుండా దారిలోనున్న రాళ్ళను తప్పుకుంటూ చాకచక్యంగా గమ్యానికి చేర్చగల పార్టీ అవసరం. అలాంటి పార్టీ లేకుండా సామ్రాజ్య వాదాన్ని కూలదోయాలని, కార్మికవర్గ నియంతృత్వాన్ని సాధించాలని ఆలోచించడం కూడా వృధాయే”. కమ్యూనిస్టు పార్టీ ఐక్యంగా, పటిష్టంగా లేకుండా కార్మికవర్గాన్ని, శ్రామిక జనాన్ని ఐక్య పోరాట దిశలో నడపటం సాధ్యం కాదు.

3) ఇది ప్రజాబాహుళ్యపు విప్లవ పార్టీగా ఉండాలి. సాధారణ శ్రామిక ప్రజలతో పెనవేసుకున్న పార్టీగా ఉండాలి. ప్రజా ప్రయోజనాలే తన ప్రయోజనాలుగా పని చేయాలి. అనుక్షణం ప్రజలతో ఉండాలి. ఎందుకంటే ప్రజలే చరిత్ర నిర్మాతలు. ప్రజలు తమ సమస్యలు తామే పరిష్కరించుకునే విధంగా వారిని సిద్ధం చేయాలి. అనునిత్యం కమ్యూనిస్టు పార్టీ చేయవల్సిన పనే అది.

4) కార్మికవర్గపు అత్యున్నత నిర్మాణ రూపం కమ్యూనిస్టు పార్టీ. ఇది కార్మికవర్గానికి రాజ్యాధికారం కోసం ఏర్పడిన సంస్థ. అందుకే అన్ని రకాల కార్మికవర్గ సంస్థలన్నింటిలోకీ ఇది అత్యున్నత సంస్థ. కార్మికవర్గ ప్రయోజనం కోసం పనిచేసేందుకు అనేక నిర్మాణ రూపాలు, సంస్థలు ఉంటాయి. కార్మికసంఘాలు, సొసైటీలు, సంక్షేమ సంఘాలు, తదితర రూపాలలో ఇలాంటి సంస్థలు పనిచేయటం తెలిసిందే. ఇవన్నీ ఏదో ఒక రూపంలో కార్మికవర్గ ప్రయోజనం కోసం పని చేసేవే. కానీ కార్మికవర్గాన్ని దోపిడీనుండి శాశ్వతంగా విముక్తి చేసేందుకు కృషి చేసే రాజకీయ సంస్థ కమ్యూనిస్టు పార్టీ. అది రాజ్యాధికారం సాధించడం ద్వారానే సాధ్యం. అందుకే ఇది కార్మికవర్గపు అత్యున్నత నిర్మాణ రూపం. అందుకే కమ్యూనిస్టు పార్టీ సభ్యులు ఏ సంస్థలో, ఏ రంగంలో పని చేసినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ మార్గదర్శకత్వంలో పనిచేస్తారు.

5) కమ్యూనిస్టు పార్టీ అంటే కార్మికవర్గ నియంతృత్వ సాధనం అని కూడా స్టాలిన్ చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికవర్గ నియంతృత్వం అనే మాటలను అపార్థం చేసుకునేందుకు అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. నిజానికి కార్మిక వర్గ నియంతృత్వం అంటే అశేష ప్రజానీకానికి అది అత్యున్నత ప్రజాస్వామ్య రూపం. అది కార్మికవర్గ ప్రజాస్వామ్యం. పెట్టుబడిదారీ వ్యవస్థలో అమల్లో ఉన్న ప్రజాస్వామ్యం కంటే విస్తృతమైనది. దాన్నే సోషలిస్టు ప్రజాస్వామ్యం అని కూడా అంటాము. అంటే సోషలిస్టు వ్యవస్థలో ప్రజాస్వామ్యం మరింత విస్తృతం అవుతుం ది. సాధారణ ప్రజల్లో కార్మికవర్గ నియంతృత్వాన్ని ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలోని నియంతృత్వంగానే భావించే అవకాశం ఉన్నది. అందుకే సిపిఐ(యం) తాజాపరిచిన కార్యక్రమంలో కార్మికవర్గ నియంతృత్వం అనే మాటలను తొలగించింది. కార్మికవర్గ ప్రజాస్వామ్యం సాధించే సాధనమే కమ్యూనిస్టు పార్టీ.

6) ముఠాలను అనుమతించదు. పార్టీ సభ్యులందరికీ వర్తించే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలను అమలుజరుపుతుంది. వాటికి కట్టుబడి పనిచేస్తుంది. పార్టీలో కొంతమంది సొంత క్రమశిక్షణను కలిగి ఉండటాన్ని అనుమతించదు. ఇది పార్టీలో క్రమశిక్షణను ధ్వంసం చేస్తుంది. ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంది.

7) అవకాశవాద శక్తులను తొలగించ గలిగిన పార్టీగా ఉండాలి. నిరంతరం అవకాశ వాదం మీద పోరాడాలి. తక్షణ ప్రయోజనాల కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలను విస్మరించటమే అవకాశవాదం. కార్మికవర్గ విముక్తి మన దీర్ఘకాలిక ప్రయోజనం. దానికి లోబడే తక్షణ ప్రయోజనం లేదా తక్షణ కర్తవ్యాలు ఉండాలి. అందుకే అవకాశవాదాన్ని అనుమతించకూడదు. నిర్దిష్ట లక్ష్య సాధన కోసమే విప్లవ పార్టీ లక్షణాల గురించి ఇంత ప్రాధాన్యతనిచ్చి చర్చిస్తున్నాము. విప్లవ సిద్ధాంతాన్ని నమ్ముతూ, విప్లవ సాధన కోసం, విప్లవ పార్టీని నిర్మించాలి. ప్రతి కమ్యూనిస్టు ఆచరణా ఈ దిశలోనే ఉండాలి. ❋

**విశ్లేషణ**

# వృద్ధిరేటు - అభివృద్ధి

**బి తులసీదాస్**



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ సభ్యులు

ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొన్ని గణాంక వివరాలతో 'మండల స్థూల ఉత్పత్తి ', 'జిల్లాల ఆర్థిక పరిస్థితి – పనితీరు', 'రెండంకెల వృద్ధిని నిలకడగా కొనసాగించడం' అనే పుస్తకాలను విడుదల చేశారు. మండల స్థూల ఉత్పత్తి (ఎం.డి.పి) వివరాలను దేశంలోనే మొట్ట మొదటగా రూపొందించినట్లు తెలిపారు.

**అదే తారక మంత్రమా ...!**

వృద్ధిరేటు ఎక్కువగా సాధించడం మంచిదే కానీ అభివృద్ధి మొత్తానికి అదే సూచిక కాజాలదు. కాబట్టి తారకమంత్రంలా రెండంకెల వృద్ధిరేటును వల్లిస్తే కుదరదు. ఉదాహరణకు భారత్ వృద్ధిరేటు 7.6 శాతం కాగా, అమెరికా వృద్ధిరేటు కేవలం 2.7శాతం మాత్రమే. అంత మాత్రాన భారత్ అభివృద్ధి చెందిన దేశం కాజాలదు కదా! అమెరికా జిడిపి 17.42 లక్షల కోట్ల డాలర్లు (1డాలరు = రూ.68) కాగా భారత్ జిడిపి కేవలం 2.05లక్షల కోట్ల డాలర్లు మాత్రమే. కాబట్టి సంపదకు జిడిపి పరిమాణం ఒక ముఖ్యసూచిక అవుతుంది తప్ప వృద్ధిరేటుపై అంతగా గొప్పలు చెప్పుకోనక్కర్లేదు. 2014-15 సంవత్సరంలో అత్యధిక వృద్ధిరేటు సాధించిన రాష్ట్రం బీహార్. (ముఖ్యమంత్రి విడు దల చేసిన పుస్తకంలోనే ఉంది) కానీ మొత్తం ఉత్పత్తి విలువలో దేశంలో దానిది 12వ స్థానం, తలసరి ఆదాయంలో ఆ రాష్ట్రానిది 15వ స్థానమే.

ఎం.డి.పి, డి.డి.పి (జిల్లా స్థూల ఉత్పత్తి) వివరాలు రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనితీరును తెలియజేస్తా యని, వెనుకబడిన ప్రాంతాలను గుర్తించడంలో తోడ్పడతాయని, తద్వారా జిల్లా యంత్రాంగం అభివృద్ధి కార్యక్రమాల్ని రూపొందిస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కానీ ఈ వివరాలతో మాత్రమే అలాంటి నిర్ధారణలకు రావడం సరికాదు. రాష్ట్రంలో తలసరి ఆదాయంలో (పిసిఐ) మొట్ట మొదటి స్థానం గాజువాక (విశాఖ జిల్లా -రూ.3,86,311లు), రెండవ స్థానం అచ్యుతాపురం (విశాఖ జిల్లా - రూ.3,12,815లు) కాగా మూడవ స్థానం నందివాడ మండలం (కృష్ణా జిల్లా - రూ.3,08,371లు). అట్టడుగు స్థానంలో గుడిబండ (అనంతపురం జిల్లా - రూ.39,331లు), భామిని (శ్రీకాకుళం జిల్లా - రూ.40,413లు), కంచిలి (శ్రీకాకుళం జిల్లా రూ.41,131లు). జోడించిన స్థూల విలువ (గ్రాస్‌వాల్యూ యాడెడ్ జివిఎ) అత్యధికంగా గల మొదటి 10 మండలాలలో గాజువాక (పరిశ్రమలు) తప్ప మిగతా అన్నీ జిల్లా ముఖ్య కేంద్రాలే. సేవారంగం ప్రధాన ఆదా యం. ప్రభుత్వ కార్యాలయా లు, బ్యాంకులు, సంస్థలు, వర్తక, వాణిజ్యం ఎక్కువగా ఉంటాయి కనుక ఇది సహజం. (పట్టిక 1-(ఎ) చూడండి) పరిశ్రమలున్న మండలాల్లో సహజంగానే జివిఎ, పిసిఐ ఎక్కువగా ఉంటాయి. కానీ వివిధ జిల్లాల్లో చేపలు, రొయ్యల చెరువులున్న ప్రాంతాల్లో పై రెండూ ఎక్కువగా ఉన్నాయి.

| పట్టిక 1(ఎ) జివిఎ అత్యధికంగా గల 10 మండలాలు (రూ. కోట్లలో) | | | |
|---|---|---|---|
| సంఖ్య | టౌన్ | జివిఎ | కీలకరంగం |
| 1 | విజయవాడ అర్బన్ | 17665.77 | సేవారంగం |
| 2 | విశాఖ అర్బన్ | 12385.18 | సేవారంగం |
| 3 | గాజువాక | 10395.10 | పరిశ్రమలు |
| 4 | గుంటూరు | 8631.46 | సేవారంగం |
| 5 | నెల్లూరు | 6337.88 | సేవారంగం |
| 6 | కర్నూలు | 5252.54 | సేవారంగం |
| 7 | తిరుపతి అర్బన్ | 5086.45 | సేవారంగం |
| 8 | కాకినాడ అర్బన్ | 4090.71 | సేవారంగం |
| 9 | అనంతపురం | 4053.45 | సేవారంగం |
| 10 | ఏలూరు | 3800.65 | సేవారంగం |

**(మండల స్థూల ఉత్పత్తి 2014-15)**

తలసరి ఆదాయంలో మొదటి 10 స్థానాల్లో ఉన్న మండలాల్లో పరిశ్రమలు ప్రధానంగా గలవి ఏడు కాగా మూడు చేపలు, రొయ్యల చెరువులు, ఒక్క మండలం వ్యవ సాయం ప్రధానంగా గలవి. అయితే జనాభా తక్కువగా ఉండడం వల్ల నందివాడ, లింగాల 3,4 స్థానాల్లో ఉన్నాయి. (రాష్ట్రం సగటు మండల జనాభా సుమారు 74 వేలు కాగా ఈ రెండు మండలాల్లో అందులో సగం కన్నా తక్కువగా జనాభా (పట్టిక -1(బి) చూడండి) గాజువాకలో స్టీల్‌ప్లాంటు, అచ్యుతాపురంలో పారిశ్రామిక జోన్ ఉండడం వల్ల అవి మొదటి, రెండవ స్థానాల్లో ఉండగా చేపలు, రొయ్యల చెరువులు ఎక్కువగా ఉండడం, జనాభా స్వల్పం కావడంతో నందివాడ మూడవ స్థానానికి వచ్చింది. వాస్తవానికి అనేక అంశాల్లో నందివాడ చాలా వెనుకబడి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆ మండలంలో దళితులు 33.6 శాతం, అలాగే వ్యవసాయ కార్మికులు 74.5 శాతం ఉన్నారు. 2001 కంటే 2011 నాటికి జనాభా 9.92 శాతం తగ్గింది. రాష్ట్రంలో 9.29 శాతం, కృష్ణాజిల్లాలో 7.87 శాతం పెరగగా నందివాడ మండలంలో జనాభా తగ్గడం గమనార్హం. అంటే వ్యవసాయ కార్మికులు పనులు లేక శాశ్వత వలసలు పోతున్నారు. మండలంలో 39.8 శాతం పూరిళ్ళు కాగా, 51.7 శాతం కుటుంబాలకు మరుగుదొడ్లు లేవు. వెనుకబాటు తనానికి ఇంకా ఎన్నో వివరాలను చెప్పవచ్చు. కాబట్టి తలసరి ఆదా యం ఎక్కువగా ఉన్నంత మాత్రాన ఆ మండ లం మొత్తం అభివృద్ధి చెందినది కాజాలదు.

ప్రథమ స్థానంలో గల విజయ వాడ అర్బన్ మండలం జి.వి.ఎ రూ.17,665.77 కోట్లు కాగా, అట్టడు గున ఉన్న శ్రీకాకుళం జిల్లా, లక్ష్మీనర్సి పేట మండలం జివిఎ రూ.140.59 కోట్లు మాత్రమే. అంతరం సుమారు 125 రెట్లుంది. అదేవిధంగా తలసరి ఆదాయం గాజువాక మండలం రూ.3,86,311లు కాగా, అత్యల్పం అనంత పురం జిల్లా గుడిబండ మండలం రూ. 39,331లు మాత్రమే. ఇందులోనూ అంతరం 10 రెట్లు ఉంది. రాష్ట్రంలో ఆదాయాల అంతరం, సంపద

> **"శ్రీకాకుళం జిల్లాలో 9 జూట్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయిూస్, సింధటిక్, స్టీల్ పరిశ్రమలు ఒక్కొక్కటి చొప్పున మూత పడ్డాయి. విజయనగరం జిల్లాలో 8 జూట్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలు మూతపడ్డాయి. వెనుక బడిన ఈ రెండు జిల్లాల్లో సుమారు 20 వేల మందికి పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు."**

| పట్టిక 1 (బి) : తలసరి ఆదాయం అత్యధికంగా గల 10 మండలాలు | | | | |
|---|---|---|---|---|
| సంఖ్య | మండలం | పిసిఐ | జనాభా | కీలక రంగం |
| 1. | గాజువాక | 386311 | 250423 | పరిశ్రమ |
| 2. | అనంతపురం | 312815 | 66577 | పరిశ్రమ |
| 3. | నందివాడ | 308171 | 36924 | మత్స్య |
| 4. | లింగాల | 277342 | 29945 | వ్యవసాయం |
| 5. | తడ | 251458 | 61217 | పరిశ్రమ |
| 6. | మాచర్ల | 240721 | 113048 | పరిశ్రమ |
| 7. | కలిదిండి | 220222 | 70729 | మత్స్య |
| 8. | కాళ్ళ | 219690 | 57636 | మత్స్య |
| 9. | కుంభం | 217443 | 44953 | పరిశ్రమ |
| 10. | పరవాడ | 203071 | 78165 | పరిశ్రమ |

**(మండల స్థూల ఉత్పత్తి 2014 – 15)**

అంతరం ఎంత తీవ్రంగా ఉన్నాయో విదితమౌతుంది. తలసరి ఆదాయం అట్టడుగున ఉన్న 10 మండలాలు అనంత పురం, శ్రీకాకుళం, చిత్తూరు జిల్లాల్లోనూ, జివిఎ అతి తక్కువ గల 10 మండలాలు శ్రీకాకుళం, చిత్తూరు, కడప, అనంత పురం, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో ఉండడం గమనార్హం. రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలు వెనుకబడడమేగాక మిగిలిన జిల్లాల్లో కూడా విస్తారమైన వెనుకబడిన ప్రాంతాలున్నాయి. జివిఎ, పిసిఐ లలో తీవ్ర అంతరాలను ఆయా జిల్లాల వారీగా గమనించవచ్చు. ఉదాహరణకు గుంటూరు జిల్లా గుంటూరు మండలం జివిఎ రూ. 8,631 కోట్లు కాగా శావల్యాపురం జివిఎ రూ. 267 కోట్లు మాత్రమే.

<u>వస్తూత్పత్తి రంగం కీలకం</u>

ఈ గణాంకాల విశ్వసనీయత కూడా సందేహాస్పదంగా ఉంది. ఉదాహరణకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ప్రధానమైన జూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. శ్రీకాకుళం జిల్లాలో 9 జూట్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయిూస్, సింధటిక్, స్టీల్ పరిశ్రమలు ఒక్కొక్కటి చొప్పున మూత పడ్డాయి. విజయనగరం జిల్లాలో 8 జూట్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమలు మూతపడ్డాయి. వెనుక బడిన ఈ రెండు జిల్లాల్లో సుమారు 20 వేల మందికి పైగా కార్మికులు ఉపాధి కోల్పోయారు. కానీ ఆ రెండు జిల్లాల్లో వస్తూత్పత్తి రంగంలో వృద్ధిరేటు పెంచి చూపారు. శ్రీకాకుళం 6.01 (2014–15), 10.82 (2015–16) కాగా విజయనగరం జిల్లా 6.86 (2014–15) 10.82 (2015–16లో) పేర్కొన్నారు. ఆ జిల్లాల్లో ఈ రెండేళ్ళలో కొత్తగా వచ్చి, ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమలు చాలా స్వల్పం. అలాంటప్పుడు వస్తూత్పత్తి పెరిగిందెక్కడ?.

వృద్ధికి ఒక ముఖ్య సూచిక వస్తూత్పత్తి రంగం. ఆ రీత్యా పరిశీలిస్తే 2015–16లో కూడా 2011–12 నాటి పరిస్థితి రాష్ట్రంలో ఇప్పటికీ లేదు. వస్తూత్పత్తి రంగంలో (2011–12 ధరల స్థిర ప్రాతిపదికనా కాన్‌స్టాంట్ ప్రైసెస్) 2011–12లో ఉత్పత్తి విలువ రూ. 50,708 కోట్లు కాగా 2015–16లో అది రూ. 47,453 కోట్లు మాత్రమే. అంటే అప్పటి కంటే ఈ నాలుగేళ్ళలో రూ. 3,255 కోట్లు (6.42 శాతం) తగ్గిందన్నమాట. చంద్రబాబు నాయుడు రెండంకెల అభివృద్ధి అని ఎంత గట్టిగా

| పట్టిక – 2 : వస్తూత్పత్తి రంగంలో జివిఏ (2011-12 స్థిరమైన ధరలు – రూ.కోట్లలో) | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| సంఖ్య | జిల్లా పేరు | 2011-12 | 2012-13 | 2013-14 | 2014-15 | 2015-16 | +/- |
| 1. | శ్రీకాకుళం | 2210 | 1317 | 1313 | 1392 | 1542 | - 668 |
| 2. | విజయనగరం | 1223 | 1674 | 1771 | 1893 | 2098 | 875 |
| 3. | విశాఖపట్నం | 17301 | 12077 | 12565 | 13100 | 14517 | - 2784 |
| 4. | తూర్పుగోదావరి | 5776 | 4668 | 4678 | 4981 | 5520 | - 256 |
| 5. | పశ్చిమగోదావరి | 3384 | 2105 | 2026 | 2184 | 2387 | - 997 |
| 6. | కృష్ణా | 3075 | 3219 | 3162 | 3338 | 3699 | 624 |
| 7. | గుంటూరు | 4086 | 4001 | 4083 | 4308 | 4774 | 688 |
| 8. | ప్రకాశం | 2391 | 1324 | 1106 | 1174 | 1301 | - 1090 |
| 9. | నెల్లూరు | 1791 | 1706 | 1803 | 1930 | 2139 | 348 |
| 10. | చిత్తూరు | 3094 | 3886 | 3673 | 3900 | 4322 | 1228 |
| 11. | కడప | 2351 | 1655 | 1715 | 1822 | 2019 | - 332 |
| 12. | అనంతపురం | 3004 | 1614 | 1647 | 1744 | 1933 | - 1071 |
| 13. | కర్నూలు | 1022 | 956 | 1023 | 1085 | 1202 | 180 |
| | | **50708** | **40202** | **40565** | **42851** | **47453** | **- 3255** |

**(జిల్లాల ఆర్థిక పరిస్థితి – పనితీరు 2015 –16)**

చెప్పినప్పటికీ ఇంకా రాష్ట్రం 2011-12 నాటి పరిస్థితిలో కూడా లేదన్నది స్పష్టం. (పట్టికా 2 చూడండి) 2011-12తో పోల్చితే ఏడు జిల్లాలలో జివిఎ తగ్గింది. నవ్యాంధ్రప్రదేశ్‌కు పారిశ్రామిక, వాణిజ్య కేంద్రమైన విశాఖపట్నం జిల్లాలో ఈ తగ్గుదల మరీ దారుణంగా ఉంది. 2011-12లో రూ॥ 17,301 కోట్లున్న దల్లా 2015-16లో రూ॥ 14,577 కోట్లకు (రూ. 2,784 కోట్లు) తగ్గింది. ఇది 16శాతంగా ఉంది. అభివృద్ధికి ఎంత దూరంలో ఉన్నామో ఈ అంకెలు చెబుతున్నాయి.

> **❝ వ్యవసాయరంగంలో పనిచేస్తున్న వారిని వ్యవసాయేతర, సేవా రంగాలకు మళ్ళించడం తమ వ్యూహమని ముఖ్యమంత్రి తన ముందుమాటలో పేర్కొన్నారు. మెరుగైన ప్రత్యామ్నాయ ఉపాధిని చూపి, వ్యవసాయ రంగం నుండి అటువైపు మళ్ళించవచ్చు.❞**

**వ్యవసాయ రంగం అంటే చేపలు, రొయ్యలా..!**

వ్యవసాయం, అనుబంధ రంగాల విషయంలో ప్రభుత్వ దృష్టి ప్రధానంగా మత్స్య రంగంపైనే ఉంది. ముఖ్యంగా రొయ్యలు, చేపల చెరువుల ఆదాయం పెంచడంపై కేంద్రీకరిస్తోంది. ఫలితంగా పంటపొలాలు చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయి. వ్యవసాయ కార్మికులు, కౌలుదార్లు ఉపాధి కోల్పోతున్నారు. సంపద కొద్దిమందికే చేరడం, అతి తక్కువ మందికి మాత్రమే ఉపాధి లభించడం మత్స్యరంగం ప్రత్యేకత. అదే వ్యవసాయంపైనా, అలాగే పాడి పరిశ్రమ పైన శ్రద్ధ పెడితే ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుంది. అంతేగాక వెనుక బడిన మెట్ట ప్రాంతాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. రాష్ట్రంలో వ్యవసాయ రంగం జివిఎ మొదటి పది స్థానాల్లో గల మండలాల వివరాలు (పట్టిక - 3) గమనిస్తే పంటల పరిస్థితి కునారిల్లుతున్నదీ, మత్స్య రంగం ఎలా పెరుగుతున్నదీ బోధపడుతుంది.

వ్యవసాయరంగంలో పనిచేస్తున్న వారిని వ్యవసాయేతర, సేవా రంగాలకు మళ్ళించడం తమ వ్యూహమని ముఖ్యమంత్రి తన ముందుమాటలో పేర్కొన్నారు. మెరుగైన ప్రత్యామ్నాయ ఉపాధిని చూపి, వ్యవసాయ రంగం నుండి అటువైపు మళ్ళించవచ్చు. కాని 'వ్యవసాయంలో ఉండి బతకలేము' అనుకుని వేరే రంగాలకు వలస వెళ్లడం అభివృద్ధి కాజాలదు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విజన్ 2020లో కూడా ఇలాగే చెప్పి, ఆయన తొమ్మిదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన వైనం ఎవరూ కాదనలేని వాస్తవం.

వ్యవసాయ రుణాలకు బ్యాంకుల ప్రాధాన్యతా రంగ రుణాలలో 70 శాతం మంజూరు చేస్తున్నారని, అయితే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఆ రంగం వాటా 8 శాతం మాత్రమే ఉందని, ఈ అంశాన్ని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలని రెండంకెల వృద్ధిరేటు నివేదికలో ప్రభుత్వం (పేజి-66) వాపోయింది. రైతులకు, ముఖ్యంగా కౌలుదార్లకు బ్యాంకు రుణాలు అందక తీవ్రమైన ఇక్కట్లు పడుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వ నివేదిక వ్యవసాయ రంగానికి బ్యాంకు రుణాలు అందాల్సిన దామాషా కంటే ఎక్కువగా మంజూరు అవుతున్నాయని పేర్కొన డం ఘోరం. జూన్ 9న జరిగిన ఎస్ఎల్‌బిసి సమావేశంలో ఇచ్చిన వివరాల ప్రకారం 2015-16లో రాష్ట్రమం తటా 5,00,275 మంది కౌలుదారులకు రుణ అర్హతా కార్డులు మంజూరు చేయగా వారిలో కేవలం 99,627 మందికి మాత్రమే బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. రాష్ట్రంలో 20 లక్షల మంది కౌలుదార్లున్నారని అంచనా. అంటే బ్యాంకులు 5 శాతం మందికి మాత్రమే రుణాలిచ్చాయన్న మాట. మరి ఈ నివేదిక ఎందుకు గుండెలు బాదుకుంటోంది? వెనుకబాటుతనం నిర్ణయించడానికి 1968లో వాంఛూ కమిటీ మొదలు 2013లో రఘురాం రాజన్ కమిటీ వరకు జాతీయ స్థాయిలో ప్రత్యేక ప్రయత్నాలు జరిగాయి. ఆ కమిటీలన్నీ ఆయా సందర్భాల్లో వివిధ అంశాల్ని ప్రాతిపదికగా తీసుకున్నాయి. అయితే విద్య (అక్షరాస్యత, ప్రత్యేకంగా మహిళా అక్షరాస్యత), వైద్యం (మాతృ, శిశు మరణాల రేటు), ఇంట్లో సౌకర్యాలు (మరుగుదొడ్డి, త్రాగునీరు) దాదాపు అందరూ పరిగణలోనికి తీసుకోగా ఎక్కువ కమిటీలు జనాభాలో దళితులు, గిరిజనులు, మైనారిటీల శాతాన్ని కూడా ప్రాతిపదికగా తీసుకున్నాయి. కాబట్టి వెనుకబాటుతనం నిర్ణయించడంలో ఇలాంటి అనేక అంశాలను తప్పక ప్రాతిపదికగా చేసుకోవాలి. లేకపోతే పొరపాటు నిర్ధారణలు వస్తాయి. ఇంకొన్ని కమిటీలు సాగు విస్తీర్ణంలో నీటి పారుదల సౌకర్యంగల భూమి శాతం, మొత్తం శ్రామికుల్లో వ్యవసాయేతర శ్రామికుల శాతం వంటి వాటిని తీసుకున్నాయి. కాబట్టి తలసరి ఆదాయం లేదా జివిఏను మాత్రమే పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి, వెనుకబాటుతనం అంటే కుదరదు. సమగ్రమైన రీతిలో విశ్లేషించి వెనుకబాటుతనాన్ని నిర్ధారించాలి. ఆ ప్రక్రియకు ఈ గణాంక వివరాలు దోహదపడవచ్చు తప్ప అవే సర్వస్వం కాదు. ❋

**పట్టిక 3 : వ్యవసాయం, దాని అనుబంధ రంగాల జివిఏ (రూ.కోట్లలో)**

| సంఖ్య | మండలం | జిల్లా | వ్యవసాయ, అనుబంధ జివిఏ | పంటలు | పశు సంవర్ధన | మత్స్య |
|---|---|---|---|---|---|---|
| 1. | కలిదిండి | కృష్ణా | 1386.85 | 34.04 | 63.3 | 1289.52 |
| 2. | భీమవరం | ప.గోదావరి | 1225.17 | 130.07 | 92.98 | 1002.11 |
| 3. | కాళ్ళ | ప.గోదావరి | 1171.69 | 165.48 | 92.6 | 913.61 |
| 4. | నందివాడ | కృష్ణా | 1025.06 | 48.13 | 41.12 | 935.81 |
| 5. | కైకలూరు | కృష్ణా | 922.16 | 20.4 | 67.08 | 817.64 |
| 6. | మచిలీపట్నం | కృష్ణా | 793.47 | 135.16 | 159.78 | 498.53 |
| 7. | లింగాల | కడప | 757.74 | 733.49 | 19.59 | 0.02 |
| 8. | మొగల్తూరు | ప.గోదావరి | 713.95 | 100.23 | 118.46 | 495.26 |
| 9. | నిడమర్రు | ప.గోదావరి | 712.14 | 117.16 | 139.97 | 455.02 |
| 10. | పెదపాడు | ప.గోదావరి | 702.41 | 167.18 | 46.75 | 488.48 |

**(మండల స్థూల ఉత్పత్తి 2014 - 15)**

**లాటిన్ అమెరికాపరిణామాలు**

# వామపక్ష వెల్లువను వమ్ముచేసే కుట్రలు



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ సభ్యులు

**ఎస్ వెంకట్రావు**

సామ్రాజ్యవాద దోపిడీ నుండి బయట పడడానికి గత కొన్ని దశాబ్దాలుగా లాటిన్ అమెరికా ప్రజలు చేస్తున్న పోరాటాలు, సాధిస్తున్న విజయాలను వెనక్కు తిప్పి కొట్టేందుకు అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. "పింక్ వెల్లువ"గా పిలవ బడుతున్న వామపక్ష వెల్లువను నిలువరిం చడమే కాకుండా దేశం తరువాత దేశంలో వామపక్షాల స్థానంలో పచ్చి మితవాద, అమె రికా అనుకూల ప్రభుత్వాలను నెలకొల్పడానికి అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న ప్రయత్నాలు, ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రజల ప్రతిఘ టన ఈ ఖండాన్ని మరోమారు కల్లోలంలోకి నెడుతున్నాయి. అర్జెంటీనా, వెనిజులా, బ్రెజిల్, బొలీవియా తదితర దేశాల్లో ప్రస్తుతం జరుగు తున్న పరిణామాలను పరిశీలిస్తే సామ్రాజ్యవాద దోపిడీ సంకెళ్లనుండి బయటపడడానికి లాటిన్ అమెరికా దేశాలు చేస్తున్న ప్రయత్నాలకు పెద్ద సవాళ్లు ఎదురవుతున్నాయన్న విషయం బోధపడుతుంది.

**అర్జెంటీనాలో**

అర్జెంటీనాలో సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్ర్యం, రాజకీయ స్వావలంబన విధానాల ఆధారాంగా పనిచేస్తూ వచ్చిన పెరోనిస్టు పాలక పార్టీ "ఫ్రంట్ ఫర్ విక్టరీ" అభ్యర్థి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ఓడిపోయి పచ్చి మితవాద, అమెరికా అనుకూల పార్టీ అభ్యర్థి అధికారంలోకి వచ్చాడు. దేశంలో నయా-ఉదారవాద విధానా లకు వ్యతిరేకంగా జరిగిన విస్తృత ప్రజా పోరా టాల మూలంగా 2003లో పెరోనిస్టులు అధికా రంలోకి వచ్చిన తరువాత వాళ్లు ఓడిపోవడం ఇదే ప్రథమం. 2003లో లాటిన్ అమెరికా దేశాల్లో వామపక్ష వెల్లువలో అధికారంలోకి వచ్చిన పెరోనిస్టు అధ్యక్షుడు నెస్టర్ కిర్చ్నెర్ దేశంలో అమెరికా ఒత్తిళ్లకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. ఆయన రెండు దఫాలు అధ్యక్ష బాధ్యతలను నిర్వహించాక అదే పార్టీకి చెందిన క్రిస్టినా ఫెర్నెండెజ్ మరో రెండు దఫాలు ఆ బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది ఎన్నికల్లో అధికార పార్టీ తరపున పోటీ చేసిన డేనియల్ సియోలి అక్టోబర్ 25న జరిగిన ఎన్నికల్లో తన ప్రత్యర్థి మితవాద మారిసియో మాక్రి పై ఆధి క్యత కనబరిచినా సగానికిపైగా ఓట్లు సంపాదిం చలేకపోయాడు. దాంతో నవంబరు 22నరెండో రౌండు పోలింగ్‌లో సియోలి ఓడిపోయాడు. ప్రత్యర్థి మాక్రి 51.34 శాతం ఓట్లతో గెలుపొం దాడు. వెనువెంటనే ఆయన దేశంలో స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణలు ప్రవేశపెడతానని, ఐఎం ఎఫ్ వంటి సంస్థలతో సంబంధాలు ఏర్పాటు చేసుకుంటానని ప్రకటించాడు. లాటిన్ అమెరికా లో వామపక్ష విధానాలు అనుసరిస్తున్న వెని జులా, బొలీవియా, ఈక్వెడార్ వంటి దేశాలతో సంబంధాలు తెగతెంపులు చేసుకుని అమెరికాకు దగ్గరవుతానని ప్రకటించాడు.

**వెనిజులాలో**

21వ శతాబ్దపు సోషలిజం పేరుతో వెనిజులాలో నయా-ఉదారవాద వ్యతిరేక విధానాలు అవలంభించిన హ్యూగో ఛావెజ్ మరణించిన తరువాత ఆ దేశంలో జరిగిన తొలి పార్లమెంటు ఎన్నికల్లో పాలక యునైటెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులా ఓడిపోయి ప్రతిపక్ష కూటమి గెలుపొందింది. గత ఏడాది డిసెంబర్‌లో ఈ ఎన్నికలు జరిగాయి. దేశంలో కొత్త రాజ్యాంగం వచ్చిన 1999 తరువాత జరిగిన నాల్గవ పార్లమెంటు ఎన్నికలివి. ఛావెజ్ మరణానంతరం ఆయన వారసునిగా అధ్యక్ష పదవి చేపట్టిన మదురో నాయకత్వంలోని యునై టెడ్ సోషలిస్టు పార్టీ ఆఫ్ వెనిజులాకు వ్యతిరేకంగా పోటీచేసిన మితవాద కూటమి డెమోక్రటిక్ యూనిటీ రౌండ్‌టేబుల్ (ఎంయుడి) పార్లమెంటులోని 164 స్థానాలకు గాను 112 స్థానాలు గెలుచుకుని పూర్తి మెజారిటీ సాధించింది. పాలక కూటమికి 55 స్థానాలు లభించాయి. ఓట్ల రీత్యా చూస్తే పాలక పక్షానికి 40.9 శాతం ఓట్లు వస్తే, ప్రతిపక్ష కూటమి 56.2 శాతం ఓట్లు సంపాదించింది. గెలు పొందిన కూటమిలో కొన్ని వామపక్ష పార్టీలు కూడా భాగస్వాములుగా ఉన్నాయి. ఛావెజ్ నాయకత్వంలోని వెనిజులా ప్రభుత్వాన్ని కూల దోయడానికి అమెరికా అనేక సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉంది. ప్రతిపక్ష కూటమిలోని అనేక పార్టీలు అమెరికా అండదండలతో నడుస్తున్నవే.

**బ్రెజిల్‌లో**

బ్రెజిల్‌లో వర్కర్స్ పార్టీని స్థాపించి రెండు దఫాలు దేశాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించిన లూలా డ సిల్వా వారసురాలిగా అధికారం చేపట్టిన దిల్మా రౌసెఫ్‌పై మితవాదుల నాయకత్వంలోని పార్లమెంటు అభిసంశన తీర్మానం ప్రవేశపెట్టడం లాటిన్ అమెరికా ఖం డంలో జరుగుతున్న ప్రమాదకర పరిణామాలకు మచ్చుతునక. లూలా తరువాత 2010 అధ్యక్ష ఎన్నికల్లో దిల్మా 56 శాతం ఓట్లతో విజయం సాధించారు. నాలుగేళ్ల తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ ఆమె 52 శాతం ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. లూలా బాటలోనే ఆమె సామాజిక న్యాయం, ప్రయివేటీకరణ వ్యతిరేక విధానాలు అవలంభించారు. అంతర్జా తీయ రంగంలో చైనా, రష్యాలతో కలిసి బ్రిక్స్‌లో భాగస్వామి అయ్యారు. ఇవన్నీ అమెరికాకు గిట్టని చర్యలే. అందుకే అమెరికా అనుకూల బ్రెజిల్ మితవాద ప్రతిపక్ష కూటమి ఆమె విజయాన్ని అంగీకరించబోమని ప్రకటించింది. ఆమెను పదవినుండి కూల్చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తూ వచ్చింది. దానికోసం దిల్మాపై అవినీతి ఆరోపణలు చేస్తూ వచ్చింది. అటువంటివేవీ దొరకక్కపోవడంతో ఒక సాంకేతిక అంశాన్ని తీసుకుని దిల్మాపై అభిసంశన పెట్టింది. అందుకే తనపై వచ్చిన అభిసంశన తీర్మానాన్ని దిల్మా మితవాద 'కుట్ర'గా పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎకౌంట్స్‌కూ ప్రభుత్వ ద్రవ్య వ్యయానికీ పొంతన లేదన్న కారణంతో ఆమెపై ఆరోపణలు చేస్తూ అభిసంశన పెట్టారు. ఇది ఒక రకంగా మన దేశంలో కాగ్ నివేదికలో ప్రభుత్వాలను మొట్టికాయలు పెట్టే చందం అన్నమాట. 2018 ఎన్నికల్లో మళ్లీ లూలా

అధ్యక్షునిగా పోటీ చేయడానికి అర్హుడవుతాడు. ఆయన పట్ల ప్రజల్లో మంచి అభిప్రాయం ఉంది. బోల్సా ఫెమీలియా వంటి నగదు బదిలీ పథకాలు ప్రవేశపెట్టడం ద్వారా ఆయన పేదల సంక్షేమం, విద్య వంటి అనుకూల చర్యలు అమలు చేశాడు. అందువల్ల ఆయన తిరిగి రాకుండా చేయాలంటే దిల్మా ప్రభుత్వాన్ని అస్థిర పరచడం అవసరం అని మితవాద ప్రతిపక్షం కుట్రలకు దిగింది. దీనికి అమెరికా ఆర్థిక ప్రోద్బలంతో పాటు కార్పొరేట్ మీడియా ప్రోత్సాహం మెండుగా ఉంది.

**బొలీవియాలో**

ఈ ఏడాది మార్చిలో బొలీవియాలో జరిగిన రిఫరెండమ్‌లో దేశాధ్యక్షుడు ఇవో మోరెల్స్‌కు వ్యతిరేకంగా ఫలితం వచ్చింది. ఒకే వ్యక్తి నాలుగు సార్లు వరుసగా అధ్యక్షునిగా ఎన్నిక కావచ్చా లేదా అన్న అంశంపై ప్రజాభిప్రాయ సేకరణలో మోరెల్స్ కోరినట్లు ప్రజలు నాలుగో సారి ఆయన దేశాధ్యక్షునిగా పోటీ చేయడానికి అంగీకరించలేదు. రిఫరెండమ్‌లో మోరెల్స్ విజయం సాధించి ఉంటే ఆయన 2019లో మరోసారి పోటీ చేయడానికి అర్హత సాధించే వాడు. కొద్దిపాటి ఓట్ల తేడాతో రిఫరెండం ఓడిపోయినా మోరెల్స్‌కు ఇది ఎదురుదెబ్బే. లాటిన్ అమెరికాలో ఛావెజ్, ఈక్వెడార్ అధ్యక్షుడు రాఫెల్ కొర్రియా తరువాత 21వ శతాబ్దపు సోషలిజానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన దేశాధ్యక్షుల్లో మోరెల్స్ ఒకడు. ఆయనపై మితవాద ప్రతిపక్షాలు తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేయడం, కార్పొరేట్ మీడియా దానికి విపరీత ప్రచారం కల్పించడం ఓటమికి కారణ మని పరిశీలకులు భావిస్తున్నారు.

అయితే ఈ ఖండంలో పరిణామాలు మొత్తంగా నిరాశాజనకంగా లేవు. మెక్సికో, కొలంబియా ఇతర దేశాల్లో ప్రజా ఉద్యమాలు గతంలో కన్నా మరింత తీవ్రమవుతున్నాయి. కొలంబియాలో వామపక్ష తిరుగుబాటు దారులకూ, ప్రభుత్వానికీ మధ్య కుదిరిన ఒప్పందం ఆ దేశ ప్రజల విజయమని క్యూబా అధ్యక్షుడు రావుల్ కాస్ట్రో పేర్కొన్నారు. వెనిజులా పార్లమెంటు ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమి గెలుపొందినా కొద్ది కాలంలోనే దానిలో లుకలుకలు ప్రారంభమైనాయి. బ్రెజిల్‌లో మితవాదుల కుట్రలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లమీదకు వచ్చి ప్రదర్శనలు చేస్తున్నారు.

**లాటిన్ అమెరికాలో కుట్రలు ఈనాటివి కావు**

లాటిన్ అమెరికాను తన పెరటి దొడ్డిగా భావిస్తూ వచ్చిన అమెరికా ఆ ఖండంలోని ఏ దేశమైన సార్వభౌమత్వాన్ని ప్రకటించుకుంటే సహించేది కాదు. 200 సంవత్సరాల క్రితం అమెరికా అధ్యక్షుడు మన్రోయ్ ప్రభుత్వం ఆమోదించిన సిద్ధాంతం ప్రకారం లాటిన్ అమెరికాలో ఏ ఇతర దేశాలు జోక్యం చేసుకున్నా అమెరికాకు వాటిపై దాడికి దిగే 'హక్కు' ఉంది. తరువాత రెండు శతాబ్దాల కాలంలో అమెరికా అధ్యక్షులు ఈ మన్రోయ్ సిద్ధాంతాన్ని అనేక సందర్భాల్లో, అనేక విధాలా అమలు చేస్తూ వచ్చారు. తమ ప్రయోజనాల కోసం లాటిన్ అమెరికా దేశాల్లో అనేక మంది నియంతలను అమెరికా పెంచి పోషిస్తూ వచ్చింది. ప్రజాతంత్ర, అభివృద్ధి కాముక ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకుంటే కుట్రలతోనూ, సైనిక తిరుగుబాట్లతోనూ, చివరికి సైనిక జోక్యంతోనూ వాటిని తొలగించి నియంతలను నిలబెడుతూ వచ్చింది. 1960 అక్టోబర్ 6న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ ఈ విషయాన్ని ఇలా అంగీకరించాడు:"మేము (అమెరికా) క్యూబాలో నియంతకు మద్దతివ్వడమే కాకుండా, వెనిజులా, అర్జెంటీనా, కొలంబియా, పరగువే, డొమినికన్ రిపబ్లిక్‌లలో నియంతలను గద్దెనెక్కించాం. క్యూబాలో (విప్లవానికి ముందు) పేదరికం, దారిద్ర్యాలను మేము నిర్లక్ష్యం చేయడమే కాకుండా గత ఎనిమిదేళ్లుగా మొత్తం ఖండంలో పేదరికం, దారిద్ర్యాలను నిర్మూలించడంలో విఫలమైనాము."

**"లాటిన్ అమెరికాలో ఛావెజ్, ఈక్వెడార్ అధ్యక్షుడు రాఫెల్ కొర్రియా తరువాత 21వ శతాబ్దపు సోషలిజానికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించిన దేశాధ్యక్షుల్లో మోరెల్స్ ఒకడు. ఆయనపై మితవాద ప్రతిపక్షాలు తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేయడం, కార్పొరేట్ మీడియా దానికి విపరీత ప్రచారం కల్పించడం ఓటమికి కారణ మని పరిశీలకులు భావిస్తున్నారు."**



దిల్మా రౌసెఫ్

బ్రెజిల్‌లో 1964 మార్చిలో ఏర్పడిన వామపక్ష అధ్యక్షుడు జోవో గులార్ట్ ప్రభుత్వాన్ని అమెరికా ఒక సైనిక కుట్రతో తొలగించింది. మరుసటి ఏడాది డొమినికన్ రిపబ్లిక్‌లో వామపక్షాలు అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు అమెరికా 24,000 మంది సైనికులను ఆ దేశానికి పంపింది. అమెరికా గూఢచారి సంస్థ (సిఐఎ) ఆధ్వర్యంలో పనిచేసే 'అమెరికా సహాయం' (యుఎస్ఎయిడ్) కార్యక్రమం క్రింద మొత్తం లాటిన్ అమెరికా దేశాల సైన్యానికీ, భద్రతా దళాలకూ ప్రజలను హింసించే పద్ధతులపై అమెరికా శిక్షణ ఇచ్చేది. లాటిన్ అమెరికా దేశాల్లో ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచి వేయడంలోనూ, సైనిక కుట్రలకు పాల్పడి ప్రజాతంత్ర ప్రభుత్వాలను కూల్చేయడంలోనూ ఈ సంస్థ చురుగ్గా పాల్గొనేది. 1973లో చిలీలో ఎన్నికల ద్వారా అధ్యక్ష పదవి చేపట్టిన కమ్యూనిస్టు నాయకుడు సాల్వడార్ అలెండీపై సైనిక తిరుగుబాటు జరిపి ఆయనను హత్య చేసిన ఘటనలో అమెరికన్ సిఐఎ హస్తం బహిరంగంగా వెల్లడయింది. 1976 వచ్చే సరికి మొత్తం దక్షిణ అమెరికా ఖండ దేశాలు అమెరికా నెలకొల్పిన సైనిక నియంతల చేతుల్లోకి వెళ్లి పోయాయి. మాదక ద్రవ్యాలపై పోరాటం పేరు చెప్పి అనేక దేశాల్లో అమెరికా జోక్యం చేసుకుంది. 1989లో పనామాకు ఈ పేరుతోనే సైన్యాన్ని పంపి మాన్యుయెల్ నోరిగా ప్రభుత్వాన్ని కూలదోసింది. విచిత్రమేమంటే నోరిగా అంతకు ముందు అమెరికా గూఢచారి శాఖ తరపున చాలా కాలం పనిచేశాడు. కొలంబియా, మెక్సికో తదితర దేశాల్లో మాదక ద్రవ్యాలపై యుద్ధం పేరుతో అమెరికా జోక్యం చేసుకుని నియంతలను గద్దెపై నిలిపింది. అమెరికా, కెనడా, మెక్సికోల మధ్య కుదిరిన ఫ్రీ ట్రేడ్ ఏరియా ఆఫ్ అమెరికాస్ (ఎఎల్‌సిఎ), మొత్తం లాటిన్ అమెరికా దేశాలను కలుపుతూ ఉత్తర అమెరికా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్

“లాటిన్ అమెరికాలో అమెరికన్ సామ్రాజ్య వాదుల విధానాలకు ఎదురుతిరిగి నిలిచింది ఒక్క క్యూబా మాత్రమే. నిజానికి 1959లో క్యూబా విప్లవాన్ని నిలువరించడంలో అమెరికా ఓడిపోయింది. తరువాత దాన్ని సైనిక దాడుల తోనూ, అష్టదిగ్బంధనంతోనూ లొంగదీసుకో డానికి చేసిన ప్రయత్నాలు కూడా ఓడిపోయాయి.”

(ఎన్ఎఎఫ్టిఎ –నాఫ్తా) ఒప్పందాలను కుదుర్చుకుంది. ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆధ్వర్యంలో భారత్‌కన్నా దశాబ్దం ముందుగానే లాటిన్ అమెరికాలో ప్రపంచీకరణ విధానాలు అమలు చేయబడ్డాయి. ఈ విధానాల మూలంగా లాటిన్ అమెరికాలోని సహజ వనరులు ముఖ్యంగా చమురు, గ్యాస్, ఖనిజాలు, వ్యవసాయం అమెరికా కార్పొరేట్ కంపెనీల పెత్తనం కిందకు పోయాయి.

లాటిన్ అమెరికాలో అమెరికన్ సామ్రాజ్య వాదుల విధానాలకు ఎదురుతిరిగి నిలిచింది ఒక్క క్యూబా మాత్రమే. నిజానికి 1959లో క్యూబా విప్లవాన్ని నిలువరించడంలో అమెరికా ఓడిపోయింది. తరువాత దాన్ని సైనిక దాడుల తోనూ, అష్టదిగ్బంధనంతోనూ లొంగదీసుకోడానికి చేసిన ప్రయత్నాలు కూడా ఓడిపోయాయి. అమెరికాకు (మియామీకి) 90 మైళ్ల దూరంలో ఉన్న సోషలిస్టు క్యూబా అమెరికా ఏర్పాటు చేసిన స్వేఛ్ఛా వాణిజ్య కూటముల్లో చేరకుండా అలీనోద్యమంలో భాగస్వామి అయింది.



ఇవో మొరెల్స్

### వామపక్ష వెల్లువ

1989–91 సోషలిస్టు కూటమిపతనం, సోవియట్ విచ్ఛిన్నం తరువాత ప్రపంచమంతటా సామ్రాజ్యవాదానికి ఎదురులేదనుకుంటున్న తరుణంలో లాటిన్ అమెరికా సామ్రాజ్యవాదానికీ, అది ప్రతిపాదించిన నయా–ఉదారవాద విధానాలకూ ఎదురుతిరిగి ప్రపంచానికి వెలుగుమార్గం చూపించింది. వెనిజులాలో హ్యూగో ఛావెజ్ (1998), బ్రెజిల్‌లో లూలా డ సిల్వా (2002), అర్జెంటీనాలో నెస్టర్ కిర్చెనర్ (2003), ఉరుగ్వేలో తబరే వాజ్‌క్వెజ్ (2004), బొలీవియాలో ఇవో మొరెల్స్ (2005), చిలీలో మిచెల్లె బాచెలెట్ (2006), నికరాగువాలో డేనియల్ ఓర్టెగా (2006), ఈక్వెడార్‌లో రాఫెల్ కొర్రియా (2007), పరాగువేలో ఫెర్నాండో ల్యూగో (2008), పెరూలో ఒల్లాంటా హుమాలా (2011), కోస్టారికాలో లూయిస్ గుల్లెర్మో సోలిస్ (2014)లు అధికారంలోకి వచ్చి లాటిన్ అమెరికా ఖండాన్ని వామపక్షం వైపు తిప్పారు. అందుకే ఈ పరిణామాన్ని పింక్ టైడ్ అంటున్నారు. అంటే కమ్యూనిజంలా పూర్తి ఎరుపు కాకుండా వామపక్ష విధానాలవైపు మొగ్గడం వల్ల దీన్ని పింక్ రంగు వెల్లువ అంటున్నారు. అయితే ఈ ప్రభుత్వాలన్నీ వామపక్ష విధానాలు అనుసరిస్తున్నాయనుకోడానికి లేదు. వీటిలో కొన్ని ప్రభుత్వాలకు అమెరికాతో దగ్గరి సంబంధాలున్నాయి, నయా – ఉదారవాద విధానాలను కొంతమేరకు అనుసరించేవి కూడా ఉన్నాయి. వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్ ప్రభుత్వాలు మాత్రం స్పష్టంగా తమవి 21వ శతాబ్దపు సోషలిస్టు విధానాలని ప్రకటించాయి. ఆచరణలో కూడా అవి చమురు గ్యాస్ సంపదనూ, పరిశ్రమలనూ జాతీయం చేశాయి. భూ సంస్కరణలు అమలు జరిపాయి. విద్య, వైద్య విధానాల్లో ప్రజానుకూల మార్పులు చేశాయి. అటువంటి విధానాలే అన్ని దేశాలూ అమలు జరపలేదు. ఉదాహరణకు బ్రెజిల్ లూలా హయాంలోనూ, దిల్మా హయాంలోనూ సామాజిక న్యాయానికి పెద్ద పీటవేస్తూనే మరోవైపు నయా–ఉదారవాద విధానాలతో తెగతెంపులు చేసుకోలేకపోయింది. ఈ దేశాల్లో బూర్జువా వర్గం బలంగా ఉంది. వాటివాటి ప్రయోజనాలను బట్టి అవి వ్యవహరించాయి. అయితే వీటన్నిటికీ ఉన్న ఒకే ఉమ్మడి లక్షణం ఏమంటే అవి తమ దేశాలపై అమెరికా పెత్తనాన్ని వ్యతిరేకించాయి. ఎఎల్‌సిఎ, నాఫ్తాలను తిరస్కరించి అమెరికా లేకుండా లాటిన్ అమెరికా దేశాల కూటమి ఏఎల్‌బిఏ (అల్బా)ను స్థాపించుకున్నాయి. ఈ కూటమిలోకి క్యూబాను ఆహ్వానించాయి. స్వంత లాటిన్ అమెరికా మార్కెట్ (మార్కోసుర్), స్వంత బ్యాంకు (బ్యాంకోసుర్) ఏర్పాటు చేసుకున్నాయి. ఆ విధంగా అమెరికా నాయకత్వంలోని ఏక ధృవ ప్రపంచానికి మొట్టమొదటి గండి లాటిన్ అమెరికాలో పడింది. ఛావెజ్, మొరెల్స్, కొర్రియాలు అమెరికా రాజకీయ, పర్యావరణ, జోక్యం దారీ విధానాలను అంతర్జాతీయ వేదికలపై తీవ్రంగా వ్యతిరేకించారు.

### ఆర్థిక సంక్షోభంతో సమస్యలు

అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు, గ్యాస్ ఇతర ప్రాథమిక సరుకుల ధరలు పతనం కావడంతో లాటిన్ అమెరికా ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలో పడ్డాయి. బ్రెజిల్ 1930లలో ఏర్పడిన మహా మాంద్యం తరువాత అత్యంత తీవ్రమైన ఆర్థిక పతనాన్ని ఎదుర్కొంటున్నది. ఎగుమతులు తగ్గిపోవడం, ఉత్పత్తి పడిపోవడం, పరిశ్రమలు లేఆఫ్‌లు ప్రకటిస్తుండడంతో ప్రతి నెలా లక్షమంది కార్మికులు ఉపాధిపోయి బజారున పడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పడిపోవడంతో చమురు ఎగుమతిపై ఆధారపడ్డ వెనిజులా ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 8 శాతం పడిపోయింది. ద్రవ్యోల్బణం 100 శాతం పెరిగిపోతున్నది. దేశంలో ఆహారం, వస్తువుల కొరత ఏర్పడ్డంతో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొన్నది. మొత్తం లాటిన్ అమెరికా దేశాల్లో చూస్తే 2015లో ఆర్థిక వ్యవస్థ 0.3 శాతం కుంచించుకుపోయింది. ఈ ప్రాంతం ఎగుమతి చేసే చమురు, బొగ్గు, ఖనిజాల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పడిపోవడం ఒక కారణమైతే, అంతర్గత డిమాండ్ పడిపోవడం మరో కారణం.

ఆర్థిక సమస్యలు ఈ దేశాల్లో రాజకీయ సమస్యలు కూడా తెచ్చిపెడుతున్నది. అనేక దేశాల్లో ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని అమెరికా నేర్పుగా ఉపయోగించుకుని అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వాలను కూలదోయడానికి ప్రయత్నాలు చేస్తున్నది. బ్రెజిల్, వెనిజులాల్లో ప్రతిపక్షాలను ప్రేరేపించి ప్రభుత్వాల మార్పిడి కోసం ప్రయత్నిస్తున్నది. ఇతర దేశాల్లో ప్రభుత్వాలపై తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నది. అమెరికా తన పెరటిదొడ్డిగా సుదీర్ఘకాలం పరిగణించిన లాటిన్ అమెరికాపై గత పదిహేనేళ్లుగా దాని

(మిగతా 28వ పేజీలో)

# అమెరికా స్క్రీన్‌ప్లే మోడీ యాక్షన్

ఎ కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక ఇన్‌చార్జి

దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో ఈ నెల 23, 24 తేదీలలో జరిగిన అణు సరఫరాదారుల గ్రూపు ( న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూపు) ప్లీనరీ సమావేశం భారతదేశాన్ని సభ్యురాలుగా చేర్చుకోవాలనే ప్రతిపాదనను తిరస్కరించింది. ప్రభుత్వం, దేశం, రాష్ట్రంలోని పత్రికలలో ప్రధాన భాగం, ఎలక్ట్రానిక్ మీడియా భారతదేశానికి అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యత్వం రాకపోవటానికి చైనాయే కారణమని నిందించటానికి, చైనా వ్యతిరేకతను రెచ్చగొట్ట టానికి పూనుకున్నాయి. ప్రస్తుతం భారతదేశానికి అణు సరఫరాదారుల గ్రూపు సభ్యత్వం అంత ప్రధానమైనది కాదని అణురంగంలో నిపుణులైన వారు చెబుతున్నారు. బిజెపి నాయకుడు యశ్వం త్‌సిన్హా యన్‌యస్‌జి సభ్యత్వం కోసం ప్రభుత్వం ప్రయత్నం చేయటం అనవసరమని చెప్పాడు. భారతదేశం అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యత్వం పొందటటానికి చైనా అడ్డుపడిందని జరుగుతున్న ప్రచారం వెనుక సామ్రాజ్యవా దుల, దేశంలోని కార్పొరేట్ రంగం, సరళీకరణ వాదుల ప్రయోజనాలు ఉన్నాయి. ఈ శక్తులు దీర్ఘకాలిక లక్ష్యంతోనే ఈ ప్రచారాన్ని కొనసాగి స్తున్నాయి.

అణు సరఫరాదారుల గ్రూపులో మనదేశం సభ్యత్వం పొందటాన్ని అమెరికా, ఇతర దేశాలు బలపరుస్తున్నాయని, చైనా ఒక్కటే మన సభ్యత్వా న్ని వ్యతిరేకిస్తున్నదని, చైనాను కూడా అంగీకరింప చేయటానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. అణు సరఫరా దారుల గ్రూపు సమావేశాలు సియోల్‌లో జరుగు తుండగానే తాష్కెంట్‌లో ప్రధాని నరేంద్ర మోడి చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌ను కలిసి భారత్ సభ్యత్వానికి మద్దతివ్వమని కోరాడు. ప్రధాని నరేంద్రమోడి అమెరికా పర్యటన సందర్భంగా భారత్ సభ్యత్వానికి మద్దత్తు సమీకరించటం కోసం షెడ్యూల్‌లో లేకపోయినా మెక్సికో, స్విట్జర్లాండ్ దేశాలలో పర్యటించాడు. 48 దేశాలు సభ్యులుగా ఉన్న అణు సరఫరాదారుల గ్రూపు ఇతర దేశాలకు సభ్యత్వం ఇవ్వాలంటే ఏకగ్రీవంగా నిర్ణయం జరగాలి. ఏ ఒక్కదేశం వ్యతిరేకించినా సభ్యత్వ ప్రతిపాదన వీగి పోతుం ది. అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యులుగా ఉన్న 48 దేశాలలో 38 దేశాలు మాత్రమే భారత్‌కు సభ్యత్వం ఇవ్వాలనే ప్రతిపాద నను బలపరిచాయి. అందువలన మనదేశ సభ్యత్వ ప్రతిపాదనను చైనా ఒక్కటే వ్యతిరేకిం చిందనే ప్రచారంలో వాస్తవం లేదు. అణు సరఫరా దారుల గ్రూపు సభ్యత్వానికి తనను బలపర చాలని మనదేశం చైనాను కోరిన సందర్భంలో సభ్యత్వం విషయంలో అణు సరఫరాదారుల గ్రూపు నిబంధనల ప్రకారం వ్యవహరిస్తానని చైనా చెప్పింది. అణు సరఫరాదారుల గ్రూపు నిబంధనల ప్రకారం ఆ గ్రూపులో సభ్యత్వం కావాలంటే సభ్యత్వం కోరుతున్న దేశం అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం (యన్‌పిటి)పై సంతకంచేసి ఉండాలి. భారతదేశం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయలేదు. కాబట్టి భారతదేశ సభ్యత్వాన్ని వ్యతిరేకించానని చైనా చెబుతున్నది.

మనదేశం అమెరికాతో అణు సహకార ఒప్పందం చేసుకున్న తర్వాత 2008లో మనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ఆ మినహాయిం పుల ఆధారంగానే అణురియాక్టర్లు, ఇంధన సరఫరా కోసం మనదేశం రష్యా, ఫ్రాన్స్ తదితర దేశాలతో ఒప్పందాలు చేసుకున్నది. ఓవైపున ఇవన్నీ జరిగిపోతుండగా ఇపుడు అణు సరఫరా దారుల గ్రూపులో సభ్యత్వం పొందటం వలన భారతదేశానికి అదనంగా ఒరిగిపడేదేమీలేదు. నిపుణుల అభిప్రాయంగా ఉన్నది. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేసిన దేశాలు అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యులుగా ఉండి అణు సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలు, ముడి పదార్థాల వ్యాపారాన్ని నియంత్రిస్తాయి. అణు సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతికి అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం అణ్వాయుధ రహిత దేశాలకు జాబితాలో ఉన్న పరికరాలను అందిం చాలంటే పరికరాలను దిగుమతి చేసుకునే దేశం అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఎఇఎ) తనిఖీలకు ( సేఫ్‌గార్డ్స్) అంగీకరించాలి. అనేక సందర్భాలలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించింది. ఇరాక్‌పై అమెరికా దాడికి ముందు ఆ దేశంలో పర్యటించిన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అక్కడ అణ్వాయుధాలు తయారు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఇచ్చిన తప్పుడు నివేదిక ఆధారంగానే అమెరికా ఇరాక్‌పై దాడిచేసింది. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేసిన దేశాల మధ్య కూడా వివక్ష ఉన్నది. ఆ దేశాలను అణ్వాయుధా లున్న దేశాలు, అణ్వాయుధాలు లేని దేశాలని రెండు తరగతులుగా విభజించారు. అణ్వా యుధాలున్న ఐదు ప్రధాన దేశాలలో అణు ఇంధన వినియోగంపై అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఎటువంటి తనిఖీలను నిర్వహించదు. మిగతా దేశాలలో అణు ఇంధన వినియోగంపై తనిఖీలను నిర్వహిస్తుంది. భారతదేశం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేస్తే అణ్వాయుధాలులేని రెండవ తరగతి దేశంగా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలకు అంగీక రించాలి. అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందం సందర్భంగా ప్రభుత్వం మన అణు రియాక్టర్లను పౌర, సైనిక అవసరాలకు వినియోగించే వాటిగా విభజించి, పౌర అణురియాక్టర్లలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ తనిఖీలు చేయటా నికి అంగీకరించింది. మనం రియాక్టర్లు, ఇంధ నం దిగుమతి చేసుకునే వారమే మినహా ఎగుమతి చేసేవారం కాదు. కాబట్టి అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యత్వం లేకపోయినా మనకు పెద్దనష్టం జరిగే అవకాశం లేదు.

అమెరికా అధ్యక్షుడు ఒబామా 2010 సంవత్సరంలో భారతదేశ పర్యటనకు

**"అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందంలో మనం స్వయంగా అణు రియాక్టర్లను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవటం, అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటంపై అనేక ఆంక్షలను విధించింది."**

వచ్చినపుడు అణు సరఫరాదారుల గ్రూపులో మనదేశం సభ్యురాలుగా చేరటానికి మద్దత్తు తెలిపాడు. అదే సంవత్సరం ఫ్రాన్స్ కూడా మనదేశానికి మద్దత్తు తెలిపింది. ఆ తర్వాత భారతదేశాన్ని దృష్టిలో పెట్టుకొని అణు సరఫరా దారుల గ్రూపు నిబంధనావళిలోని పేరాగ్రాఫ్ 6కు 2010-13 మధ్య చేసిన సవరణ అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయని దేశాలతో అణు ఇంధనశుద్ధి, పునర్వి నియోగాలలో (ఎన్‌రిచ్‌మెంట్, రీప్రాసెసింగ్) వాణిజ్యాన్ని నిషేధించింది. అణు సరఫరాదా రుల గ్రూపు నిబంధనావళికి ఈ సవరణను ఎవరు ప్రతిపాదించారు? అమెరికా మద్దత్తు లేకుండా ఇటువంటి సవరణను ప్రవేశపెట్టటం, ఆమోదించటం జరిగే పనేనా? అమెరికా బహిరంగంగా భారతదేశం అణు సరఫరాదా రుల గ్రూపులో సభ్యురాలు కావటానికి మద్దత్తు తెలుపుతూనే అంతర్గతంగా అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందంపై సంతకం చేయకుండా సభ్యత్వం పొందటానికి వీలులేని విధంగా నిబంధనావళికి సవరణలు చేయించింది. దీనినంతటిని కప్పిపెట్టి భారతదేశానికి అణు సరఫరాదారుల గ్రూపులో సభ్యత్వం రాక పోవటానికి చైనాను కారణంగా చూయిస్తున్నది. వాస్తవంగా భారతదేశం అణు, మిసిలీ, సైనిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోకుండా అమెరికాయే నిరంతరం అడ్డుపడుతున్నది. భారత దేశం సోవియట్ యూనియన్ సహకారంతో మిసిలీ వ్యవస్థను అభివృద్ధి చేసుకొంటున్నది. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత 1992లో భారతదేశానికి క్రయోజనిక్ ఇంజన్‌ను ఇవ్వవద్దని, ఇస్తే ఆంక్షలు విధిస్తానని రష్యాను బెదిరించింది. తర్వాత పృథ్వి మిసిలీలను మోహరించటాన్ని, అగ్ని మిసిలీలను అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని విరమించుకోవాలని జి7 దేశాలతో కలిసి మనకు తాఖీదులు పంపింది.

మనం అణుశక్తిని అభివృద్ధి చేసుకొనే కార్యక్రమానికి నిరంతరం ఆటంకాలు కల్పి



హోమిబాబా

స్తున్నది. అణు పరీక్షలు జరిపినపుడల్లా మన దేశంపై ఆంక్షలు విధించింది. 1998లో పోఖ్రా న్‌లో అణు పరీక్ష నిర్వహించినపుడు మన అణు విద్యుత్ కేంద్రాలకు ఇంధనం సరఫరాపై ఆంక్షలు విధించింది. 2005లో మనదేశంతో అణు ఒప్పందం చేసుకోవటం వెనుక ఉన్న లక్ష్యం మనదేశానికి అణురంగంలో సహకారాన్ని అందించటం కాదు. అణు సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి మనదేశం చేస్తున్న కృషికి ఆటంకం కల్పించటం, సైనికరంగంలో మనదేశాన్ని తన వ్యూహానికి అనుగుణంగా, తనకు జూనియర్ భాగస్వామిగా మార్చుకోవటమే అణు, సైనిక ఒప్పందాల లక్ష్యం. అణు విద్యుత్ ఉత్పత్తి కోసం అణు పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి మనదేశం ప్రయత్నం చేస్తున్నది. మనదేశ అణు పితామహుడు హోమిబాబా మనకు మూడుదశల అణుకార్యక్రమాన్ని రూపొందించాడు. మొదటి దశ సహజ యురేనియంను వినియోగించే హెవివాటర్ రియాక్టర్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవటం. రెండవ దశ ప్లుటోనియంను వినియోగించే ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను అభివృద్ధి చేసుకోవటం. మూడవ దశ థోరియంను వినియోగించే థర్మల్ బ్రీడర్ రియాక్టర్లను తయారు చేసుకోవటం. దీనిలో రెండవదశ అయిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్లను అభివృద్ధి చేసుకోవటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందంలో మనం స్వయంగా అణు రియాక్టర్లను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవటం, అణు సాంకేతిక పరిజ్ఞానాన్ని అభి వృద్ధి చేసుకోవటంపై అనేక ఆంక్షలను విధిం చింది. మన అణు పరిశోధనలను అడ్డుకోవటం, అణు రియాక్టర్లను ఉత్పత్తి చేసే అమెరికా కంపెనీలకు మనదేశాన్ని మార్కెట్‌గా తయారు చేయటమే అణు ఒప్పంద లక్ష్యం. దానికి అనుగుణంగానే మనదేశం అమెరికా, ఫ్రాన్స్‌ల నుండి అణు రియాక్టర్లను దిగుమతి చేసుకొని, అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయటానికి ప్రయత్నం చేస్తున్నది. ఫుకుషిమా అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రమాదం జరిగిన తర్వాత అణువిద్యుత్‌ను గురించి ప్రపంచ దేశాలు పునరా లోచన చేస్తున్నాయి. చాలా దేశాలు ఇప్పటికే తమ దేశాలలో ఉన్న విద్యుత్ కేంద్రాలను మూసివేయటానికి కార్యక్రమాన్ని రూపొందించు కున్నాయి. అమెరికాలో కూడా నూతనంగా అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయటం లేదు. మనదేశం దిగుమతి చేసుకున్న అణు రియాక్టర్లను ఏర్పాటు చేయటానికి, విద్యుత్ ఉత్పత్తికి అవసర మైన అణు ఇంధనాన్ని దిగుమతి చేసుకొని విద్యుత్‌ను ఉత్పత్తి చేయటానికి మూడురెట్లకు పైగా అదనంగా ఖర్చవుతుంది. ప్రజలు ఆమేరకు విద్యుత్ ఛార్జీల భారం మోయా ల్సి ఉంటుంది. రక్షణ రీత్యా, ధరరీత్యా అణు విద్యుత్ మనకు ప్రయోజనం కాదని స్పష్టమౌ తున్నది. కాని అమెరికా ఒత్తిడితో ప్రభుత్వం అణు రియాక్టర్లను దిగుమతి చేసుకొని, విద్యుత్ కేంద్రా లను నెలకొల్పటానికి పూనుకొంటున్నది. ఇది మనకు నష్టకరంగా పరిణమిస్తుంది.

సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ఏకధృవ ప్రపంచంలో అమెరికా తన ప్రయోజనాలకు అనుగుణంగా ప్రపంచాన్ని తీర్చిదిద్దటానికి ప్రయత్నించింది. తనకు గిట్టని ప్రభుత్వాలను కూల్చివేయటానికి ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, లిబియా, సిరియా తదితర దేశాలపై దాడులకు తెగబడుతున్నది. అయితే వేగంగా మారుతున్న ప్రపంచంలో అమెరికా ఏకచ్ఛత్రాధి పత్యానికి కాలం తీరిపోతున్నది. చైనా అత్యంత వేగంగా ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ అమెరికా తరువాత రెండవ స్థానానికి చేరింది. మరి కొద్దికాలంలో అమెరికాను అధిగమించి మొదటి స్థానానికి చేరుతుందని ఆర్థిక నిపుణులు అంచనా

వేస్తున్నారు. అమెరికా దురాక్రమణదారీ విధానాలను ప్రతిఘటించటానికి, తమపై పెత్తనం చేసే ప్రయత్నాలను చైనా, రష్యా కలిసి వ్యతిరేకిస్తున్నాయి. చైనా, రష్యాలతో పాటు భారతదేశం కూడా కలిస్తే అమెరికా పెత్తనానికి అడ్డుకట్ట పడుతుంది. అభ్యుదయశక్తులకు అనుకూలంగా మార్పులు రావటానికి అవకాశం ఉంది. ఈ కలయికను నివారించటం కోసం అమెరికా వ్యూహాత్మకంగా ప్రయత్నం చేస్తున్నది. రష్యాను బెదిరించి, లొంగదీసుకొని తన అదుపులో పెట్టుకోవటానికి ప్రయత్నం చేస్తున్నది. దీనిని రష్యా ప్రతిఘటిస్తున్నది. భారతదేశాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలనిస్తున్నాయి. అణు ఒప్పందం, ఆతర్వాత వివిధ రకాలైన సైనిక ఒప్పందాలతో భారతదేశం తన ధృతరాష్ట్ర కౌగిలి నుండి బయట పడటానికి వీలులేకుండా బిగిస్తున్నది. నయా ఉదారవాద విధానాలను అనుసరిస్తూ ప్రజలకు దూరమౌతున్న మన పాలకవర్గాలకు అమెరికా మద్దత్తు, చైనా వ్యతిరేకత అవసరమౌతున్నాయి. మన ఇరుగుపొరుగులో పెద్దదేశంగా ఉన్న చైనాను ఎంతగా వ్యతిరేకం చేసుకొంటే అంతగా అమెరికాతో సంబంధాలు పెంచుకోవచ్చు. అందుకోసం అమెరికా పథకం ప్రకారం మన దేశంలో చైనా వ్యతిరేకతను రెచ్చగొట్టటానికి ప్రయత్నం చేస్తున్నది. మన పాలకవర్గాలు, మీడియా దీనిని అందిపుచ్చుకొని ముందుకు పోతున్నాయి.

> **"భారతదేశాన్ని తన చెప్పుచేతల్లో పెట్టుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలనిస్తున్నాయి. అణు ఒప్పందం, ఆతర్వాత వివిధ రకాలైన సైనిక ఒప్పందాలతో భారతదేశం తన ధృతరాష్ట్ర కౌగిలి నుండి బయట పడటానికి వీలు లేకుండా బిగిస్తున్నది."**

ఈ రోజు ఆర్థికరంగంలో అమెరికా పరిస్థితి బంగారు కడియం పట్టుకొని మడుగు వద్ద కూర్చున్న ముసలి పులి చందంగా ఉంది. తనకు సన్నిహితంగా ఉండే వారిని మింగటం మినహా ఇవ్వటానికి వారి వద్ద ఏమీలేదు. అందువలన అమెరికాతో సంబంధాలు పెంచుకోవటం వలన మనదేశ అభివృద్ధికి లభించే తోడ్పాటు నామ మాత్రంగా మాత్రమే ఉంటుంది. చైనాతో మన దేశ సంబంధాలు బలపడితే మన దేశాభివృద్ధికి విస్తారమైన అవకాశాలు లభిస్తాయి. రెండు దేశాలు అధిక ఆర్థిక పెరుగుదలను సాధిస్తున్నాయి. అపారమైన సహజ వనరులు, విస్తరించే మార్కెట్ ఉన్నాయి. వీటిని ఉపయోగించుకొని, పరస్పర సహకారంతో ఉత్పత్తి, సేవల రంగాలలో వేగంగా అభివృద్ధిని సాధించవచ్చు. కాని మన పాలకవర్గాలకు కావలసినది మన ఉత్పత్తి రంగం విస్తరించటం, ప్రజలకు ఉపయోగ పడే అభివృద్ధి కాదు. తమకు అత్యధిక లాభాలను అందించే అభివృద్ధి కావాలి. అందుకే అమెరికాతో అంటకాగుతున్నారు.

ఇటువంటి పరిస్థితులలో అమెరికా చైనాకు వ్యతిరేకంగా ఏర్పాటు చేస్తున్న కూటమిలో సులభంగానే భారతదేశాన్ని భాగస్వామిని చేయ గలిగింది. భారతదేశాన్ని తన ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే దేశంగా మార్చటానికి వివిధ రకాలైన ఒప్పందాలను ప్రతిపాదించింది. గతంలో అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం అమెరికాతో సన్నిహితత్వాన్ని పెంచుకున్నప్పటికీ, అమెరికా ప్రతిపాదించిన సైనిక ఒప్పందాలలో భాగస్వామి కావటానికి అంగీకరించలేదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఒప్పందాలలో భాగస్వామి కావటానికి గట్టిగా ప్రయత్నం చేస్తున్నది. ఉభయదేశాలలోని భూ, ఆకాశ, సముద్రాలలోని సైనిక వసతులను, స్థావరాలను వినియోగించుకోవటానికి అవకాశం కల్పించే లాజిస్టిక్స్ సపోర్ట్ ఎగ్రిమెంట్ (యల్ఇయంఒఎ)ను చేసుకోవటానికి సిద్ధమయారు. కమ్యూనికేషన్స్ ఇంటర్ ఆపరబిలిటి అండ్ సెక్యూరిటి మెమొరాండం ఆఫ్ ఎగ్రిమెంట్ (సిఐయస్‌యంఒ), బేసిక్ ఎక్స్ఛేంజ్ అండ్ కో ఆపరేషన్ ఎగ్రిమెంట్ ఫర్ జియో స్పేషియల్ కో ఆపరేషన్ ( బిఇసిఎ) ఒప్పందాలను చేసుకొంటున్నది. ఈ ఒప్పందాల వలన అమెరికా సైనికదళాలు తమ విమానాలకు, యుద్ధనౌకలకు ఇంధనం నింపుకోవటానికి, యుద్ధసామాగ్రికి మరమ్మత్తులు చేసుకోవటానికి, అలసిపోయిన సైనికులు సేదతీర్చుకోవటానికి మన సైనిక స్థావరాలను వినియోగించుకొంటారు. ఆచరణలో అమెరికా సైనికకేంద్రంగా మనదేశం మారుతుంది. పెరుగుతున్న చైనా ఆర్థిక, సైనికశక్తి ని ఎదుర్కోవటానికి అమెరికాతో ఒప్పందాలు చేసుకొంటున్నట్లు మన రక్షణమంత్రి చెప్పాడు. ఈ ఒప్పందాలను అమెరికా 2004లోనే ప్రతి పాదించింది. ఈ ఒప్పందాల వలన అమెరికా సైన్యం మన సైనిక స్థావరాలలో తిష్ఠవేస్తుందని, అమెరికా ఏర్పాటు చేస్తున్న సైనిక కూటమిలో మనదేశం భాగస్వామి అవుతుందని, ప్రాంతీ యంగా మనదేశానికి ఉన్న స్వతంత్రతను దెబ్బ తీస్తాయనే కారణాలతో ఆనాడు అధికారంలో ఉన్న యుపిఎ ప్రభుత్వం ఈ ఒప్పందాలు చేసుకోవటానికి వెనుకాడింది. కాని నేటి బిజెపి ప్రభుత్వం ఈ ఒప్పందాలు చేసుకోవటానికి నిర్భీతిగా ముందుకు సాగుతున్నది.

భారత పాలకవర్గాలు దేశప్రయోజనాలకు విఘాతం కలిగిస్తూ తమ స్వ ప్రయోజనాల కోసం అమెరికాతో అంటకాగాలని నిర్ణయించుకున్నాయి. గత కొంతకాలం నుండి అలీనోద్యమాన్ని, ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలను పణంగా పెట్టి అమెరికాతో సంబంధాలను పెంపొందించుకుంటున్నాయి. అందులో భాగంగానే మనదేశాన్ని అమెరికాకు జూనియర్ భాగస్వామిగా మార్చే సైనిక ఒప్పందాలు చేసుకోవటానికి సిద్ధమయ్యాయి. భారత ప్రజానీకంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట చైతన్యం క్రమంగా తగ్గుతున్నా పూర్తిగా అంతరించిపోలేదు. అమెరికాతో మనదేశం చేసుకోవటానికి సిద్ధపడిన సైనిక ఒప్పందాల స్వరూపం ప్రజలకు అర్థమైతే ప్రభుత్వాన్ని నిలదీస్తారు. ఒప్పందాలు జరిగి, అమలు ప్రారంభమైతే వాటి వలన మనదేశానికి జరిగే నష్టమేమిటో తెలుస్తుంది. అవి జరిగేలోగానే చైనాను మనకు శతృవుగా చూపుతూ, ఆ దేశాన్ని రెచ్చగొడుతూ ప్రచారం చేస్తే, చైనా వ్యతిరేకతను తట్టుకోవటానికి అమెరికాతో రక్షణ ఒప్పందాలు చేసుకున్నామని ప్రజలను మభ్యపెట్టవచ్చు. చైనా మన శతృవని ప్రజలను నమ్మించగలిగితే అమెరికాకు దాస్యం చేయటానికి, సరళీకరణ విధానాలను యధేచ్చగా ముందుకు తీసుకుపోవటానికి ఏ అడ్డూ ఉండదు. పక్కలోబల్లెంలా పెద్దదేశం మనకు శతృవుగా ఉందని, ఆ దేశాన్ని ఎదుర్కోవాలంటే దేశంలో ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేకుండా అందరం ఐక్యంగా ఉండాలనే పేరుతో ప్రజా ఉద్యమాలను, అభ్యుదయ శక్తులను అణచివేయవచ్చు. ఆ లక్ష్యంతో ఈ అపర దేశ భక్తులు! ప్రభుత్వం అమెరికాకు దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టటానికి, దాస్యం చేయటానికి సిద్ధమయింది. ❋

**ఇంటర్వ్యూ**

# 'గుజరాత్ ఫైల్స్'



రచయిత్రి ప్రముఖ పాత్రికేయురాలు

**రానా అయూబ్**

*నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్య మంత్రిగా వ్యవహరించిన కాలంలో జరిపించిన "జాతి విద్వేష మారణకాండను, చరిత్ర పుటల్లో పూడ్చేసే ప్రయత్నాన్ని బట్టబయలు చేసే ప్రయ త్నమే గుజరాత్ ఫైల్స్. తెహెల్కాలో పనిచేసిన 'రానా అయూబ్' అమెరికాలో పుట్టిన ఫిల్మ్ మేకర్ "మైథిలీ యోగి"గా మారి, గుజరాత్ రాష్ట్రంలోని ప్రముఖులు, సీనియర్ ఆఫీసర్లతో సహా ఎందరినో ఇంటర్వ్యూ చేసి అందించిన సమాచారమిది. 'ఆపరేషన్ కళంక్'గా నామక రణం చేసి, 'ఆశిష్ కేతన్' సేకరించిన అత్యంత విలువైన సమాచారం 'ట్రయల్స్'లో కీలకంగా మారింది.*

***2002** సంఘటన గురించి సమాచార సేకరణ క్రమంలో రానా అయూబ్ ఎదుర్కొన్న సమస్యలను, నాటి రాష్ట్ర హోం సెక్రటరీ "అశోక్ నారాయణన్"ను ఉటంకిస్తూ రానా ఎదుర్కొన్న బెదిరింపులు ఎన్నెన్నో. డిప్రెషన్ని, ఒత్తిడిని ఎంతో అనుభవిస్తూ, రాజీలేని పోరాటం చేసి తన పుస్తకాన్ని మే **27**న మార్కెట్లోకి విడుదల చేసింది.*

**ఆ పుస్తకంలోని ఒకభాగం:**

నేను ఆ ప్రాంతం చేరే సరికి మధ్యాహ్న భోజనం సిద్ధంగా ఉంది. గుజరాత్ ప్రధాన కార్యదర్శిగా ఆయన క్లిష్టమైన బాధ్యతల గురించి ఆ రోజే మాట్లాడటం సంభవించింది. పరిసరాలు అనుకూలంగా ఉన్నాయి. భోజన సమయంలో మాట్లాడుకునే అనేకానేక సామాన్య విషయాల లాగానే నేను నాకు కావలసిన సమాచారం గురించి ఆరా తీయడం ఆరంభించాను. ఎటువంటి అరమరికలు లేకుండా అశోక్ నారాయణన్ మాట్లాడారు.

మధ్యాహ్నం టీ సమయానికి నరేంద్ర మోడీ మత కలహాలను, మారణకాండను ఎలా హ్యాండిల్ చేశారో సూక్ష్మంగా చెప్పడం ప్రారంభించారు. "నారాయణన్ గారు, గత వారం రోజులుగా మీ కోసం గూగుల్లో నేను వెతుకుతున్నప్పుడు గుజరాత్ విద్వేషాల వలయంలో అనేకానేక కమీషన్లతో పాటు నరేంద్రమోడీతో వ్యవహరించే క్రమంలో మీ పేరు ఎన్నోసార్లు తటస్థపడింది. సిద్ధాంతాల ప్రభావం, మానవత్వం అధికంగా ఉన్న మీకు, ఆ సమయం బహుశా అత్యంత క్లిష్ట సమయం. మారణకాండను ప్రోత్సహించిన ముఖ్యమంత్రి పక్కన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కీలకంగా వ్యవహరించే సమయంలో మీరు ఎంతో ఖేదపడి ఉంటారు అవునా?" అంటూ మా సంభాషణ ఆరంభమైంది.

**మారణకాండను కొనసాగిస్తున్న తరుణంలో, అదుపు చేయడానికి చాలా నెమ్మదిగా వ్యవహరించమని ముఖ్యమంత్రి అన్నప్పుడు బహుశా మీ ముఖం క్రోధంలో ఎరుపుకు మారి ఉండి ఉంటుంది కదా?**

ప్రత్యక్షంగా ఆయన ఏదీ నోటితో చెప్పరు. పేపర్ మీద ఏమీ రాయరు. విశ్వహిందూ పరిషత్ ద్వారా, తన అనుయాయుల ద్వారా ఆయన అనుకున్నది అనుకున్నట్లుగా ఆయన మార్గాల్లో చేసుకుంటూపోతాడు. అనధికార మార్గాల ద్వారా ఆఖరిస్థాయిలో ఉన్న పోలీస్ ఇన్స్పెక్టర్లకు ఆదేశాలు అందుతాయి.

**బహుశా మీరు అసహాయస్థితిలోకి నెట్టివేయబడి ఉంటారు కదా?**

ఖచ్చితంగా! ఇలా ఎందుకు జరుగుతుంది అని మనం ఆలోచించేలోపే జరగాల్సింది జరిగిపోతుంది.

**ఎంక్వైరీ కమీషన్లకు ఎలాంటి ఆధారాలు దొరకవు. ఏమంటారు?**

ఎన్నో సందర్భాల్లో రాష్ట్ర మంత్రులే స్వయంగా రోడ్లపై నిలబడి సమూహాలను రెచ్చగొట్టేవారు. నేను ఆయన గదిలో కూర్చున్న సమయంలో అలాంటి సంఘటన ఒకటి జరిగింది. అదేమిటంటే, ఓ ఫోన్కాల్ వచ్చింది. "ఒక మంత్రి వలన ఇదంతా జరుగుతుందని" నేను చెప్పగా, ఆ మంత్రిని వెనక్కి పిలిపించారు. కనీసం ఒక్క మంత్రిని వెనక్కి పిలిపించారు అంతే!

**అతను భారతీయ జనతాపార్టీ మంత్రా?**

అవును. అతని మనిషి, అనుయాయుడు, మంత్రి.

**'మాయా కొద్నానీ' కూడా ఉన్నారని, ఆమె ప్రభుత్వానికి సంపూర్ణంగా వ్యతిరేకంగా మారారని తెలిసింది.**

అవును. మీరన్నది నిజమే. ఆమె ఆ సమయంలో ఉన్నారు.

**అదొక వెర్రి చర్య. కాదంటారా?**

ఇప్పటివరకు ఎవ్వరికీ చెప్పని విషయం ఒకటి చెబుతాను. ఓ ముస్లిమ్ ఉన్నతాధికారి నాకు ఫోన్చేసి "సార్! దయచేసి నా జీవితాన్ని కాపాడండి. నా ఇల్లు చుట్టుప్రక్క లంతా చుట్టుముట్టేశారు. "వెంటనే నేను కమీషనర్ ఆఫ్ పోలీస్కి ఫోన్ చేశాను. ఆయన రికార్డు చేశారో? లేదో? తెలియదు. కానీ ఆ ముస్లిమ్ అధికారి రక్షించబడ్డాడు. ఆ మర్నాడు అతను నాకు ఫోన్ చేసి "సార్, నేను రక్షింపబడ్డాను కానీ ఈ రోజున్న వాతావరణం నిన్న లేదు" అని చెప్పాడు.

**ఆ మంత్రి జైలులో కటకటాల వెనుక ఉన్నాడు కదా!**

వాళ్ళంతా జైలులో లేరు. బయటే ఉన్నారు. ఎవరో ఒకరు చేయాలి. ఎవరో ఒకరు సాక్ష్యం ఇవ్వకపోతే ఎలా చేస్తారు?

**అలా సాక్ష్యం ఇవ్వడానికి ఎవరికన్నా ధైర్యం ఉందా?**

ఎవ్వరికీ ఆ ధైర్యం లేదు.

**మంత్రులకు వ్యతిరేకంగా ఏవైనా చర్యలు ఎవరు తీసుకుంటారు?**

ముందు మీకో ముఖ్య విషయం చెప్పాలి. రాష్ట్రంలో ఆ సంఘటన జరిగిన సమయంలో నేను విజిలెన్స్ కమిషనర్ స్థానంలో ఉన్నాను. రాష్ట్రంలో మంత్రుల వ్యవహారాలు చూడటానికి లోకాయుక్త ఉంటుంది. ఒకరోజు నేను వెళ్ళాను. నిజాయితీగా చెప్పాలంటే ఏసీ రూముల్లో కూర్చొని ఎవ్వరూ కదలరు... విచ్చు కత్తుల్లాంటి వారే వారంతా! కానీ అవకాశాలే అందడం లేదు. ఎలాగంటే, అక్కడున్న వారిని "ఏం

జరుగుతుందని" అడిగాను. దానికే వారేం చెప్పారో తెలుసా? సార్ మంత్రులు తీసుకునే లంచాల గురించే, చేస్తున్న అవినీతి పనుల గూర్చి ప్రజలు కనీసం ముందుకొచ్చి ఫిర్యాదు చేయరు. అలాంటి వారు మారణకాండలో మంత్రుల పాత్ర గూర్చి ఎలా ముందుకొస్తారు? ఎవ్వరికీ బాధ్యత లేదు. ప్రజలు ముందుకు రానిదే మేమేం చేయలేం. వాళ్ళ సంభాషణలు కూడా చాలా అర్థవంతంగా, నర్మగర్భంగా ఉన్నాయి. ఆఫీసర్లకు ఫోన్‌చేసి "ఆ ప్రాంతాన్ని చూడండి" అంటారు.

సామాన్యంగా ఎవరైనా ఏమని భావిస్తారు? "మారణకాండ జరుగుతున్న ప్రదేశంలో, మరింత జరగకుండా అరికట్టే చర్యలు చేపట్టమని". కానీ అసలు అర్థం మాత్రం, "ఆ ప్రాంతంలో మరింతగా, పకడ్బందీగా మారణకాండ జరిపించమని".

ప్రత్యక్షంగా వాళ్ళు ఏ చర్యల్లోనూ పాల్గొనరు. వాళ్ళ ఏజెంట్లు, ఖచ్చితంగా ఆదేశాలు పాటించే ఏజెంట్లు. ఎటువంటి విచక్షణాలేని ఏజెంట్లు. ఎఫ్.ఐ.ఆర్.లు రిజిష్టర్ అవుతాయి కానీ ఎలాగో తెలుసా? "గుంపులపై, సమూహంగా ఉన్న జనాలపై! సామూహికంగా ఉన్నవారిపై చర్యలు ఎలా చేపట్టగలం?" అదే అంతఃస్సారం.

**మత కల్లోలాల మారణకాండను దర్యాప్తు చేయడానికి నియమించిన కమిషన్లు మీకు ఏమీ సహకరించలేదా?**

'నానావతి కమీషన్' నియమాకం జరిగింది. కానీ నేటికీ ఎలాంటి రిపోర్టు అందించలేదు. నేను హోమ్ సెక్రటరీగా ఉన్నప్పుడు, లిఖిత పూర్వకంగా ఆజ్ఞలు ఇస్తూనే, ఆచరణలో పెడతామని స్పష్టంగా చెప్పాను. "బంద్"కోసం పిలుపు వచ్చినప్పుడు, చీఫ్ సెక్రటరీ సుబ్బారావు నన్ను పిలిచి వి.హెచ్.పి.కి చెందిన 'ప్రవీణ్ తొగాడియా' ర్యాలీ నిర్వాహించాలనుకుంటున్నారని, మీ అభిప్రాయం ఏమిటని అడుగగా "ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని, ఇస్తే పరిస్థితులు చేజారిపోతాయని స్పష్టంగా చెప్పాను. ముఖ్యమంత్రికి ఈ విషయం తెలిసి నన్ను పిలిచారు" వాళ్ళు ర్యాలీ నిర్వహిస్తామన్నప్పుడు అనుమతి ఇవ్వాలి గదా! కాదని మీరెలా చెప్పగలిగారు? అని ప్రశ్నించగా "అయితే లిఖితపూర్వకంగా ఆదేశించండి. ఇస్తామని" జవాబిచ్చాను. ఏం మాట్లాడలేక నన్ను తేరిపారా చూశారు అంతే!

**మీరు మీటింగ్‌లో లేరా?**

ఏ మీటింగ్.

**ముఖ్యమంత్రి, ప్రభుత్వ అధికారులను, బ్యూరోక్రాట్లను, మారణకాండ విషయంలో అత్యంత నెమ్మదిగా చూసీ చూడనట్లుగా వ్యవహరించమని నిర్వహించిన మీటింగ్‌లో!**

లేనని చెప్పలేను. ఆ మీటింగ్‌లో నేనూ ఉన్నాను.

**ఆ రోజు ముఖ్యమంత్రి ఎందుకంత ఆగ్రహంగా ఉన్నారు? బిజెపికి చెందిన ముఖ్యమంత్రిగానా?**

కాదు. మారణహోమం సమయంలో ఆయన వి.హెచ్.పి.ని సమర్థించాడు. హిందువుల ఓట్ల కోసం అతను ప్రయత్నించి, తనను కున్నది సాధించాడు. అతననుకున్నదే జరిగింది.

**కానీ మీ అందరినీ ఆచి తూచి వ్యవహరించమని అడిగారుగా!**

అది, మీటింగ్‌లో బహిరంగంగా అడగలేదు. కానీ తనకు సంబంధించిన వ్యక్తులకు సూచనలు ఇవ్వడం జరిగింది. ఎలాగంటే వి.హెచ్.పి.కి చెప్పడం, 'టాండన్'లాంటి వి.హెచ్.పి. అనుకూల అధికారులకు ఆదేశాలుగా కాక, ఏం చేయాలో దిశానిర్దేశం చేయడం. అంటే అధికారంలో ఉన్న వి.హెచ్.పి. అనుకూల అధికారులతో, తనకు కావల్సింది చేయించగలిగారు.

**2002లో డైరెక్టర్ జనరల్‌గా ఉన్న చక్రవర్తి ఈ లైన్‌లో ఉన్నారా?**

వారికి వ్యతిరేకంగా ఉన్నది ఇద్దరమే! నేనూ, చక్రవర్తి. మేము అధికారులుగా ఉన్నది ప్రజలకు సేవ చేయడానికి తప్ప, అధికారంలో ఉన్న ప్రభుత్వానికి సేవ చేయడానికి కాదు.

**మిగిలినవారు మీలాగా ఎందుకు వ్యవహరించలేకపోయారు?**

మిగిలిన వారికో లక్ష్యముంది. అది చేరాలంటే అనుకూలంగా వ్యవహరించక తప్పదు. మనస్సాక్షి కన్నా, మనుగడకే ప్రాధాన్యత ఇచ్చారు వాళ్ళందరూ. కానీ చక్రవర్తి అలా కాదు. అందుకే అతనికి ప్రమోషన్లు లేవు, విదేశీ యానాలు లేవు. ఆత్మసాక్షిగా పనిచేశాడతను.

**వివాదాస్పదమైన మీటింగ్ గురించి ప్రజలేమనుకున్నారు?**

'హరేన్ పాండ్యా' అనే మంత్రి, మొదటి సారిగా 'ప్రెస్'కి ఈ విషయం తెలియజేసింది.

**మీటింగ్‌లో ఎవరెవరున్నారు?**

చీఫ్ సెక్రటరీ, అసిస్టెంట్ చీఫ్ సెక్రటరీ, హోమ్ సెక్రటరీ, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, మిగిలిన అధికారులు.

గుజరాత్ మారణకాండ సమయంలో జరిగిన ఈ మీటింగ్ ఎంత క్లిష్టస్థాయిలో జరిగి ఉంటుందో ఓ సామాన్య వ్యక్తి కూడా ఊహించగలడు. అశోక్ నారాయణన్ మాటల ప్రకారం అధికారిక లెక్కలు నిజం కాదు. ఆయనపై అందరి దృష్టి ఉంది. ఆయన మాటలు వాస్తవమని మాకందరికీ సైతం తెలుసు. మాజీ హోమ్ సెక్రటరీ మాటల ప్రకారం, సామాజిక, రాజకీయ ప్రయోజనాలు ఫణంగా పెట్టి స్వప్రయోజనాల కోసం నరేంద్రమోడీ నడిపించారు. వాస్తవాలను మరుగుపరచి, పిక్షన్‌ని ప్రజలకు, ప్రపంచానికి చూపించడానికి అన్నివిధాలా కృషిచేశారు. మీడియాకు అఫిడవిట్స్‌ని లీక్ చేసిన శ్రీ కుమార్ పట్ల అతను వ్యవహరించిన తీరు అందరికీ విదితమే. అందుకే ఆ తర్వాత గాంధీ నగర్‌లో జరిగిన మీటింగ్‌లో ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా ఆనాటి ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అనవసర విషయాలను, అర్థరహిత వాదనలను చేస్తూ, దిగువస్థాయి ఆఫీసర్లకు ఆదేశాలు వ్యక్తిగతంగా ఎలా అందాయో మాత్రమే మాట్లాడాడు".

"నానావతి కమీషన్" తనను చేసిన క్రాస్ ఎగ్జామినేషన్"లోని ప్రశ్నలను ఒక్కటి కూడా ఆయన తన సంభాషణలో నాతో చెప్పలేదు. బి.జె.పి. ఇచ్చిన ఉత్తర్వులతో, వి.హెచ్.పి. బంద్‌కి పిలుపు ఇవ్వడంతో ఇదంతా ఆరంభమైంది.

**మీరు నిర్వహించడానికి అత్యంతక్లిష్టంగా తయారైన సమస్య కదా?**

అవును. బిజెపి నుండీ సిగ్నల్ వెళ్ళనంత వరకూ జటిలంగానే మారిన సమస్య.

**'మోడీ' ఖ్యాతి ఏమైంది?**

**" 'బంద్'కోసం పిలుపు వచ్చినప్పుడు, చీఫ్ సెక్రటరీ సుబ్బారావు నన్ను పిలిచి వి.హెచ్.పి.కి చెందిన 'ప్రవీణ్ తొగాడియా' ర్యాలీ నిర్వాహించాలనుకుంటున్నారని, మీ అభిప్రాయం ఏమిటని అడుగగా "ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని, ఇస్తే పరిస్థితులు చేజారిపోతాయని స్పష్టంగా చెప్పాను. "**

అతను పూజింపబడ్డాడు. సనాతన హిందువులందరికీ అతనే కీర్తి పతాకాన్ని ఎగరవేసిన వ్యక్తిలా నమ్మించబడ్డాడు.

**పక్షపాత వైఖరితో వ్యవహరించాడు కదా!**

గోధ్రా సంఘటన పట్ల అతను క్షమాపణ కోరి ఉండాల్సింది. జరిగిన మారణకాండ పట్ల క్షమాపణ చెప్పి ఉండాల్సింది.

**జరిగిన సంఘటన పట్ల, మోడీ చాలా పక్షపాత వైఖరితో వ్యవహరించడమే గాక, గోధ్రా నుంచి శవాలను అహ్మదాబాద్‌కు తెప్పించే విషయంలో సైతం అదేవిధంగా వ్యవహరించారని తెలిసింది.**

నేను స్పష్టంగా చెప్పాను. అహ్మదాబాద్‌కి శవాలను తెప్పించడమన్నది పూర్తిగా మోడీ నిర్ణయమే. మరెవ్వరి పాత్ర లేదు.

**ఆ స్టేట్‌మెంట్ మీ పట్ల వ్యతిరేకతను పెంచి ఉంటుంది కదా!**

అహ్మదాబాద్‌కు శవాలను తెప్పించడమన్నది మోడీ నిర్ణయమే! అదే పరిస్థితిని మరింత తీవ్రంగా మార్చింది.

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

# వామపక్ష వెల్లువను వమ్ముచేసే కుట్రలు

(22వ పేజీ తరువాయి)

పట్టు సడలిపోతూ వచ్చింది. లాటిన్ అమెరికా దేశాలు క్రమంగా అమెరికా పట్టునుండి విడగొట్టుకుని ఆర్థికంగా స్వేచ్ఛ సంపాదించడం ప్రారంభించారు. దీనికి చైనాతో వాణిజ్యం వారికి తోడ్పడింది. గత దశాబ్దంన్నర కాలంలో చైనాతో ఈ దేశాల వాణిజ్యం 2000 శాతం పెరిగింది. పనామా కాలువ మాదిరిగానే పసిఫిక్–అట్లాంటిక్ మహా సముద్రాలను కలుపుతూ నికరాగువా గుండా కాలువ తవ్వడానికి ప్రణాళికలు సిద్ధమైనాయి. బ్రెజిల్ నుండి పెరూ వరకు లాటిన్ అమెరికా ఖండం మొత్తాన్ని కలుపుతూ రైల్వే లైను నిర్మించే ప్రాజెక్టు కూడా సిద్ధమైంది. ఈ చర్యలన్నీ కూడా లాటిన్ అమెరికాలో తన ప్రాబల్యాన్ని తగ్గించేస్తుందని భావిస్తున్న అమెరికా తన విదేశాంగ విధానంలో చైనాను టార్గెట్ చేస్తూ 'ఆసియా కేంద్రం'తో బాటు 'లాటిన్ అమెరికా కేంద్రం'గా కూడా పథకాలు రచించడం ప్రారంభించింది. దీనికోసం మరోసారి మన్రోయ్ సిద్ధాంతానికి పదునుపెడుతోంది. అమెరికా సైనిక వ్యూహకర్తల్లో ఒక ముఖ్యుడు లాటిన్ అమెరికా గురించి ఇటీవల ఇలా అన్నాడు:"సైనిక విశ్లేషణ దృష్టిలో చేస్తే లాటిన్ అమెరికా అనేది అమెరికాపై గురిపెట్టేవారికి అనువుగా ఉండే ఎత్తయిన ప్రదేశం వంటిది. అటువంటి ఎత్తయిన ప్రదేశాన్ని శత్రువు ఆక్రమిస్తూ, తన సైన్యానికి ప్రమాదంగా మారుతూ ఉంటే బాధ్యత గల కమాండర్ ఎవడూ చూస్తూ ఊరుకోడు. తన వనరులన్నిటినీ ఉపయోగించి శత్రువు ఆ ఎత్తయిన ప్రదేశాన్ని ఆక్రమించకుండా చూస్తాడు." అంటే లాటిన్ అమెరికాలోకి మరొకరు కాలుపెట్టకుండా అమెరికా తన శక్తియుక్తులన్నిటినీ ఉపయోగిస్తుందన్నమాట. సరిగ్గా రెండు శతాబ్దాల క్రితం అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో ఇదే సిద్ధాంతాన్ని ఉపయోగించి లాటిన్ అమెరికాను తన పెరడుగా మార్చుకున్నాడు.

ఈ రోజు లాటిన్ అమెరికాలో ఉత్పన్నమైన సమస్యలను ఉపయోగించుకుని అమెరికా అక్కడ తను కోల్పోయిన పట్టును బిగించడానికి ప్రయత్నిస్తుంటే లాటిన్ అమెరికా దేశాలు ఆర్థికంగా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని నిలుపుకోడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ రెండు పక్షాల్లో ఎవరు విజయం సాధిస్తారు అన్నది ఆ దేశాల్లో జరుగుతున్న ప్రజా పోరాటాల ఉధృతిపై ఆధారపడి ఉంటుంది.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

# సరళీకరణ విధానాలు ప్రత్యామ్నాయం


(8వ పేజీ తరువాయి)

పాటు ప్రాంతీయ అసమానతలను పెంచుతోంది. మరోవైపు సామాజిక చీలికలను తెచ్చే మతత్వాన్ని పోషిస్తోంది. దీనిని తిప్పికొట్టేందుకు స్పష్టమైన వ్యూహంతో మనం ముందుకెళ్లాలి. ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన మొదటి అంశం.. నయా ఉదారవాదాన్ని తిప్పికొడతామని, దానికి చరమగీతం పాడుతామంటే ఇంతకు ముందున్న పెట్టుబడి విధానాన్ని తీసుకొస్తామని చెప్పడం కాదు. సంస్కరించబడ్డ పెట్టుబడివిధానాన్ని తీసుకొస్తామని చెప్పడం కాదు. అది కార్యరూపం దాల్చదు. పెట్టుబడిదారి విధానం కూడా సోషలిజం మాదిరే మునుపటి దశలోకి వెళ్లదు. అందువల్ల నయా ఉదారవాదంపై పోరాడటమంటే ప్రత్యామ్నాయాన్ని ముందుకు తీసుకొచ్చి పోరాడాలి. ఆ ప్రత్యామ్నాయమే సోషలిజం. నయా ఉదారవాదంపై పోరాడేందుకు ప్రజలను సమీకరించే ముందు ప్రత్యామ్నాయ విధానాన్ని వారిముందుంచాలి. జీవనోపాధులపైనా, ప్రజల హక్కులపైనా దాడి జరిగినప్పుడు తక్షణ డిమాండ్లతో పోరాడవచ్చు. అయితే ప్రత్యామ్నాయ కార్యాచరణ అనేది అణిచివేతకు గురౌతున్నవారందరినీ దృష్టిలో ఉంచుకొని రూపొందించుకోవాలి. ఆ ప్రత్యామ్నాయం అనేది ఆర్థికంగానూ, రాజకీయంగానూ, సామాజికంగానూ, సాంస్కృతికంగానూ ప్రత్యామ్నాయమైవుండాలి. ఆ ప్రత్యామ్నాయం కూడా భారతదేశ పరిస్థితులకు అనుగుణమైన సోషలిజం సాధన దిశగా ఉండాలనేది నా అభిప్రాయం. అది ఎలా సాధ్యపడుతుందంటే నేనిప్పటికిప్పుడు చెప్పలేను. దానిపై ఇంకో ప్రసంగం చేయాల్సివుంటుంది. కానీ నయా ఉదారవాదంపైనా, మతతత్వంపైనా పోరాట డం అనేది నేడు చాలా కీలకమైన బాధ్యత. మనం ఈ బాధ్యతనే తీసుకుంటున్నాం. కచ్చితమైన ప్రత్యామ్నాయం ఉన్నప్పుడే ఇది సాధ్యమని మనం గమనంలో ఉంచుకోవాలి. అప్పటివరకు మనం దీనిపై పోరాడుతామని, వ్యతిరేకిస్తామని మాత్రమే చెప్పగలం. కానీ భారతదేశ ప్రస్తుత పరిస్థితుల్లో నయా ఉదారవాదానికి, మతతత్వానికి ప్రత్యామ్నాయ మేంటో ఆ ప్రత్యామ్నాయాన్నే మనం నిర్మించాలి. అలాంటి నిర్మాణాత్మక ప్రత్యామ్నాయాన్ని నిర్మించి, ప్రజలకు అందించడమే భారతదేశంలో సామాజిక మార్పునకు తన జీవితపర్యంతం కృషి చేసిన మాకినేని బసవపున్నయ్యకు మనమిచ్చే ఘన నివాళి.

**(అనువాదం : బి. అమరనారాయణ)**

# జాతీయవాదం హిందూత్వ

ఎజి నూరాని



రచయిత సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి

కేంద్ర ప్రభుత్వ పాలకవర్గానికి చెందిన మత పెద్దలకు భారత జాతీయతపై నమ్మకం లేదు కానీ ఇంతకుపూర్వం ద్విజాతి సిద్ధాంతానికి ప్రతిరూపమైన హిందూ జాతీయత లేక హిందూత్వవాదంపైన మాత్రం నమ్మకముంది.

హిందూమత అభివృద్ధి కొరకు పోరాడే వాడే భారతదేశాన్ని పాలిస్తారు

– 19.11.1990

లౌకిక విధానం హిందూత్వ ఆకాంక్షలపై హేతుబద్ధతలేని నిబంధనలను విధిస్తుంది

– 20.10.1990

భారతీయ జనతాపార్టీని హిందూత్వ పార్టీగా పిలవడాన్ని తప్పుగా భావించడం జరగదు – 05.08.1989

– ఎల్.కె. అద్వానీ

నాటి భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు ఎల్.కె. అద్వానీ ప్రకటనలలో, బిజెపి హిందూత్వ పార్టీ అని ఒప్పుకున్నట్లు, లౌకిక విధానాలను నిరాకరించినట్లు మరియు తనకు హిందూ రాజ్యాన్ని స్థాపించే లక్ష్యం ఉన్నట్లు స్పష్టంగా పేర్కొనడం తద్వారా భారతదేశాన్ని హిందూ మతమే పాలిస్తుందని అన్నట్లు అర్థం అవుతుంది. ఇది భారత జాతీయతావాదం కాదు, కానీ హిందూ జాతీయతావాదం. దానినే బిజెపి హిందూత్వ లేదా సాంస్కృతిక జాతీయవాదం అని పిలుస్తుంది.

బిజెపి ప్రకటించనప్పటికీ, ఇదంతా స్పష్టంగా ఒక భావంపై ఆధారపడి జరుగుతుంది. కానీ బిజెపి సిద్ధాంతకర్త వి.డి. సావర్కర్ "హిందువులు ఒక ప్రత్యేక జాతీయతను నిర్మిస్తారు" అని చాలా స్పష్టంగా పేర్కొన్నాడు. హిందూత్వ అనేది ద్విజాతి సిద్ధాంతానికి మరొకపేరు. 'హిందూ జాతి' అనేది ఇతర భారతీయులను పాలిస్తూ 'హిందూ మత ఆకాంక్షలను' ముందుకు తీసుకొనిపోయే ఒక ప్రత్యేకమైన జాతి. హిందూత్వ సిద్ధాంతానికి, ద్విజాతి సిద్ధాంతానికి కూడా కారకుడు సావర్కర్.

ఇదే ప్రధాని నరేంద్రమోడీ మోసపూరిత సాహస కార్యాలకు మూలం. హిందూ రాజ్యాన్ని స్థాపించడం కొరకు, అధికారిక చర్యలతో ఒక లౌకిక రాజ్యాంగం యొక్క విలువలను నిశ్శబ్దంగా దిగజార్చివేస్తున్నారు. కేవలం పై పెంకు మాత్రమే మిగిలి లోపలి గుజ్జు అంతా పోతుంది. రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి ఉండెడివాడు. ద్విజాతి సిద్ధాంతాన్ని నిరాకరించే, లౌకిక తత్వంతో కూడిన విశ్వాసాలకు విలువ ఇచ్చే భారతీయులంతా పోరాడాలి."

"ఒకవేళ హిందూ రాజ్యం రావడం వాస్తవమైతే, అది ఈ దేశానికి ఒక పెద్ద విపత్తు అని అనుకోవడంలో ఏ సందేహం లేదు. హిందువులు ఏమి అంటారనేది విషయం కాదు. కానీ హిందూ మతం అనేది స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి ఒక ప్రమాదం. ఆ లెక్కన హిందూ మతానికి, ప్రజాస్వామ్యానికి పొత్తు కుదరదు. "హిందూ రాజ్యాన్ని ఏవిధంగానైనా అడ్డుకోవాలి" అని డా. అంబేద్కర్ తన 'పాకిస్తాన్ లేక భారతదేశ విభజన' రచనలో పేర్కొంటాడు.

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని భారతదేశంలో హిందూ రాజ్యాన్ని స్థాపించాలనే ఉద్దేశ్యంతో బిజెపి మళ్ళీ ఒక ప్రమాదకరమైన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ విధంగా వి.డి. సావర్కర్ యొక్క హిందూ జాతీయతావాదానికి లేదా హిందూత్వ వాదానికి కారణభూతమైంది. ప్రారంభ ఫిరంగి బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాచే పేల్చబడింది. కానీ దాని కొనసాగింపు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి వదిలి వేయడం జరిగింది. ఆయన మార్చి 26, 2016న సావర్కర్ యొక్క జాతీయతా వాదాన్ని మెచ్చుకోవడం ద్వారా సంచిలో ఉన్న పిల్లిని బయటికి వదిలాడు. "ఇది మనకు ఒక పెద్ద సవాల్. ఇది ఒక పెద్ద సైద్ధాంతిక సవాల్. మనం దీనిని ఒక సైద్ధాంతిక యుద్ధంగా పరిగణించాలి" (హిందూస్తాన్ టైమ్స్, మార్చి 27, 2016). బిజెపి అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల అనంతరం, అది ఇప్పుడు ఎందుకు? సమాధానం సుస్పష్టం. 2014 ఎన్నికలలో హిందూత్వ కార్డును తెలివిగా దాచిపెట్టి 'అభివృద్ధి' మంత్రాన్ని జపించారు. ఇప్పుడు బిజెపి తన అసలు విశ్వాసం వైపు, తన ఉపదేశకుడు (బోధకుడు), హిందూత్వ సిద్ధాంతకర్త సావర్కర్ వైపు మరలారు. అతడు (సావర్కర్) గాంధీ హత్యకు సంబంధించిన కుట్రలో భాగస్వామిగా ఉన్నాడని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జె.ఎల్. కపూర్‌చే నేరారోపణ చేయబడినాడు.

"మోడీ దేశ వాస్తవ సాంప్రదాయాలు, సంస్కృతి ప్రకారం పనిచేస్తున్నాడు. ఇది హిందూ మతానికి (సనాతన ధర్మ) ఎంతో గర్వ కారణం" అని ఈ సంవత్సరం ఫిబ్రవరి 8న అమిత్‌షా గర్వంగా అంగీకరించాడు. కాశీలో హారతిని వెలిగించడం ద్వారా తాను "మన" సంస్కృతిని రక్షిస్తానని లక్షలాది ప్రజల హృదయాల్లో మోడీ ఆశలు రేకెత్తించాడు. ఆయన (మోడీ) బంకే బీహారీ మందిరాన్ని దీవెనల కొరకు సందర్శించిన అనంతరం బృందావనంలో ప్రసంగించాడు, ప్రియా కంట్జూ దేవాలయాన్ని ప్రారంభోత్సవం చేసాడు. అమిత్‌షా ఉపన్యాసాన్ని (ఫిబ్రవరి 9) నివేదించిన 'ద టైమ్స్ ఆఫ్ ఇండియా' కరస్పాండెంట్ అనూజా జైస్వాల్ అమిత్‌షా ఏమిటో సరిగ్గానే అంచనా వేసింది. 'బిజెపి యొక్క మిషన్ యు.పి. (ఉత్తరప్రదేశ్) 2017 కొరకు, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా, నరేంద్ర మోడీని ఒక వాస్తవ హిందూ జాతీయవాదిగా చిత్రీకరిస్తూ, అతని పాలన దేశంలో భౌతికపరమైన అభివృద్ధికే పరిమితం కాకుండా ఆధ్యాత్మిక అభివృద్ధి కొరకు కూడా వ్యాపిస్తుందని 'గొంతు సవరించుకొని చెప్పడం ద్వారా హిందూత్వ కార్డును ఉ

**"హక్కులు, అధికారాలను బిజెపి తన చేతిలోకి తీసుకోవటం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైనది. ఏ వ్యక్తికి చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకునే హక్కులేదు. ఏది తప్పు, ఏది ఒప్పు అని తేల్చేహక్కు, వాటిని తాను సహించనని చెప్పే హక్కుకూడా ఏ వ్యక్తికి లేదు. చట్ట సభలలో చట్టం చేయకుండా రాజ్యం కూడా ఏ అధికారాన్ని ఉపయోగించలేదు."**

పయోగించాడు. ఎప్పుడైతే అధికారంలో ఉన్నవారు ఆధ్యాత్మిక అవసరాలు తీర్చడం కోసం, తమ మత విశ్వాసాలను ప్రకటిస్తారో, ఎవరైనా ఇబ్బంది పడడమనేది సహేతుకం.

ఇంతకు ముందే ఇలాంటి ప్రయత్నాలన్నీ జరిగాయనేది స్పష్టం. పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ 'భారత్ మాతాకీ జై' అని ఉచ్చరించడాన్ని నిరాకరించడంతో పాటు ఫిబ్రవరి 9న జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో జరిగిన సంఘటనలు వారికి బాగా ఉపయోగపడినాయి.

మార్చి 17, 2016న ఆర్.ఎస్.ఎస్. సహాయ కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే 'భారత్ మాతాకీ జై' అని చెప్పడానికి నిరాకరించిన వారంతా మా దృష్టిలో 'జాతి వ్యతిరేకులే' అని ప్రకటించాడు. అంటే ఆయన సంఘ్ పరివార్ దృష్టిలో జాతీయతావాదం అంటే ఏమిటో ప్రకటించాడు. అదే 'భారతీయ జాతీయవాదం' కానటువంటి 'హిందూ జాతీయవాదం.'

హక్కులు, అధికారాలను బిజెపి తన చేతిలోకి తీసుకోవటం ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమైనది. ఏ వ్యక్తికి చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకునే హక్కులేదు. ఏది తప్పు, ఏది ఒప్పు అని తేల్చేహక్కు, వాటిని తాను సహించనని చెప్పే హక్కుకూడా ఏ వ్యక్తికి లేదు. చట్ట సభలలో చట్టం చేయకుండా రాజ్యం కూడా ఏ అధికారాన్ని ఉపయోగించలేదు.

కానీ అమిత్‌షాను ఏ చట్టాలు నిలువరించలేకపోయాయి. 2016 మార్చి 19, 20 తేదీలలో "బిజెపి కార్యకర్తలందరూ దేశవ్యాప్తంగా జాతి వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని ప్రారంభించాలని" పేర్కొన్నాడు. మార్చి 20, 2016 నాడు బిజెపి జాతీయ కార్యవర్గం ఒక అస్పష్టమైన తీర్మానాన్ని చేసింది.

అరుణ్‌జైట్లీ దృష్టిలో "భారత్ మాతాకీ జై" అనే నినాదం చర్చకు అతీతమైనది. "జాతీయవాదం యొక్క సిద్ధాంతమే స్వంత విశ్వాసాలను, తత్వాన్ని నడిపిస్తుంది". గందరగోళంతో కూడుకున్న ఆలోచనలు, మోటుతనపు వ్యక్తీకరణతో జత కలిశాయి. . జాతీయతావాదం అనేది ఒక భావం మాత్రమే, సిద్ధాంతం కాదు. బిజెపి తత్వంలోని ఏ భాగం దాన్ని నడిపిస్తుంది? కానీ జైట్లీ యొక్క జాతీయతా భావం మాత్రం హిందూ జాతీయవాదమే, భారతీయ జాతీయవాదం కాదు.

ఈ చర్చ జరిగే సమయంలో, అసహనం ఈ దేశంలో దాడి చేస్తున్న సందర్భంలో నరేంద్ర మోడీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆయనకు దేవకాంత బారువాలున్నారు. ఫిబ్రవరి 8న అమిత్‌షా నరేంద్ర మోడీని ఆకాశానికెత్తినట్లు పొగిడితే, మార్చి 20న, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి వెంకయ్యానాయుడు "భారతదేశానికి మోడీ దేవుడిచ్చిన వరం" అని పొగిడాడు. దానికి వెంకయ్యానాయుడు రెండు కారణాలు చూపించాడు. 1) లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మోడీ యొక్క నిలువెత్తు మైనపు విగ్రహం తయారు చేయడం 2) టైమ్ మ్యాగజైన్ ప్రకటించిన 100 మంది ముఖ్యమైన వ్యక్తులలో (2015) మొదటి 30 మందిలో మోడీ ఒకడుగా ఉండటం.

వెంకయ్యానాయుడు లాంటి తిమ్మినిబమ్మిని చేయగల వ్యక్తినుండి అటువంటి వాక్యాలు రావటం దానికి మరింత ప్రాధాన్యతను కల్పించింది. కొంతకాలం క్రితం వెంకయ్యానాయుడు అద్వానీని లోహ్ పురుష్ అని, వాజ్‌పేయిని వికాస్ పురుష్ అని చెప్పాడు. మోడి వారసుని గురించి చెప్పటానికి కూడా ఆయన ఇటువంటి ఉత్సాహాన్నే ప్రదర్శిస్తే ఆయన అదృష్టరేఖ అధ్వాన్న పరిస్థితికి దిగజారిపోయేది. ఉమా భారతి, స్మృతి ఇరానీ, రవిశంకర్ ప్రసాద్ లాంటి కుతర్కవేత్తలతో మోడి క్యాబినెట్ నిండిపోయింది.

**మోడీ మౌనం:**

ది ఎకానమిస్ట్ 5 నెలల క్రితమే ఈ స్థితిని ఊహించింది. హిందూ ఐక్యతకు బిజెపి బహిరంగంగానే ఒక విజ్ఞప్తి చేసింది. ముస్లింలకు అనుకూలంగా వెనుకబడిన హిందువుల యొక్క ప్రత్యేకతలను దూరం చేయడానికి తమ వ్యతిరేకులు ప్రయత్నాలు చేస్తున్నారని మోడి అంటాడు.

గత సంవత్సరం జరిగిన ఎన్నికలలో బిజెపి విజయాన్ని, ఆ పార్టీ యొక్క సమర్థత, సుపరిపాలన గురించి చేసిన వాగ్దానాలకు ఆపాదించబడింది. బిజెపి ఎజెండాలోని హిందూ జాతీయవాదానికి సంబంధించిన భాగం, 2002లో గుజరాత్‌లో జరిగిన ముస్లిం వ్యతిరేక హింసలో మోడీపై వచ్చిన ఆరోపణలు పెద్దగా పట్టించుకోదగిన అంశాలు కాదని నరేంద్రమోడీ ఓటర్లను నమ్మించాడు. హిందూ జాతీయ వాదం మోడీ దృక్పథానికి ఒక మూలస్తంభం అని ఇప్పుడు చాలామంది బాధపడుతున్నారు. అంతకుముందు అధికారంలో ఉన్నప్పుడు బిజెపి పార్లమెంట్‌లో తగిన బలం లేకుండానే పాలన సాగించింది. అందువల్ల గోవధ నిషేధం లాంటి అంశాలను కప్పిపెట్టి ఉంచాల్సి వచ్చింది. ఇప్పుడు బిజెపి పార్లమెంట్‌లో మెజారిటీ, మిత్రపక్షాల మద్దతు అదనంగా ఉన్నప్పటికీ, చాలామంది ఆర్థిక ప్రగతికై అధిక ప్రాముఖ్యతను ఇవ్వవలసి ఉందని ఆశిస్తున్నప్పటికీ పరిమితమైన చర్యలు మాత్రమే తీసుకుంటున్నారు.

బీహార్ ఎన్నికలలో మత రాజకీయాలను చేయాలనే కోర్కె కలిగి ఉండడం, హిందూ మతం పేరుతో అనేక నేరాలకు పాల్పడిన వారిపట్ల చర్యలు తీసుకోవడంలో మోడీ విఫలం చెందడం లాంటి అంశాల వల్ల ప్రజలలో బిజెపి పట్ల అనేక సందేహాలున్నాయి. బహుశా 2019 చివర్లో జరగబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కాబోలు, ఆయన (మోడీ) బిజెపి అనుబంధ హిందూత్వవాదులను దూరం చేసుకోవడం లేదు. వారే ఎన్నికల యంత్రాంగంలో తనకు అవసరమైన మద్దతుదారులు.

మార్చి చివరి వారాంతంలో క్యూబెక్ నగరంలో సుపిందర్ సింగ్ కెహ్రా అనే ఇండో–కెనెడియన్ పైన నలుగురు దుండగులు దాడిచేస్తే యునైటెడ్ స్టేట్స్‌లో ఉన్న ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఆ దాడిని ఖండించాడు. కెనడాలో అలాంటి ద్వేషపూరిత చర్యలకు స్థానం లేదని పేర్కొన్నాడు. మేము ఈ విధమైన వివక్షతకు, అసహనానికి వ్యతిరేకంగా ఉంటామని అన్నాడు. దేశంలో మైనార్టీలపై జరిగే ఆగడాల పట్ల మౌనం వహిస్తున్న నరేంద్రమోడీ యొక్క నిజ స్వరూపం అర్థం చేసుకోవచ్చు. మైనార్టీల పట్ల జరిగే ఆగడాలను ఖండించడం అనేది ఒక దేశ ప్రధానమంత్రి బాధ్యత. ఆయన గొంతు సవరించుకొని ఒక సందేశాన్ని తెలియజేశాడు. మోడీ తన నిశ్శబ్దం ద్వారా తన అనుచరులకు

ఒక భిన్నమైన సందేశాన్ని తెలియపర్చడానికి ప్రాముఖ్యతనిస్తాడు. బిజెపి నాయకుల 'జాతీయ వాదం', జాతి వ్యతిరేక వాదం గురించి అర్థం లేని మాటలన్నీ వారి నైజాన్ని కప్పిపుచ్చుకోవడం కొరకు మాట్లాడేవి. వారు ఎంతో బలంగా నమ్మే హిందూత్వవాదం వారి ద్విజాతి సిద్ధాంతానికి ఒక తొడుగులాంటిది. హిందూత్వవాదం, ద్విజాతి సిద్ధాంతం రెండూ కూడా ఒకే వ్యక్తి, వారి నాయకుడైన సావర్కర్‌చే ప్రతిపాదించి, బలపరచబడినాయి. అతడు (సావర్కర్) తనకు లభించిన విషపూరితమైన వారసత్వానికి తన స్వంత విషాన్ని ఎక్కించాడు.

**లజపతిరాయ్ భావాలు:**

1899లో లజపతిరాయ్ "హిందుస్తాన్ రివ్యూ' లో ఒక వ్యాసాన్ని ప్రచురించాడు. "దానిలో హిందువులను ఒక జాతిగా ప్రకటించాడు. ఎందుకంటే వారు వారిదైన ఒక నాగరికతకు ప్రాతినిధ్యం వహిస్తారు". ఇది కొత్త భావం కాదు. లజపతిరాయ్, ఆర్య సమాజం చేత శుద్ధి చేయబడిన హిందూమతం ఫలితంగా ఏర్పడిన హిందూ జాతీయవాదం యొక్క భావం చేత ప్రత్యక్షంగా ప్రభావితం చేయబడినాడు. 1902లో లజపతిరాయ్ 'హిందుస్తాన్ రివ్యూ', 'కాయస్త సమాచార్' లో ఒక పేరు తెలియని హిందూ జాతీయవాది, పండిట్ మాధవరావుతో కలిసి ఒక చర్చలో పాల్గొన్నాడు. ఆ చర్చ హిందూ జాతీయవాదంపై చర్చకు దారితీసిన పరిస్థితుల గురించి చేయడం జరిగింది.

తాను ప్రతిస్పందించి ఇచ్చిన వివరణలలో అనేకం సావర్కర్ యొక్క రచన 'హిందూత్వ' లోని భావాలకు చాలా దగ్గరగా ఉన్నాయి. 1917లో లజపతిరాయ్, తాను ఒక హిందూ జాతీయతావాదిగా ప్రకటించుకున్నాడు.

1923లో లజపతిరాయ్, ముస్లింలకు నాలుగు రాష్ట్రాలు (పఠాన్ ప్రావిన్స్, పశ్చిమ పంజాబ్, సింధు, తూర్పు బెంగాల్) ఉండాలని వాదించాడు. కానీ ఇది సమైక్య భారతదేశం కాదు అనే విషయం స్పష్టంగా అర్థం చేసుకోవాలని అంటాడు. అంటే దాని అర్థం ముస్లిం భారతదేశం, ముస్లిమేతర భారతదేశంగా విడిపోయే భారతదేశం. లజపతిరాయ్ జాతీయ ఉద్యమంలో భారతదేశంలో రెండు ప్రత్యేక జాతులుండాలని ప్రతిపాదించిన మొట్ట మొదటి నాయకుడిగా పేరు తెచ్చుకున్నాడు.

డా. బి.ఆర్. అంబేద్కర్ మరొక ప్రముఖ సంఘ్ పరివార్ నాయకుడైన లాలా హర్‌దయాళ్ యొక్క ప్రకటన (తాను 'రాజకీయ వాస్తవాలు' అని పిలుచుకున్న 'ప్రతాప్'లో) ఈ సందర్భంగా ప్రస్తావించాడు. "హిందూ జాతి, హిందుస్తాన్,

> **❝ మహ్మద్ అలీ జిన్నా కన్నా ముందే హిందూ మహాసభ అధ్యక్షుడిగా సావర్కర్ ద్విజాతి సిద్ధాంతానికి పదే పదే మద్దతు పలికాడు. ఒక జాతిని నిర్మించే హిందూత్వ సిద్ధాంతం నుండే అది వెలువడింది.❞**



లాలా లజపతి రాయ్

పంజాబ్ యొక్క భవిష్యత్ ఈ నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉన్నదని ప్రకటించాడు. 1) హిందూ సంఘటన 2) హిందూ రాజ్యం 3) ముస్లిం శుద్ధి 4) ఆఫ్ఘనిస్తాన్, సరిహద్దులను వశపర్చుకొని శుద్ధి చేయడం. హిందూ జాతి ఈ నాలుగింటిని సాధించనంత కాలం మన పిల్లల, మనుమలు, మనుమరాండ్ల రక్షణ ప్రమాదంలో పడిపోతుంది. హిందూజాతి యొక్క రక్షణ అసాధ్యమౌతుంది. కానీ హిందూ జాతికి ఒక చరిత్ర ఉన్నది. హిందూ సంప్రదాయాలన్నీ ఒకే విధంగా ఉంటాయి. ముస్లింలు, క్రైస్తవులను హిందుస్తాన్ సరిహద్దు నుండి దూరంగా పంపాలి. దానికి కారణం వారి మతాలు బయటి దేశాలకు చెందినవి. వారు పర్షియన్, అరబ్బు, యూరోపియన్ సంస్థలను ప్రేమిస్తారు.

మహ్మద్ అలీ జిన్నా కన్నా ముందే హిందూ మహాసభ అధ్యక్షుడిగా సావర్కర్ ద్విజాతి సిద్ధాంతానికి పదే పదే మద్దతు పలికాడు. ఒక జాతిని నిర్మించే హిందూత్వ సిద్ధాంతం నుండే అది వెలువడింది. 1937లో అహ్మదాబాద్‌లో జరిగిన హిందూ మహాసభ వార్షిక సదస్సులో సావర్కర్ ఈ విధంగా పేర్కొంటాడు "పిల్ల చేష్టలున్న కొంతమంది రాజకీయ నాయకులు భారతదేశం సామరస్యపూర్వకమైన జాతిగా ఐక్యం చేయబడిందని అనుకొని చాలా పెద్ద తప్పు చేశారు. ఆలోచనలేని ఈ మిత్రులు వార్కి కలలు నిజమౌతాయని అనుకుంటున్నారు. అంగీకారం కానటువంటి ఈ వాస్తవాలను మన మంతా ధైర్యంగా ఎదుర్కోవాలి. నేడు భారత దేశాన్ని కేంద్రీకృతమైన విధానం లేదా సజాతీయ మైన దేశంగా అనుకోవడానికి వీలులేదు. దానికి భిన్నంగా ప్రధానంగా హిందువులు, ముస్లింలు అనే రెండు జాతులు భారత దేశంలో ఉన్నాయి".

తరువాత 1939లో సావర్కర్ ఈ విధంగా పేర్కొంటాడు "హిందువులమైన మేము ఒక కట్టుబడి వుండే జాతిగా గుర్తించుకున్నాం". ఇది (హిందూ జాతి) భారతదేశంలో పుట్టిన వారంతా భారత జాతికి చెందినవారమని చెప్పే "భూభాగ జాతీయవాదాన్ని" దూరంగా ఉంచాలి. ఆయన సాంస్కృతిక జాతీయవాదాన్ని ఎంచుకుంటాడు. హిందూ సంస్కృతిని ఆమోదించే వారే జాతీయవాదులు. ఇది సావర్కర్ ప్రతిపాదించిన సాంస్కృతిక జాతీయవాదం. బిజెపి ఎన్నికల మ్యానిఫెస్టో, ఎల్.కె. అద్వానీ బలపరిచినట్లుగానే గోల్వాల్కర్ ఈ సాంస్కృతిక జాతీయవాదాన్ని బలపరిచాడు. వారంతా భారత జాతీయవాదులా, లేక హిందూ జాతీయవాదులా?

సావర్కర్ ఈ విధంగా ప్రేరేపిస్తాడు "హిందూ సంఘటనిస్టులమైన మనం ముందుగా నిజమైన తప్పిదాన్ని, నిజమైన రాజకీయ పాపాన్ని సరిచేద్దాం. భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమం మొదట్లో హిందూ కాంగ్రెస్ వాదులు అయిష్టంగానే ఆ తప్పులు, పాపాలు చేశారు. ఇప్పుడు భూభాగ భారత జాతీయత అనే భ్రమ వెంట పరుగెత్తుతున్నారు.

**గోల్వాల్కర్ సిద్ధాంతం:**

సావర్కర్ సిద్ధాంతం, 1938లో గోల్వాల్కర్ రచన "వియ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్" లో అర్థం చేసుకోవడం చాలా తేలిక. ఇది 1978లో ఆర్.ఎస్.ఎస్. సంస్థ నాగపూర్ జిల్లా జడ్జి ముందు రూఢీ చేయడానికి సమర్పించింది. 1963 మే 15, ముంబైలో ఉపన్యసిస్తూ

> **“హిందూ జాతి తన ఇష్ట ప్రకారం ఈ దేశం వదిలి వెళ్ళమన్నప్పుడు వెళ్ళి పోవడం. అదే మైనార్టీ సమస్యపై ఆ జాతికి ఉన్న ఉద్దేశ్యం. అది మాత్రమే సరియైన పరిష్కారం. ఆ పరిష్కారం మాత్రమే హిందూ జీవితాలను ఆరోగ్యంగా ఏ ఇబ్బంది లేకుండా చేస్తుంది. అది మాత్రమే జాతిని క్షేమంగా ఉంచుతుంది.”**

గోల్వాల్కర్ “ జాతీయవాదానికి సంబంధించిన నియమాలను శాస్త్రీయంగా సావర్కర్‌చే రచించబడిన ‘హిందూత్వ’ లో వివరించబడినట్లు తాను కనుగొన్నానని, “తనకు ఆ రచన ఒక శాస్త్రీయమైన పాఠ్య పుస్తకమని” పేర్కొంటాడు. అతడు, సావర్కర్ సోదరుడైన బాబారావ్ సావర్కర్‌చే రచించబడిన “ రాష్ట్ర మీమాంస” అనే పుస్తకానికి ఋణపడి ఉంటానని బహిరంగంగా పేర్కొంటాడు. గోల్వాల్కర్ యొక్క స్వంత “బంచ్ ఆఫ్ థాట్స్” సావర్కర్‌చే రచించబడిన ‘హిందూత్వ’ ను ప్రతిబింబిస్తుంది.

1939లో గోల్వాల్కర్ తన ‘వియ్ ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్’లో ఈ విధంగా పేర్కొంటాడు “జీవితానికి సంబంధించిన వ్యక్తిగత, సామాజిక, రాజకీయ మొదలగు అంశాలలో మతం యొక్క మార్గదర్శకత్వంలో, జాతి ఒక సంస్కృతిని అభివృద్ధి చేస్తుంది. 10 శతాబ్దాలుగా తక్కువ విలువలున్న ముస్లింల, యూరోపియన్ల నాగరికతలతో సంబంధాలు దిగజార్చుతున్నప్పటికీ, ప్రపంచంలో ఆ సంస్కృతే ఉన్నతమైనది”.

“జాతిని అర్థం చేసుకునే నవీన పద్ధతిని ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తే, ప్రశ్నించడానికి వీలులేని ముగింపు మనకు అర్థం అవుతుంది. ఈ దేశంలో హిందుస్తాన్, హిందూ జాతి, హిందూ మతం, హిందూ సంస్కృతి, హిందూ భాష



సావార్కర్

అన్నీ కలిపే హిందూ భావం ఏర్పడుతుంది.

“ఎవరైతే హిందూ జాతి, మతం, సంస్కృతి, భాషకు సంబంధించనివారో వారు నిజమైన జాతీయ జీవనానికి సహజంగానే దూరం అవుతారు” అని గోల్వాల్కర్ వివరణ యిచ్చాడు.

“ఆధునిక ప్రపంచం యొక్క శాస్త్రీయమైన జాతి భావనకు అవసరమైన అయిదు అంశాలను సంతృప్తిపరుస్తూ హిందూ రాజ్యం, హిందూ జాతిగా ఉండాలని మేం మరల మరల చెప్తున్నాం. ఆ క్రమంలో హిందూ భావనను బలోపేతం చేయడం, పునర్నిర్మించడం, ప్రస్తుత మత్తు నుండి బయటపడవేసే ఉద్యమాలే జాతీయతా ఉద్యమాలుగా ఉంటాయి. హిందూ జాతి, హిందూ రాజ్యం యొక్క ఘనకీర్తిని పెంచే విధంగా ఉంటూ, ఆ లక్ష్యాలను ఎవరైతే చేరుకుంటారో వారే జాతీయతా భావాలు కలిగిన దేశ భక్తులు. మిగిలిన వారంతా ఈ జాతికి కుట్రదారులైనా లేదా శత్రువులైనా అయి ఉండాలి” అని గోల్వాల్కర్ అంటాడు.

అతని మొరటైన ఉపన్యాసాన్ని అనుచరులు బాగా మెచ్చుకునేవారు. “విదేశీ శక్తులకు రెండే పద్ధతులున్నాయి. ఒకటి హిందూ జాతిలో కలిసిపోయి దాని సంస్కృతిని అనుసరించడం లేదా హిందూ జాతి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి జీవించడం. హిందూ జాతి తన ఇష్ట ప్రకారం ఈ దేశం వదిలి వెళ్ళమన్నప్పుడు వెళ్ళి పోవడం. అదే మైనార్టీ సమస్యపై ఆ జాతికి ఉన్న ఉద్దేశ్యం. అది మాత్రమే సరియైన పరిష్కారం. ఆ పరిష్కారం మాత్రమే హిందూ జీవితాలను ఆరోగ్యంగా ఏ ఇబ్బంది లేకుండా చేస్తుంది. అది మాత్రమే జాతిని క్షేమంగా ఉంచుతుంది. ఈ దృష్టితోనే విదేశీ జాతులు హిందుస్తాన్‌లో హిందూ సంస్కృతిని, భాషను అనుసరించడం, హిందూ మతాన్ని గౌరవించడం నేర్చుకోవడం మరే యితర భావాలను అనుసరించకుండా హిందూ జాతిని, హిందూ సంస్కృతిని ఉన్నతమైనదిగా స్తుతిస్తూ వారి యొక్క ప్రత్యేక ఉనికిని వదులుకొని హిందూ జాతిలో కలిసి దేశంలో ఉండవచ్చు. కాని హిందూ జాతికి లొంగి ఉండాలి. ఏ ప్రాధాన్యతలను, సౌకర్యాలను ఆఖరికి పౌర హక్కులను కూడా కోరకూడదు. ఎట్టి పరిస్థితులలో ఏ ఇతర పద్ధతులను పాటించకూడదు. మనది పురాతన దేశం. పురాతన దేశాలు ఆ దేశంలో నివశించే విదేశీ జాతులతో ఎలా నడుచుకుంటాయో మనం కూడా అదే విధంగా నడుచుకోవాలి. ఈ సిద్ధాంతమే ‘ఘర్ వాపసీ’ కార్యక్రమానికి ప్రేరణ.

‘భూభాగపు జాతీయవాదాన్ని నిరాకరిస్తూ, జాతి అనేది ఏ కారణంగానైతేనేమి, ఎవరైతే ఈ దేశంలో నివశించారో వారందరితోజాతి


**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** ‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక,

ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

ఏర్పడినట్లు చెబుతున్నారని గోల్వాల్కర్ పేర్కొంటాడు. కానీ మేము హిందుస్తాన్‌లో కొన్ని వేల సంవత్సరాలుగా నివసిస్తూ, పూర్తిస్థాయిలో జాతీయ జీవనాన్ని సాగించాము. దేశం, జాతికి సంబంధించిన విషయాలను తప్ప వేరే ఏమీ పట్టించుకోనటువంటి మేము మతతత్వ వాదుల మెలా అవుతాం? నిజమైన జాతీయత కొరకు మేల్కొందాం. మన జాతి యొక్క స్ఫూర్తి మార్గాన్ని అనుసరిద్దాం. దేశంలోని ఒక సముద్రం నుండి వేరొక సముద్రానికి మధ్య ఒకే జాతి, ఒకే వైభవోపేతమైన హిందూజాతి శాంతిని అంద జేస్తుందన్న జోస్యపు సందేశాలతో ఈ స్వర్గాన్ని నింపేద్దాం" అని అంటాడు.


గోల్‌వాల్కర్ యొక్క 'బంచ్ ఆఫ్ థాట్స్' ను ఎంతో శ్రద్ధతో పరివార్ సభ్యులు అధ్యయనం చేసి కొన్ని నిర్ధారణలకు రావడం జరిగింది. హిట్లర్ యొక్క రచన మీన్‌కాంప్ నాజీలకు ఎలానో 'బంచ్ ఆఫ్ థాట్స్' సంఘ్ పరివార్‌లకు అలాంటిది. ప్రతి పాఠానికి పెట్టిన పేర్లు రచయిత యొక్క మానసిక స్వభావాన్ని తెలియ జేస్తుంది. అవి 1) "భూభాగపు జాతీయతా వాదం" (అతడు నిరాకరించేది), "ఆంతరంగిక బెదిరింపులు" (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు).

ఇవన్నీ గోల్వాల్కర్ తెలివితేటలను ప్రతిబింబిస్తాయి. "వాస్తవానికి మేము మా తల్లి గర్భం నుండి రావడానికి ముందు నుండే హిందువులం. కాబట్టి మేము హిందువులుగా పుట్టాం. ఇతరులు ఈ ప్రపంచంలో మామూలుగా ఏ పేరు లేనటువంటి మానవులుగా పుట్టిన తరువాత సున్తీ చేయించుకోవడం లేదా బాప్టిజం తీసుకోవడం వలన వారు ముస్లింలుగా, క్రైస్తవులుగా అవతరించారు."

'కేవలం కొద్దిమంది ముస్లింలు మాత్రమే ఇక్కడికి శత్రువులుగా, దురాక్రమణదారులుగా వచ్చారన్న విషయం ప్రతి ఒక్కరికి తెలుసు. అదేవిధంగా విదేశీ క్రైస్తవ మిషనరీలు కూడా చాలా తక్కువ సంఖ్యలోనే వచ్చారు. ఇప్పుడు క్రైస్తవులు, ముస్లింలు చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. చేపలు పునరుత్పత్తి ద్వారా వాటి సంఖ్యను పెంచుకున్నట్లుగా, వారు (క్రైస్తవులు, ముస్లింలు) పెరగలేదు. వారు స్థానిక ప్రజానీకాన్ని మత మార్పిడి చేశారు. హిందూ మతాధీనంలో నుండి ఒక భాగాన్ని తీసుకొని వెళ్ళి కొంతమంది ముస్లింలుగా, కొంతమంది క్రైస్తవులుగా మారారన్న విషయం మా పూర్వీకుల నుండి తెలుసుకోగలం. మిగిలినవారు మత మార్పిడి చేసుకోలేదు. వారే హిందువులుగా మిగిలివున్నారు.

"శతాబ్దాల తరబడి మత బానిసత్వంతో ఒంటరిగా, విచారంతో బాధపడుతున్న మా సోదరులను సొంత యింటికి పిలవడం మా బాధ్యత. బానిసత్వపు విధానాలను, ఆధిక్యతలను కూలదోసి మన పూర్వీకుల జీవన విధాన మార్గాలను అనుసరించండి, అన్ని రకాల బానిసత్వాలు మన తత్వానికి సరిపడవు కాబట్టి వాటిని విడనాడండి. మత మార్పిడులు చేసుకున్న సోదరులను జాతీయ జీవనానికి సొంత ఇంటికి రమ్మని పిలుస్తున్నాం. సొంత ఇల్లు విడిచివెళ్ళి అన్ని విధాల నష్టపోయిన సోదరులు తిరిగి వచ్చిన వెంటనే మనందరం దీపావళి పండుగ వేడుక చేసుకుందాం. ఈ విషయంలో బలవంతం ఏమీలేదు. ఇది కేవలం విషయాలను సరిగా అర్థం చేసుకొని, తిరిగి వచ్చి పూర్వీకుల హిం దూ జీవన మార్గాన్ని, వస్త్రధారణలో, సాంప్రదా యాలలో, వివాహ కార్యక్రమాలలో, కర్మకాండ లలో అనుసరించాలని కోరుతున్నాం". ఇప్పటికే మనకు తెలుసు, అదే ఘర్‌వాపసీ కార్యక్రమం.

> "వాస్తవానికి మేము మా తల్లి గర్భం నుండి రావడానికి ముందు నుండే హిందువులం. కాబట్టి మేము హిందువులుగా పుట్టాం. ఇతరులు ఈ ప్రపంచంలో మామూలుగా ఏ పేరు లేనటువంటి మానవులుగా పుట్టిన తరువాత సున్తీ చేయించుకోవడం లేదా బాప్టిజం తీసుకో వడం వలన వారు ముస్లింలుగా, క్రైస్తవులుగా అవతరించారు."



గోల్వాల్కర్

"ఇక్కడ ఇప్పటికే పూర్తిస్థాయిలో ఉన్న హిందూ పురాతన జాతి ప్రజలు ఉన్నారు. వివిధ కులాలకు చెందినవారు, యూదులు, ఫార్శీలు అతిథులుగా, ముస్లింలు, క్రైస్తవులు దురాక్రమణదారులుగా ఈ దేశంలో నివశిస్తున్నారు. భిన్నమైన గ్రూపులకు చెందిన వీరు ఈ దేశానికి చెందిన వారు ఎలా అవుతారనే ప్రశ్న వారు ఎదుర్కొనలేదు. ఎందుకంటే వారు అనుకోకుండా ఒకే భూభాగంలో ఒకే శత్రువు పాలనలో నివసించవలసి వచ్చింది".

భూభాగ జాతీయవాదం, అందరూ ఎదుర్కొనే ప్రమాదానికి సంబంధించిన సిద్ధాంతాలు, వాస్తవ హిందూ జాతీయవాదం పట్ల స్ఫూర్తిదాయకమైన, సానుకూలమైన విధానం లేకుండా చేశాయి. స్వాతంత్ర్యం కొరకు జరిగిన అనేక ఉద్యమాలను దాదాపుగా బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాలుగా ఆ సిద్ధాంతాలు తయారుచేశాయి. బ్రిటిష్ వ్యతిరేకతను దేశభక్తితో, జాతీయ వాదంతో సమానం చేశాయి. దీని ఫలితంగా స్వాతంత్ర్య పోరాటంపైన, పాల్గొన్న నాయకుల పైన,ప్రజలపైన అనేక దుష్ప్రభావాలు పడినాయి.

ముస్లింల విషయానికి వస్తే, వారు దురాక్రమణదారులుగా వచ్చారు. వారే విజేతలుగా, 1200 సంవత్సరాలు పాలకులుగా భావించుకున్నారు. ఆ అభిప్రాయం వారి మనసులలో ఇప్పటికీ ఉన్నది. వారి విరోధం కేవలం రాజకీయమైనది కాదని చరిత్ర రికార్డులలో ఉన్నది. ఒకవేళ ఆ విరోధం రాజకీయమైనదే అయి ఉంటే అతి కొద్దికాలంలోనే వారు జయింపబడి ఉండేవారు. కానీ ఇది చాలా లోతైన విషయం. మనం ఏది నమ్మినా, ముస్లింలు మాత్రం మొత్తంగా విరోధులుగానే ఉన్నారు. మనం దేవాలయంలో పూజిస్తే, వారు దానిని అపవిత్రం చేస్తారు. మనం భజనలు, రథయాత్రలు చేస్తే వారికి అది కోపం తెప్పిస్తుంది. మనం ఆవును పూజిస్తే, వారు ఆవు మాంసం తినడానికి ఇష్టపడతారు. మనం స్త్రీని పవిత్రమైన మాతృత్వానికి గుర్తుగా స్తుతిస్తే వారు ఆమెను లైంగికంగా అనుభవించాలనుకుంటారు. మతపరంగా, సాంస్కృతికంగా, సామాజికంగా మొదలైన జీవన మార్గాలలో కింద నుండి పైదాకా వారు వ్యతిరేకంగా ఉంటారు. వారు ఆ పగను నిలువెల్లా ఏర్పర్చుకుంటారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ మొదటిసారి లోక్‌సభలో ఆ 1200

**"అసమర్థపాలన, అధికారం కోసం అర్రు లు చాచటం, భిన్నాభిప్రాయాలున్న వారిపట్ల అసహనం ప్రదర్శించడం, మైనార్టీల పట్ల ద్వేషం పెంచుకోవడం, స్వయం ప్రతిపత్తి కలిగిన సాం స్కృతిక, విద్యా సంస్థలను, ముఖ్యంగా యూని వర్శిటీలను అణచివేయడం లాంటి వాటితో భారత జాతీయవాదానికి ద్రోహం చేస్తున్న వారితో ఒక దండు మన గొప్పదేశంలో దిగిం ది."**

సంవత్సరాల గురించే తన ప్రసంగంలో ప్రస్తావించాడు.

బ్రిటిష్ వారిచే ఇవ్వబడిన 'ఇండియా' అనే పేరు అంగీకరించబడింది. 'ఇండియన్ నేషన్' అనే ఒక క్రొత్త పేరు పిలవబడింది. హిందువును తనను తాను 'ఇండియన్' గా పేరు పెట్టుకొమ్మని అడగడం జరిగింది. సావర్కర్, గోల్వాల్కర్, బిజెపిలు మద్దతు పలికింది ఆ జాతీయవాదానికే, అంతేగాని భారత జాతీయవాదానికి కాదు. 1969లో బిజెపి కన్నా ముందున్న జనసంఘ్ 'ఇండియనైజేషన్'ను పునరుద్ధరించమని మొరపెట్టుకొంది. 1969 డిసెంబర్ 30న పాట్నాలో జరిగిన సమావేశంలో చేసిన తీర్మానం దానిని ప్రోత్సహించింది. "జాతీయవాదాన్ని బలపరిచి, పునరుద్ధరించ దానికి శ్రమించాలి. ఏ దేశంలోనైనా ఐక్యంగా ఉండే శక్తులకు ఇది బలం. జాతీయవాదం భావనకు, దాని ముఖ్యమైన భాగాలకు మధ్య స్పష్టమైన అవగాహన అవసరం... పి.డి. చట్టానికి కాలం తీరిపోవటంతో రాజద్రోహానికి సంబంధించి చట్టం చేయటం అవసరం. ఈ చట్టం విద్రోహాన్ని, విద్రోహ చర్యలను నిర్వచించాలి".

**బిజెపి ఎన్నికల ప్రణాళిక:**

బిజెపి ఎన్నికల ప్రణాళిక 'సాంస్కృతిక జాతీయవాదం" యొక్క సూత్రాలను వివరించుతుంది. వాటిలో కొన్నింటిని పైన ఉటంకించడం జరిగింది. 1998 నాటి ప్రణాళికలో "మన జాతీయ గుర్తింపు, సాంస్కృతిక జాతీయవాదం" ప్రధానమైనది. ఇది చాలా సరళమైన భాషలో చెప్పబడింది. "మన జాతీయతా దృష్టి భారత్ యొక్క భౌగోళిక లేక రాజకీయ గుర్తింపుతో చేయబడింది కాదు. కానీ ఇది ఎంతోకాలంగా ఉన్న మన సాంస్కృతిక వారసత్వంగా వస్తున్న అంశం. అన్ని ప్రాంతాలకు, మతాలకు, భాషలకు కేంద్రమైన ఈ సంస్కృతి వారసత్వం ఒక నాగరికతకు గుర్తింపు. ఇదే భారతదేశం యొక్క సాంస్కృతిక జాతీయవాదాన్ని నిర్మిస్తుంది. అదే హిందూత్వవాదానికి ప్రధానమైనది. ఇదే మన పురాతన దేశం 'భారతవర్ష' యొక్క గుర్తింపు అని మనం నమ్ముతున్నాం.

హిందూత్వవాదం ఈ దేశాన్ని తిరిగి శక్తివంతం చేయడానికి, దానిని నిర్మించడానికి, అదుపు చేయడానికి అపారమైన సామర్థ్యం ఉన్నదని బిజెపి నమ్మింది. అది ఈ దేశాన్ని మంచి అద్భుతకృత్యం చేయగల, సామర్థ్యం కలిగిన దేశంగా మార్చడానికి అవసరమైన ఉన్నతస్థాయి దేశభక్తిని ప్రేరేపించగలదు. ఇలాంటి ఐక్యపరచే భావాలను దృష్టిలో ఉంచుకొని బిజెపి అయోధ్యలో రామ మందిర నిర్మాణం కొరకు రామ జన్మభూమి ఉద్యమంలో చేరింది."

2004 ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ విధంగా స్పష్టం చేయబడింది. "సాంస్కృతిక జాతీయవాదం, భారతదేశ చరిత్ర, నాగరికతల నుండే బిజెపి స్ఫూర్తి పొందింది. కులం, ప్రాంతం, మతం, భాషల తేడాలను నిలువరించే ప్రజల మధ్య ఉండే లోతైన సాంస్కృతిక బంధాన్ని భారత జాతీయతా భావం నిలుపు చేస్తుందని మేము నమ్ముతాం. భారతీయతకు, హిందూత్వ వాదానికి పర్యాయపదంగా వాడబడే సాంస్కృతిక జాతీయవాదమే మా జాతీయ గుర్తింపుకు పునాది అని మేము నమ్ముతాం".

భారత జాతీయవాదం, హిందూ జాతీయవాదం మధ్య ఉన్న ఈ వ్యతిరేకతను అందరూ గమనించారు. డా. డి.ఆర్. పురోహిత్ యొక్క విశ్లేషణలో చాలా స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. డా. బేనీప్రసాద్ ఈ విధంగా పేర్కొంటాడు "హిందూ, భారత జాతీయ వాదాలు రెండూ ప్రాథమికంగా వాటి ఆదర్శాలలో పరస్పర విరుద్ధంగా ఉంటాయి. హిందూ జాతీయవాదం ఉన్నత వర్గాలకు చెందినది. సంకుచితమైనది. మతంతో ముడిపడి ఉన్నది, పాక్షికమైనది. అది హిందువులను మాత్రమే హిందుస్తాన్‌లోని జాతీయవాదులుగా పరిగణించింది. భారతదేశంలోని ఇతర ప్రజలను తన పరిధిలో చేర్చుకోలేదు. అది ఇతర మతస్తులపట్ల ద్వేష భావాన్ని, కోపాన్ని, శతృవైఖరిని పెంచుకుంది. భారత జాతీయవాదం భారతదేశం యొక్క భిన్న సంస్కృతుల కలయిక పట్ల నమ్మకం కలిగి ఉన్నది. అన్ని వర్గాల ప్రజలు జీవిస్తున్న భారతదేశాన్ని ఒక జాతిగా చూపింది. అది విశాల దృక్పథం కలిగినది. శాంతికాముకమైనది. లౌకిక, ప్రజాస్వామిక, ఉదారవాద తత్వం కలిగి ఉన్నది. హిందూ జాతీయవాదం, ఇతర మతాల కన్నా హిందూ మతమే గొప్పదని స్తుతించింది. భారత జాతీయవాదం భిన్నవర్గాల ప్రజల భిన్నత్వంలో ఏకత్వాన్ని నొక్కి చెప్పింది. ఒకటి కేంద్రీకృత నాయకత్వంపైన , పోరాట తత్వంపైన విశ్వాసం ఉంచింది. భారత జాతీయ వాదం ఉదారవాద ప్రజాస్వామిక సాంప్రదా యాలతో పెనవేసుకున్నది."

"ఆ విధంగా హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) చే బలపర్చబడిన హిందూత్వ జాతీయవాద శక్తులు 1930, 1940లలో పెరుగుతున్న భారత జాతీయవాదానికి ఒక పెద్ద సవాల్‌ను విసిరాయి. ఇది రెండు భావ జాలాలకు మధ్య ఉనికికి సంబంధించిన పోరాటం. అందువల్ల ఆ రెండు శత్రు భావజాలాల మధ్య సహకారానికి కొద్ది అవకాశం మాత్రమే ఉన్నది. అదే విధంగా హిందూ జాతీయవాదం తన పరిమితమైన ఆదర్శాలకు అంటిపెట్టుకొని, జాతీయవాదంపై సమగ్రమైన దృష్టిని కోల్పోయింది. అది భారత జాతీయ ఉద్యమ పెరుగుదలను అడ్డుకున్నది". హిందూత్వ లేక హిందూ జాతీయవాదమే నిజమైన జాతీయవాదం అని నేడు 2016లో కూడా తన అనైతిక పాత్రను కొనసాగిస్తుంది. అదే విధంగా భారత జాతీయవాదులందరిని జాతి వ్యతిరేకులుంగా పేర్కొంటూ తీవ్రమైన విమర్శలు చేస్తున్నది. ద్విజాతి సిద్ధాంతానికి మృదువైన రూపంలో ఉన్న హిందూత్వ ఈ నకిలీ జాతీయవాదులను బయటపెట్టింది.

అసమర్థపాలన, అధికారం కోసం అర్రులు చాచటం, భిన్నాభిప్రాయాలున్న వారిపట్ల అసహనం ప్రదర్శించడం, మైనార్టీల పట్ల ద్వేషం పెంచుకోవడం, స్వయం ప్రతిపత్తి కలిగిన సాంస్కృతిక, విద్యా సంస్థలను, ముఖ్యంగా యూనివర్శిటీలను అణచివేయడం లాంటి వాటితో భారత జాతీయవాదానికి ద్రోహం చేస్తున్న వారితో ఒక దండు మన గొప్పదేశంలో దిగింది. వీరు చేస్తున్న చర్యలు ఎల్.కె. అద్వానీ ప్రకటించినట్లుగా కేవలం మెజార్టీ మతస్తుల లాభం కోసమే పనిచేస్తుందని బహిరంగంగా ప్రకటించిన ప్రభుత్వం ఇది.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

## కామ్రేడ్ బోడేపూడి వెంకటేశ్వరరావు

(2వ పేజీ తరువాయి)

యణ, కొమురయ్య వంటి పలువురు నేతలను తోడు చేసుకొని సింగరేణిలో రహస్య యూనియన్ నిర్మాణానికి పూనుకున్నారు. అంతటి బాధ్యతల్లో ఉన్న శేషగిరిరావుకు బోడేపూడి కొరియర్‌గా పనిచేశారు.

రహస్యంగా వచ్చే పార్టీ పత్రికలను శేష గిరిరావుకు అందించే బాధ్యత బోడేపూడి తీసుకున్నారు. రహస్య పత్రికలు వారానికి రెండుసార్లు బోడేపూడి చేతికందేవి. వాటిని శత్రువుల కంట పడకుండా గండగలపాడు నుంచి తీసుకెళ్లి భద్రంగా శేషగిరిరావుకు అందించడం బహు కష్టంగా ఉండేది. అందువల్ల అత్యంత చాకచక్యంగా కాలినడకన గండగలపాడు నుంచి కొత్తగూడేనికి వెళ్లి అందించేవారు. ఆయనీ పనిని పరిపూర్తి చేయడానికి వివిధ వేషధారణలతో వెళ్లాల్సి వచ్చేది.

బోడేపూడి అలా పలుసార్లు వెళ్తుండటాన్ని పోలీసులు గమనించారు. కొత్తగూడెం నాగేశ్వర్ టాకీస్ వద్ద ఒక చెరువుంది. ఓ తెల్లవారుజామున ఆయన పత్రికలను తీసుకొని వెళ్తూ అక్కడ కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఆ సమయంలో పోలీసులు ఆయనను చూశారు. వారాయన గురించి తెలుసుకునేందుకు సమీపిస్తుండగా ఉన్నట్టుండి పత్రికలను తీసుకుని చెరువులోకి దూకేశారు. ఎంతసేపటికీ నీళ్లలో మునిగిన బయటకు రాకపోవడంతో ఆయన మరణించాడని భావించిన పోలీసులు అక్కణ్నుంచి వెళ్లిపోయారు. ఆ తరువాత బోడేపూడి నీళ్లలో నుంచి బయటకు వచ్చారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఉద్యమాన్ని రక్షించుకోవడం బోడేపూడికి చిన్నప్పట్నించీ అలవాటుగా మారింది.

బోడేపూడి 1947లో కృష్ణాజిల్లా గంపలగూడెం సమీపంలోని నెమలి గ్రామంలో రహస్య జీవితం గడుపుతుండగా పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయమేర్పడింది. నెమలిలోనే పెద్ద సాయుధ శిక్షణశాల ఏర్పాటయింది. బొంబాయి ప్రసాద్ (వీరమాచినేని ప్రసాద్) దీనికి కమాండర్‌గా ఉండేవారు. వీరి నేతృత్వంలో నైజాం సరిహద్దునున్న కృష్ణా జిల్లాలో మొఖాసాదారీ, జమీందారీ దురాగతాలపై దాడులు చేసేవారు. అలాగే ఈ సరిహద్దుకు ఆవలివైపున్న నైజాం ప్రాంతంలోనూ ప్రతిఘటన చేసేవారు. బోడేపూడి నెమలిలో ఉంటూనే మిగతా కామ్రేడ్స్‌తో కలిసి వీటిని సమన్వయం చేసేవారు.

బోడేపూడి.. కృష్ణాజిల్లా గుడివాడ ప్రాంతం నుంచి గండగలపాడు వచ్చి స్థిరపడిన కాజ రాధాకృష్ణమూర్తి వంటివారిని పార్టీ వైపునకు తీసుకువచ్చారు. బోడేపూడి సూచనపై రాధాకృష్ణమూర్తి నెమలిలో సాయుధ దళాలకు ఇస్తున్న శిక్షణలో పాల్గొన్నాడు. తర్వాత ఆయన నెమలి, ఆ చుట్టుపక్కల జమీందారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున సాగిన రైతాంగ సాయుధ ప్రతిఘటనోద్యమాల్లో పాల్గొన్నారు. బోడేపూడి మధిర, వైరా ప్రాంతాల్లో పొరుపల్లి పుల్లయ్య నాయకత్వంలో పనిచేసిన దళానికి రాజకీయ ఆర్గనైజర్‌గా కూడా ఉన్నారు. బోనకల్లు ప్రాంతం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పుల్లయ్యపై మధిరలో రైలు పట్టాలు తొలగించిన కేసు, నిజాం మూకలు రాకుండా సిరిపురంలో వంతెన కూలిగొట్టిన కేసు, చెట్లు నరికిన కేసులున్నాయి. శత్రువుకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. పార్టీ నిర్ణయం మేరకు.. అకారణంగా ప్రజలను దారుణాతి దారుణంగా చిత్రహింసలు పాల్జేసే గార్లఒడ్డు జమీందారును ఖతం చేశారు. అంత లోతైన బాధ్యతల్లో ఉన్న పుల్లయ్య దళానికి బోడేపూడి రాజకీయ ఆర్గనైజర్‌గా ఉన్నారు.

తెలంగాణా సాయుధ పోరాట విరమణానంతరం కమ్యూనిస్టు పార్టీ పిడిఎఫ్ పక్షాన అభ్యర్థులను నిలబెట్టగా మధిర నుంచి కొండబోలు వెంకయ్యను గెలిపించడంలో బోడేపూడి ప్రధాన పాత్ర వహించారు. 1947లో కమ్యూనిస్టు పార్టీ మధిర తాలూకా కమిటీ సభ్యుడుగా ఎన్నికైన బోడేపూడి, ఆ తర్వాత (1952 నుంచి 1955 వరకూ) తాలూకా కార్యదర్శిగానూ పని చేశారు. 1958లో పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యారు.

1960లో కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా బాధ్యతలు చేపట్టారు. 1964లో పార్టీలో చీలిక అనంతరం ఆయన సిపిఎం వైపు నిలబడ్డారు. ఆయనపై చైనా ఏజంటనే ముద్రవేసి అదే యేడు డిసెంబరు 29న జైల్లో పెట్టారు. 1966 మార్చిలోగానీ ఆయన్ను విడుదల చేయలేదు. 1968 నుంచి రాష్ట్ర కమిటీ సభ్యులయ్యారు. అదే సందర్భంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడుగా 1979 వరకూ బాధ్యతలు నిర్వహించారు. 1979లో పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ కాలంలోనే (1985లో) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా కార్యదర్శిగా 1989 వరకూ బాధ్యతలు నిర్వర్తించారు.

బోడేపూడి మూడుసార్లు 1985, 1989, 1994ల్లో మధిర శాసనసభ్యుడుగా విజయం సాధించారు. 1994లో ఆయన సిపిఎం పక్షాన గెలుపొందిన శాసనసభ్యుల బృందానికి శాసన సభలో నాయకుడుగా వ్యవహరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడ ఏ మూల ప్రజా సమస్య వచ్చినా అక్కడికి వెళ్లి వారికి అండగా నిలిచారు. దివిసీమ ఉప్పెన, అనంతపురం రైతు ఆత్మహత్యలు, పాలమూరు వలసలు, విశాఖ కార్మిక సమస్యలు.. ఇంకా కూలీ, కార్మిక, భూ పోరాటాలు ఎక్కడ జరుగుతున్నా ఆయన అక్కడ ఉండేవారు. కేవలం ప్రాథమిక విద్య మాత్రమే చదివిన బోడేపూడి ఒక విప్లవ పార్టీ పక్షాన గెలిచిన శాసనసభ్యుల బృందానికి నాయకుడుగా వ్యవహరించమేగాకుండా, శాసనసభలో అనేక అసాధారణ ప్రసంగాలు చేశారు. ఆయన ప్రసంగాన్ని సభ్యులు శ్రద్ధగా వినేవారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పీడిత ప్రజలకు ఎన్నో సేవలందించారు. ఆయన 1997 ఆగస్టు 5న కన్నుమూశారు.


పెద్దగా చదువులేని మట్టిలో మాణిక్యం.. అరుదైన విప్లవకారుడు బోడేపూడి పేరిట.. ఖమ్మం నగరంలో పార్టీ జిల్లా కమిటీ "బోడేపూడి విజ్ఞాన కేంద్రం" (బివికె) ఏర్పాటు చేసింది. ఈ విజ్ఞాన కేంద్రం ఎందరిలోనో విజ్ఞాన వీచికలు విరజిమ్ముతూ.. చైతన్య కాంతులను ప్రసరింపచేస్తోంది. ఎంతోమందిని అభ్యుదయవాదులుగా, ప్రగతిశీలురుగా, ప్రజాతంత్రవాదులుగా తీర్చిదిద్దుతోంది. ❋

### పాఠకుల అభిప్రాయాలు

## విజన్ 2029 బూటకం

కామ్రేడ్ బివి రాఘవులు గారి వ్యాసం **'కార్పొరేట్లకు లాభం ప్రజలకు త్యాగం విజన్ 2029'** వ్యాసం సంక్షిప్తంగా ఉన్నా అనేక అంశాలను వెలుగులోనికి తీసుకొని వచ్చింది. విజన్ 2020 అనుభవం మనకు ఉంది. టేబుల్ 1 నుండి 5 వరకు స్థూల ఉత్పత్తి, సగటు తలసరి ఆదాయం, అక్షరాస్యత, శిశు మరణాలు, సాగుభూమి వివరాలు సంక్షిప్తంగా పొందుపరిచారు. కారుచౌకగా లేక ఉచితంగా ప్రైవేటు కంపెనీలకు భూమి ఇవ్వడానికి 4 లక్షల ఎకరాల భూసేకరణ ఇప్పటికే జరిగింది. నిర్వాసితుల సంఖ్య లక్షలలో పెరుగుతున్నది. ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. వైద్యం, విద్యారంగాలు కార్పొరేట్ శక్తుల ఆధీనంలో ఉన్నాయి. నిరుద్యోగుల సంఖ్య పెరగుతున్నది. పెట్టుబడిదారులకు రాయితీలు ప్రజలపై భారాలు. రాఘవులు గారికి అభినందనలు. విజన్-2029 మొత్తం సమాచారం పుస్తక రూపంలో తీసుకొని రావలసిందిగా కోరుతున్నాను. **– తుంపాల శ్రీరామమూర్తి, గాజువాక**

# కార్మికసంఘాలు తటస్థంగా ఉండటం అంటే పెట్టుబడిదారీ వర్గానికి సేవ చేయటమే



**– జార్జి డిమిట్రోవ్**

“కార్మిక సంఘాలు తటస్థంగా ఉండాలనేది పూర్తిగా బూర్జువావర్గపు భావన. రాజకీయంగా తటస్థంగా ఉండటం అనే ముసుగులో పెట్టుబడిదారులు, కార్మికవర్గ ఉద్యమంలోని వారి ఏజంట్లు ( మితవాద సోషలిస్టులు, వివిధ రకాలైన ‘ కార్మికమిత్రులు’, సామాజిక సంస్కరణవాదులు) శ్రామికవర్గ వర్గపోరాటాల నుండి కార్మికసంఘాలను దూరం చేయటానికి, పెట్టుబడిదారుల పరిపాలనను కొనసాగించటానికి వాటిని సాధనాలుగా వినియోగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు.

“వాస్తవానికి ఏదేశంలోనూ, ఎప్పుడూ కార్మికసంఘాలు తటస్థంగా లేవు. కార్మికవర్గ చరిత్ర దీనిని రుజువు చేస్తున్నది. కార్మికసంఘాలు ఎప్పుడూ ఒకరూపంలోనో మరోరూపంలోనో రాజకీయ పోరాటాలలో భాగస్వాములవుతూ, కార్మికవర్గ ప్రయోజనాల కోసం పనిచేసూ, బూర్జువా వర్గంతో పోరాడుతుంటాయి. లేకపోతే అధికారం ద్వారా సంక్రమించే ప్రయోజనాలను పొందటానికి బూర్జువాపార్టీలు తమలోతాము చేసుకొనే అంతర్గత పోరాటంలో తమను వినియోగించుకోవటానికి అవకాశం కల్పిస్తూ, కార్మికవర్గం తమ విముక్తి కోసం చేస్తున్న పోరాటానికి వ్యతిరేకంగా బూర్జువావర్గం చేస్తున్న పోరాటంలో కూడా తరచుగా బూర్జువావర్గానికి అనుకూలంగా పనిచేస్తూ బూర్జువావర్గ సేవలో ఉంటాయి.

“కార్మికవర్గ తటస్థత అంటే ఏమిటి అనేదానికి మంచి ఉదాహరణ ప్రపంచయుద్ధం సందర్భంలో చూడవచ్చు. జర్మని, ఫ్రాన్స్, గ్రేట్‌బ్రిటన్, అమెరికాలలోని ‘తటస్థ’, ‘స్వేచ్ఛ’గా ఉండే కార్మికసంఘాలు తమదేశాల బూర్జువావర్గాల యుద్ధోన్మాద విధానాలను బలపరిచి, కార్మికవర్గ విముక్తి పోరాటానికి ద్రోహం చేశాయి.

“పెట్టుబడికి శ్రమకు మధ్య జరిగే పోరాటంలో తమ స్వభావరీత్యానే ప్రత్యక్షంగా పాల్గొనే కార్మిక సంఘాలను తటస్థంగా ఉన్నాయని చెప్పటం సరైనదేనా? వర్గ వైరుధ్యాలు అత్యున్నతస్థాయికి చేరిన, పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గం ఒక వర్గానికి వ్యతిరేకంగా మరొక వర్గం మోహరించి ఉన్న పరిస్థితులలో, కార్మికవర్గ అంతర్జాతీయ విప్లవం ప్రారంభమైన ప్రస్తుత దశలో, కార్మికవర్గ తటస్థతను గురించి మాట్లాడటానికి అవకాశాలు తక్కువగా ఉన్నాయి.

“తమ వర్గ రాజకీయపార్టి పట్ల కార్మికవర్గం తటస్థంగా ఉండటం అంటే బూర్జువావర్గంపై ఆధారపడి ఉండటం, కొన్ని బూర్జువా పార్టీలకు సేవచేయటం అవుతుంది. జరుగుతున్న కార్మికవర్గ విప్లవం పట్ల తటస్థంగా ఉండటం అంటే విప్లవానికి వ్యతిరేకంగా బూర్జువావర్గం చేస్తున్న ప్రతీఘాతుక విప్లవానికి సహాయం చేయటమే అవుతుంది.

“పెట్టుబడికి వ్యతిరేకంగా కార్మికులతోనైనా ఉండాలి. లేదా కార్మికులకు వ్యతిరేకంగా పెట్టుబడితోనైనా ఉండాలి. అయితే విప్లవం వైపున ఉండాలి. లేకపోతే ప్రతీఘాత విప్లవ శిబిరంలో ఉండాలి. మధ్యేమార్గం అనేదేలేదు.

“ఈ సందర్భంలో తటస్థత, స్వతంత్రత వ్యక్తమయ్యే రూపాలకు ఏ మాత్రం ప్రాధాన్యత ఉండదు. దాని సారాంశం ఏమిటనేదే ప్రధానమైనది. కొన్ని కార్మికసంఘాలు లాంఛనంగా తటస్థంగా, లేక స్వతంత్రంగా ఉన్నట్లుగా భావించుకొంటుంటాయి. కాని వాస్తవంలో అలాంటిదేమీ ఉండదు. అవి అనివార్యంగా ఒకవైపుకో లేదా మరోవైపుకో వెళ్ళాల్సి ఉంటుంది. పోరాడుతున్న రెండు శిబిరాలలోని ఒకదాని వైపునో లేదా మరోదాని వైపునో ఉంటాయి.

“శ్రామికవర్గ రాజకీయ నిర్మాణం, పోరాటాల పట్ల కార్మికసంఘాల తటస్థతను, స్వతంత్రాన్ని గురించి బూర్జువా వర్గం చేసే అసత్య ప్రచారాలను శ్రామికవర్గ పోరాటాల చారిత్రక అనుభవం ఖండించటమే కాక, కార్మికసంఘాలు, కమ్యూనిస్టు పార్టి మధ్య మరింత ఐక్యత అవసరం అని స్పష్టం చేస్తున్నది. శ్రామికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోయటానికి, శ్రామికవర్గ నియంతృత్వాన్ని ఏర్పాటు చేయటానికి, కమ్యూనిస్తు సమాజాన్ని సాధించటానికి ఈరోజు సాగుతున్న వృత్తిపరమైన, రాజకీయ పరమైన పోరాటాలలో కార్మికసంఘాలు, కమ్యూనిస్తు పార్టిల మధ్య పూర్తి నిర్మాణపరమైన ఐక్యత అవసరం అవుతున్నది”.

**(జార్జి డిమిట్రోవ్ రచించిన ‘ కార్మికసంఘాల కర్తవ్యాలు’ వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది.)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.3. Published on July 1, 2016